Dwaraka
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం | 22-1-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 277 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి సా. 4.25 తదుపరి షష్ఠి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 7.06 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: సా. 5.06-6.47; దుర్ముహూర్తం: మ.12.50-1.34, మ.3.03-3.48; అమృతఘడియలు: తె. 3.08-4.48; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

నియోజకవర్గాల్లో ఎవరు బలంగా ఉన్నారో.. ఎవరు బలహీనంగా ఉన్నారో నా వద్ద లెక్కలు ఉన్నాయి. ఎవరు పనిచేస్తున్నారో.. ఎవరు కబుర్లు చెబుతున్నారో కూడా నాకు తెలుసు. నాకేం తెలియదనుకొని అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేయకండి. పని చేసి మాట్లాడండి.

- ఎమ్మెల్యేలకు బాబు హెచ్చరిక



టీడీపీ వర్క్‌షాప్ ప్రారంభం సందర్భంగా ఎన్టీఆర్‌కు చంద్రబాబు పుష్పాంజలి

పనిచేస్తే ఎప్పటికీ మనమే

ప్రభుత్వ వ్యతిరేకతకు కాలం చెల్లింది: సీఎం

ప్రజలు మన వెంటే.. అన్ని స్థానాల్లో గెలుస్తాం

40 ఏళ్లలో ఈ మూడున్నరేళ్ల సంతృప్తే మిన్న

వచ్చే 3-4 నెలల్లో రాజకీయ పునరేకీకరణ

అన్న క్యాంటీన్లు, నిరుద్యోగ భృతి ఇస్తే ఇచ్చిన హామీలకు వంద రెట్లు చేసినట్టే: బాబు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాగా పనిచేస్తే ఎన్నిసార్లు గెలిపించేందుకైనా ప్రజలు సిద్ధంగా ఉంటారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నాయకులు పనిచేయాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. 'గతంలో ఐదేళ్ల

మిగతా 6వ పేజీలో...

వితంతువులు, దివ్యాంగులకు

100% పింఛన్లు

జగ్జీవన్‌కూ స్మారక కేంద్రం.. బాబు వెల్లడి

ఒకప్పుడు మనపై ఉద్యోగుల్లో వ్యతిరేకత

జీతాలు బాగా ఇచ్చినా ఒత్తిడి ఉందనేవారు

2004లో మనకు వ్యతిరేకంగా ఓట్లేశారు

ఇప్పుడు ప్రజలకు వారిని చేరువ చేశాం

బాబు ఉద్ఘాటన.. దావోస్‌కు పయనం

మిత్రధర్మం పాటిస్తాం

ఏదైనా లోపలే చెబుతాం.. రోడ్డుకెక్కం.. కుదరని రోజొస్తే అదే చెప్పి దండం పెడతాం.. బీజేపీతో బంధంపై సీఎం

5 కోట్ల మంది ప్రతినిధిని 40సార్లు ఢిల్లీ తిప్పుకోవాలా?: అవంతి

6


'సంధానం'తో సరి!

నదుల అనుసంధాన భారం రాష్ట్రాలకే

ఆయా ప్రాజెక్టుల వ్యయం పంచుకోవలసిందే.. కేంద్రం భారీగా నిధులివ్వదు

సంధానకర్త బాధ్యతకే పరిమితం.. ఆరుగురు సీఎంలతో త్వరలో భేటీ

వారు సరేనంటేనే మహానది-కావేరి సాకారం.. మంత్రి గడ్కరీ కొత్త మెలిక



అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నదుల అనుసంధానానికి శ్రీకారం చుడుతున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం.. నిధుల విషయంలో మాత్రం చేతులెత్తేస్తోంది. మార్కెటింగ్, వివిధ రాష్ట్రాల మధ్య సంధానకర్తగా పనిచేయడం వరకే తన పాత్రను పరిమితం చేసుకోవాలని అనుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల నదుల అనుసంధానంపై కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే

మిగతా 6వ పేజీలో...

'డెల్టా'కు మరింతగా గోదారమ్మ

మరో ఆనకట్టతో స్థిరీకరణే లక్ష్యం

సీజనులో డెల్టాకు 4 వేల క్యూసెక్కులు

రూ.3500 కోట్లతో ప్రతిపాదన

16

వాప్కోస్ ఔట్!

పోలవరం పర్యవేక్షణ బాధ్యత ఇవ్వనట్టే

అధిక ఫీజు డిమాండ్ చేయడమే కారణం



వ్యాజ్యాల కేటాయింపు రోస్టర్‌లో!

ఇక అంతా పారదర్శకం.. వివరాలు సైట్‌లో

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం

నేడు నలుగురు 'రెబెల్' జడ్జీలతో భేటీ!

న్యూఢిల్లీ, జనవరి 21: సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కీలకమైన ప్రజాహిత వ్యాజ్యాలను కేటాయించే ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత తీసుకురావాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నిర్ణయించారు. ఈ ప్రక్రియను ఆసాంతం బహిరంగపరచాలని నిశ్చయించారు. కీలకమైన, సున్నితమైన ప్రజాహిత వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాలకు కేటాయిస్తున్న తీరును నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్

మిగతా 18వ పేజీలో...

కొత్త సీఈసీగా రావత్



18




18

కేజ్రీవాల్‌కు రాష్ట్రపతి షాక్

20 మంది ఎమ్మెల్యేలపై వేటు

ఈసీ సిఫారసుకు కోవింద్ ఓకే



16

పందెంరాయుళ్లకు.. మిగిలింది రాళ్లే!

లక్షల్లో కాస్తే.. చిల్లర చేతికి

నాయకుల జోరుతో బేజారు



నెల్లూరు జిల్లా వీరంపల్లి పంచాయతీలో సగం నిర్మించి వదిలేసిన మరుగుదొడ్డి

ఇలాగైతే చెంబు చల్లగానే

ఓడీఎఫ్ అమల్లో 'మొదటి'కే మోసం

కొన్నిజిల్లాల కలెక్టర్ల అత్యుత్సాహంతో ముఖ్యమంత్రి 'స్వచ్ఛ' స్ఫూర్తికి దెబ్బ

ఫస్ట్ కోసం నెల్లూరు జిల్లా తంటాలు

పెద్దఎత్తున మరుగుదొడ్ల మంజూరు

ఆ లక్ష్యం చేరుకోడానికి ఆపసోపాలు

సగం సగం చేసి..100శాతం ప్రకటన

కడప జిల్లాలో ఇంట్లో అందరికీ లబ్ధి

పాత వాటికి రంగులేసి కొత్త ఖాతాలోకి

సగం గోడ కట్టి మొత్తం బిల్లు జేబులోకి

విజిలెన్స్ తనిఖీల్లో బయటపడ్డ మోసాలు

అమరావతి, నెల్లూరు, రాయచోటి/ సుండుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): "మరుగుదొడ్డి ఆత్మగౌరవానికి ప్రతీక. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం పూర్తిచేయాలి. ఇప్పటివరకూ ఆరు జిల్లాలు మాత్రమే లక్ష్యం పూర్తి చేశాయి. మిగిలిన జిల్లాలు ఎట్టిపరిస్థితుల్లో మార్చి 31 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలి. లేకుంటే ఆయా జిల్లాల కలెక్టర్ల తీరుకు నిరసనగా దీక్ష చేస్తా. భోజనం మానేసి నిరసన వ్యక్తం చేస్తా. అప్పటికైనా కలెక్టర్లలో రోషం పెరిగి లక్ష్యం పూర్తి చేస్తారేమో చూస్తా'... స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమాటలివి. 'చెంబు'ను చంపేసి, ఆడపడుచుల ఆత్మగౌరవం నిలపడానికి రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న తపన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తం అవుతోంది. అయితే, ఈ తాపత్రయం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. పైగా, తమ జిల్లాలను ఎంత తొందరగా బహిరంగ మలవిసర్జన రహితాలుగా (ఓడీఎఫ్) ప్రకటించుకొందామా అన్న ఆత్రుత కలెక్టర్లలో కనిపిస్తోంది. దీంతో

మిగతా 16వ పేజీలో...

రాష్ట్ర రహదారులకు మహర్దశ

జాతీయ రహదారులుగా 3,000 కి.మీ. మార్పు.. సీమ, ఉత్తరాంధ్రల్లో ప్రాధాన్యం

తొలుత రెండేళ్లలో 1200 కి.మీ. పూర్తి.. ఆర్‌అండ్‌బీ నిర్ణయం

5



మూడో పురుషార్థం ముఖ్యమే కానీ..



పరంజ్యోతి

నాలుగు పురుషార్థాలూ మానవ జీవన విధానంలో ప్రధానమేనన్న భారతీయ శాస్త్రాలు.. చతుర్విధ పురుషార్థాల్లోని అర్థ, కామాలు రెండూ ధర్మబద్ధమైనప్పుడే విలువైనవంటూ ప్రబోధించాయి. అర్థార్జనకు (ధనం సంపాదించడానికి) ధర్మం ఎంత ముఖ్యమో.. కామానుభవమూ అలాగే ధర్మబద్ధమై ఉండాలని పెద్దలు చెప్పారు. అలా కానప్పుడు అది వ్యక్తికి, సమాజానికి కూడా హానికరమేనని హెచ్చరించారు. పుట్టిన ప్రతి మనిషికీ కామితాలను తీర్చుకునే హక్కుంది. కానీ, ఆ కోరికలకు హద్దు ఉండాలన్నదే నియమం. అప్పుడే లోకక్షేమం సాధ్యమవుతుంది. భారతీయ ధర్మం ఎప్పుడూ కోరికలను తిరస్కరించలేదు. వాటిని మితం చేసుకోవాలని చెప్పింది. ఉదాహరణకు.. అర్థకామాలు అభిలషింపదగ్గవేగానీ అవి ధర్మవిరుద్ధమైతే మాత్రం వాటిని వదిలెయ్యాల్సిందేనని రామాయణం కచ్చితంగా చెప్పింది. కేవల అర్థపరత, కామాతురత ఎప్పటికీ నిందార్హాలేనన్నది. క్షణికములైన ఇంద్రియ సుఖాలకు బానిసైనవానిని, సుఖలోలుని ప్రజలు శ్మశానంలోని అగ్నివలె చూస్తారని చెప్పింది. అందుకే లక్ష్మణుని ఉద్దేశించి.. 'ధర్మవిరుద్ధమైన కామం అనర్థాలకు కారణమవుతుంది' అని రామచంద్రుని ముఖతః.. చెప్పించారు వాల్మీకి మహర్షి. భారతీయ పురాణేతిహాసాలన్నీ ఇదే విషయాన్ని ఘోషిస్తున్నాయి. శూర్పణఖ దుష్టకామం తన ముక్కుచెవులకు ప్రమాదం తెచ్చిపెట్టింది. అమిత శక్తిమంతుడైన రావణుని ధర్మవిరుద్ధ కామవాంఛ.. యుద్ధంలో ఘోర మరణంపాలుచేసింది. ఏ కోరికలైనా తీర్చుకునే అధికారం మనకున్నా.. వాటికి ధర్మబద్ధత ఉండాలేదా అన్న విచక్షణ మనకు ఉండాలనే విషయాన్నే ఇన్ని ఉదాహరణల ద్వారా ప్రాచీనులు సూచించారు. అంతే తప్ప కోరికలను పరిత్యజించాలని బోధించలేదు.

- గన్నమనేని గిరిజా మనోహరబాబు

లోకం తీరు



మీరు రమ్మంటున్న రూటులో పోలీసు తనిఖీలు ఉంటాయి. ఆ పాయింట్ల ముందు మీరే డ్రైవ్ చేయాలి మరి!

బెజవాడ అడుగుజాడ

అయ్యదేవర!



"మీరు ప్రభుత్వ ఉద్యోగంలో చేరండి. రెవెన్యూ అధికారిగానూ, మునసబుగానూ నియమిస్తున్నాం. ఇవిగో ఉత్తర్వులు" అని అంటే.. ఎవరైనా ఎగిరిగంతేసి ఆ ఉద్యోగంలో చేరిపోతారు. అయితే, ఆ యువకుడు మాత్రం 'సారీ'తో సరిపెట్టాడు. తద్వారా తెల్ల పాలకులపై తన నిరసనను, తన దేశం పట్ల ప్రేమను బయటపెట్టుకొన్నాడు. ఆయనే...అయ్యదేవర!

1882 - 1962

బెజవాడకు అడుగుజాడ ఆయన! దక్షిణభారత హిందీ ప్రచార సభ భవనం, ఆంధ్రరత్న భవన్, రామ్మోహన్ లైబ్రరీ, వన్‌టౌన్ కూరగాయల మార్కెట్.. ఇలా ఈ నగరం ప్రతి అవసరాన్ని తీర్చి, అభివృద్ధిని కూర్చి, తెలుగు జాతికి తనను తాను సమర్పించుకొన్న త్యాగజీవి అయ్యదేవర కాళేశ్వరరావు! అయ్యదేవర 1882 జనవరి 22న కృష్ణాజిల్లా నందిగామలో జన్మించారు. బందరులో చదివేరోజుల్లో అయనకు రఘుపతి వెంకయ్యానాయుడుతో పరిచయం అయింది. ఆయన ద్వారా కొమర్రాజు లక్ష్మణరావు, కందుకూరి వీరేశలింగం వంటివారికి అయ్యదేవర దగ్గరయ్యారు. బ్రహ్మసమాజ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, ఆ సమాజం తరపున ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కాళేశ్వరరావు లెక్కలలో నిష్ణాతుడు. దీంతో చిన్నతనం నుంచీ ఇంజనీరు కావాలని కోరుకొన్నారు. ఎందుకో ఆయన కోరిక నెరవేరలేదు. మద్రాస్‌లో న్యాయవిద్య పూర్తిచేసుకొని, విజయవాడలో ప్రాక్టీస్ పెట్టారు. ఈ నగరంపై తన ముద్రను అనేక రూపాల్లో పొందుపరిచారు. అయ్యదేవర తండ్రి రెవెన్యూలో ఉద్యోగి. ఈ కారణంగా, అయ్యదేవరను సర్కారీ కొలువు వరించింది. కానీ, దేశభక్తి భావాలు కలిగిన ఆయన, పర పాలకుల నీడలో బతకడానికి ఇష్టపడలేదు. అంతేకాదు, మహాత్మాగాంధీ పిలుపునందుకొని, న్యాయవాద వృత్తిని కూడా వదిలిపెట్టారు. విజయవాడ కేంద్రంగా స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించారు. 1921 మార్చి 31-ఏప్రిల్ 1 తేదీలలో విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ సభలు జరిగాయి. గాంధీజీతో పాటు ఉద్దండులైన దేశ నాయకులంతా ఈ సభలకు విచ్చేశారు. ఆ రోజులలో విద్యుత్తు సౌకర్యం లేదు. అయితే, కాళేశ్వరరావు పిలుపుమేరకు, ప్రజలు తమ ఇళ్ల ముందు లాంతర్లు వెలిగించి,

గుర్తుకొస్తున్నారు...

• నేడు అయ్యదేవర కాళేశ్వరరావు జయంతి

నగరాన్ని పట్టపగలుగా మార్చారు. ఈ ఘటనతో కాళేశ్వరరావు పేరు మహాత్ముడి దృష్టికి వెళ్లింది. ఆ తరువాత మూడు సార్లు బెజవాడకు వచ్చిన గాంధీజీ.. ప్రతిసారీ అయ్యదేవరను వెంటపెట్టుకొనే తిరిగారు. ఆయన చదువుకొన్న బందరు నోబుల్ కాలేజీ యాజమాన్యం.. స్వయంగా పిలిచి ఉద్యోగం ఇచ్చింది. ఆ కాలేజీలో కొద్దికాలం ఆయన చరిత్రను బోధించారు. ఆ అనుభవంతో తన జైలు జీవితంలో అమెరికా చరిత్ర, ఫ్రెంచి విప్లవ చరిత్ర, చైనా జాతి చరిత్ర, ఈజిప్టు చరిత్ర వంటి గ్రంథాలు రచించారు. 'నాజీవితం-నవ్యాంధ్రం' పేరిట తన ఆత్మకథను అయ్యదేవర అందించారు. జాతీయోద్యమంలో ఆయనకు రాజగోపాలాచారి, బెజవాడ గోపాలరెడ్డి, టంగుటూరు ప్రకాశం పంతులు సమకాలీనులు. ఉమ్మడి మద్రాస్ అసెంబ్లీలో బెజవాడ తరపున అయ్యదేవర ప్రాతినిథ్యం వహించారు. చీఫ్ విప్‌గా నాటి అసెంబ్లీలో తెలుగువారి తరపున గట్టిగా గళం విప్పారు. ఆంధ్రప్రదేశ్ తొలి శాసన సభ స్పీకర్‌గా అయ్యదేవర సేవలు అందించారు. 1962 ఫిబ్రవరి 26న విజయవాడ నుంచి పోటీ చేసి..ఫలితాలు వెలువడకముందే తీవ్ర అస్వస్థతకు గురై కన్నుమూశారు. అయితే ఆ ఎన్నికల్లో అయ్యదేవర బ్రహ్మాండమైన ఆధిక్యతతో గెలుపొందారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

భగ్గుమన్న 2017

- వరుసగా నాలుగో ఏడాదీ తారెత్తించిన ఎండలు
- వేడి సంవత్సరంగా ప్రకటించిన వాతావరణ సంస్థ
- చలి కాలంలోనూ ఉష్ణోగ్రతల పెరుగుదల



విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి వేసవిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం సహజమే! కానీ.. గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కాలాలతో సంబంధం లేకుండా ప్రతి సీజన్‌లో ఎండలు మండిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ 2017ని కూడా వేడిసంవత్సరంగా ప్రకటించడమే అం దుకు నిదర్శనం. అంతకుముందు వరుసగా మూడేళ్లు (2014, 2015, 2016) కూడా ప్రపంచ వ్యాప్తంగా ఎండలు భగ్గుమన్నాయి. భారత వాతావరణ సంస్థ గతేడాది వాతావరణంపై రూపొందించిన నివేదికలో ఇదే విషయాన్ని వెల్లడించింది.

ఎల్‌నినో ప్రభావంతోనే..

1971-2000 మధ్య నమోదైన సగటు ఉష్ణోగ్రతలతో పోల్చితే 2017లో 0.71 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. అయితే 2014 నుంచి వేడి వాతావరణం పెరుగుతూ వస్తున్నది. 2015, 2016లో ఎల్‌నినో ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగి, వడగాడ్పులు కొనసాగాయి. చివరకు చలికాలంలో కూడా వేడి వాతావరణం నెలకొంది. 1971-2000 మధ్య నమోదైన సగటు ఉష్ణోగ్రతలతో పోల్చితే 2014లో 0.41 డిగ్రీలు, 2015లో 0.59 డిగ్రీలు, 2016లో 0.87 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. 2016తో పోల్చితే సగటు ఉష్ణోగ్రతల పెరుగుల 2017లో (0.71) స్వల్పంగా తగ్గినా.. గడిచిన నాలుగేళ్లలో సగటు ఉష్ణోగ్రతలు పెరగడం ఆందోళనకర అంశం. భారత వాతావరణ శాఖ నివేదిక మేరకు వరుసగా మూడో ఏడాది కూడా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం గమనార్హం. ఉష్ణోగ్రతలు పెరిగి వడగాడ్పులు కొనసాగి, ఎండలు తీవ్రమై వేడి వాతావరణం నెలకొనడం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అసాధారణ ప్రక్రియ. 2016 ఎల్‌నినో ప్రభావం 2017పై పడింది. పారిశ్రామికీకరణ సమయంలో నమోదైన ఉష్ణోగ్రతల సగటుతో పోల్చితే 2016లో 1.2 డిగ్రీలు ఎక్కువగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో పసిఫిక్ మహా సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడంతో గతేడాది కూడా అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని వాతావరణ సంస్థ వెల్లడించింది. గత 117 సంవత్సరాల వివరాలు పరిశీలిస్తే.. ప్రతి ఏటా శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వేడి వాతావరణం నెలకొంటున్నది. 1900-1930లో శీతాకాలం సగటు ఉష్ణోగ్రతలతో పోల్చితే 2017 చలికాలంలో 3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఉన్నతాధికారి చంద్రభూషణ్ తెలిపారు. ప్రతి ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పర్యావరణంపై, ప్రధానంగా వ్యవసాయం, నీటి వనరులపై దీని ప్రభావం ఎక్కువగా పడిందన్నారు. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు శీతాకాలం కాబట్టి, దేశంలో అనేక ప్రాంతాల్లో వాతావరణం చల్లగా వుంటుంది. అయినా సాధారణం కంటే ఒక డిగ్రీ ఎక్కువగా నమోదవడం చూస్తే చలికాలంలో కూడా పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వాతావరణ మార్పులకు సంకేతంగా భావిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	12.7	31.0
విశాఖపట్నం	13.6	28.2
కడప	14.0	33.0
అనంతపురం	15.2	31.6
చిత్తూరు	15.4	30.0
గుంటూరు	15.5	31.0
కర్నూలు	17.6	32.0
విజయవాడ	17.8	29.5

గజగజ!

విశాఖపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ప్రధానంగా తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీస్తున్నాయి. వాయువ్య భారతం నుంచి వీస్తున్న చలిగాలులతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం పది గంటల వరకు చలి వాతావరణం కొనసాగుతోంది. సాయంత్రం నాలుగు గంటలకే శీతల గాలులు ప్రారంభమతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో ఆరు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే ఇరవై నాలుగు గంటల్లో తెలంగాణలో పలుచోట్ల చలిగాలుల తీవ్రత, మిగిలిన చోట్ల చలి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.



ఈ క్రేన్ చరిత్ర వందేళ్లు!


విశాఖ రైల్వే స్టేషన్ జ్ఞానాపురం ప్రవేశ ద్వారం వైపు ఏర్పాటు చేసిన పురాతన రైల్వే క్రేన్ ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. 1908వ సంవత్సరం నాటి ఈ క్రేన్‌ను ఇంగ్లండ్‌కు చెందిన ఒక కంపెనీ తయారు చేసింది. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు దీనిని యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్‌కు అనుసంధానం చేసి వినియోగించేవారు. తొలుత దీనిని బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేలో ప్రవేశపెట్టారు. దీర్ఘకాలంపాటు సేవలు అందించిన తర్వాత చిట్టచివరగా రాయగడ కేంద్రంగా పనిచేసింది. ఆధునికీకరణలో భాగంగా రైల్వే శాఖ ఈ స్టీమ్ క్రేన్‌ను సేవల నుంచి తప్పించింది. సుమారు 10 టన్నుల బరువున్న ఈ క్రేన్ కాలక్రమేణా తుప్పు పట్టి, పాడై పోవడంతో మిగిలిన తుక్కు సామాన్లతోపాటు దీనిని కూడా వేలం వేయాలనుకున్నారు. ఈ విషయం వాల్తేరు డీఆర్ఎం ముకుల్ శరణ్ మథుర్ దృష్టికి రావడంతో, రైల్వే శాఖ చరిత్రకు ఆనవాలుగా ఉన్న ఈ క్రేన్ గురించి భావితరాలు తెలుసుకునేందుకు దీనిని ప్రదర్శనగా ఉంచాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాయగడ నుంచి విశాఖ తీసుకువచ్చి, శుభ్రం చేయించారు. రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దారు.

- విశాఖపట్నం

రైల్లో నిల్చోబెట్టినందుకు 37వేల పరిహారం!

- రైల్వే శాఖకు వినియోగదారుల ఫోరం ఆదేశం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మైసూరుకు చెందిన ఓ కుటుంబానికి రైల్వేశాఖ వల్ల కలిగిన అసౌకర్యాన్ని వినియోగదారుల ఫోరం తీవ్రంగా పరిగణించింది. పరిహారంగా రూ.37 వేలు చెల్లించాలని తీర్పునిచ్చింది. మైసూరు సిద్ధార్థ లే అవుట్‌లోని వైజేష్ కుటుంబ సభ్యులతో కలసి ఉజ్జయిని నుంచి మైసూరుకు రైలు టికెట్లు రిజర్వు చేసుకున్నారు. 2017 మే 25 తేదీన ముగ్గురికి జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో బెర్తులు ఖరారయ్యాయి. తీరా రైలులో వారికి రిజర్వు అయిన బెర్తులను ఇతరులు ఆక్రమించుకున్నారు. టీసీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వైజేశ్ కుటుంబ సభ్యులు ముగ్గురూ ఉజ్జయిని నుంచి రైలులో నిల్చుని ఇబ్బంది పడుతూనే మైసూరుకు చేరుకున్నారు. జరిగిన అవమానాన్ని, అసౌకర్యాన్ని వివరిస్తూ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. విచారణ జరిపిన ఫోరం.. నైరుతి రైల్వే మేనేజర్‌తోపాటు ఆర్‌పీఎఫ్, టీసీల తీరుపై మండిపడింది. బాధిత కుటుంబానికి రూ.37 వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. దీంతో ఒక్కో టికెట్ ధర రూ.745 కాగా, రైల్వేశాఖ రూ.37 వేలు పరిహారంగా ఇవ్వాల్సి వచ్చింది.



'పద్మావత్'కు పన్ను మినహాయింపు ఇవ్వాలి

పద్మావత్ చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలి. భారత సంస్కృతి ప్రత్యేకించి రాజస్థాన్ సంస్కృతికి ఆ చిత్రం ప్రాచుర్యం కల్పిస్తున్నందున పన్ను మినహాయింపుపై రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకోవాలి.

- సంగీత విద్వాంసుడు విశ్వమోహన్ భట్



ప్రజల మొగ్గు కాంగ్రెస్ వైపే..

గుజరాత్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ కార్యకర్తలకు ఊపునిచ్చాయి. ప్రజల మొగ్గు కాంగ్రెస్ వైపే ఉంది. గుజరాత్‌లో గెలిచేందుకు ప్రధాని మోదీ ఎన్నో గిమ్మిక్కులు చేశారు. కానీ ఓటర్లను ఆకట్టుకోలేకపోయారు.

- కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్‌పటేల్



కృత్రిమ వైరస్‌తో మశూచి వ్యాక్సిన్

టొరంటో, జనవరి 21: మశూచికి అత్యంత ప్రభావవంతమైన వ్యాక్సిన్ తయారీకి కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ అల్బర్టా శాస్త్రవేత్తలు ఒక కృత్రిమ వైరస్‌ను సృష్టించారు. హార్స్‌పాక్స్ వైరస్‌ను ఉత్పత్తి చేసిన పరిశోధకులు.. జన్యు శ్రేణి, కృత్రిమ పద్ధతులతో తయారుచేసిన డీఎన్ఏ భాగాలను ఉపయోగించి దాన్ని కృత్రిమ వైరస్‌గా పునర్నిర్మించారు. ఈ వైరస్‌ను మశూచి ఉన్న ఎలుకల్లో ప్రవేశపెట్టగా అది.. వ్యాధి వ్యాప్తిని అడ్డుకొని రక్షణగా నిలిచిందని పరిశోధకులు తెలిపారు.

'టాటూ' రిమోట్!

బెర్లిన్, జనవరి 21: టీవీలో చానెల్ మార్చాలన్నా.. ఏసీ ఉష్ణోగ్రత తగ్గించాలన్నా.. రిమోట్ కావాలి. ఒక్కోసారి ఎక్కడో పెట్టి మర్చిపోతాం. వెతకలేక అసహనానికి లోనైన సందర్భాలు మనకు అనేకం. అయితే, అలాంటి బాధ లేకుండా అతి సూక్ష్మ ఎలక్ట్రానిక్ టాటూలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎంచక్కా.. ఈ ఎలక్ట్రానిక్ టాటూలను శరీరంపై పొడిపించుకొని టీవీని, ఏసీని, రిమోట్ సహాయంతో నడిచే ఇతర పరికరాలను నియంత్రించవచ్చట. దీన్ని జర్మనీలోని హెల్మ్‌హోల్జ్-జెంట్రమ్ డ్రెస్డెన్-రోసెన్‌డార్ఫ్ రిసెర్చ్ ల్యాబొరేటరి శాస్త్రవేత్తలు రూపొందించారు.

ఇదేం పద్ధతి..!?



- 8 శాతం వస్తే 60 మార్కులతో సమానం
- 90 శాతం వచ్చిన వారికి దక్కేది 'బి' గ్రేడే!
- సంస్థ ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకొనేందుకు

ట్రిపుల్ ఐటీల్లో వింత ధోరణులు

నూజివీడు, జనవరి 21: కష్టపడి శ్రద్ధగా చదివే విద్యార్థులకు మంచి మార్కులు, గ్రేడ్లు రావడం సహజం. అంతకంటే తక్కువ ప్రతిభ చూపిన విద్యార్థులతో వీరినీ సమానంగా గుర్తించడం సమంజసమా? ప్రస్తుతం రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో ఇదే జరుగుతోంది! ఫలితంగా.. తమ ప్రతిభకు తగిన గుర్తింపు రావడం లేదని చురుకైన విద్యార్థులు వేదనకు గురవుతున్నారు. మరి.. ట్రిపుల్ ఐటీల్లో ఇలా ఎందుకు జరుగుతోంది? అంటే వాటి ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడానికే ఇలా సొంత విధానాన్ని అమలు చేస్తున్నాయి!

ప్రస్తుతం రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వం నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లను ఏర్పాటు చేసింది. వీటికోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నా.. వీటిల్లో పాటిస్తున్న విద్యావిధానం పరిశీలిస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే! ఎక్కడైనా విద్యార్థులకు వచ్చిన అగ్రస్థాయి మార్కులను ప్రామాణికంగా తీసుకుని గ్రేడింగ్ ఇస్తారు. ట్రిపుల్ ఐటీల అధికారులు మాత్రం.. ఐఐటీల విద్యావిధానాన్ని ప్రామాణికంగా తీసుకోకపోగా, తమ సొంత విధానాన్ని పాటిస్తూ విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తున్నారు. ఈ విధానం లోపభూయిష్టంగా ఉండడంతో ట్రిపుల్ ఐటీఇస్తున్న సర్టిఫికెట్‌కు క్రమంగావిలువ తగ్గిపోతోంది!

గ్రేడ్లు ఇలా ఇస్తారు!

ట్రిపుల్ ఐటీలు విద్యార్థులు సాధించిన మార్కుల్లో మొదటి ఐదు శాతాన్ని ఎక్స్‌లెంట్‌గా తీసుకుని, మిగిలిన విద్యార్థులకు ఏ, బీ, సీ, డీ అంటూ సెమిస్టర్ పరీక్షల్లో గ్రేడింగ్ ఇస్తున్నారు. అంటే.. వంద మంది విద్యార్థులు పరీక్షలు రాశారనుకొంటే.. వారిలో 95వ విద్యార్థికి వచ్చిన మార్కులను ఉత్తీర్ణతకు కటాఫ్‌గా తీసుకుని, దాని ఆధారంగా గ్రేడ్లు ఇస్తున్నారు. మార్కులు/గ్రేడ్లు కేటాయించడానికి తరచూ విధానాలను మారుస్తున్న ట్రిపుల్ ఐటీలు.. ఈ విధానాన్ని ఈ ఏడాదే అమలు చేస్తున్నాయి. ఈ విద్యావిధానం వల్ల 90 శాతం మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థికి సైతం అందుకు తగిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదు. ప్రస్తుతం ఈ కటాఫ్‌ను 8శాతంగా నిర్ణయించారు. ఫలితంగా అతి సాధారణ విద్యార్థులు సైతం ఈ విధానం వల్ల పాసవుతున్నారు. చివరి సంవత్సరం పరీక్ష పూర్తి చేసుకున్న సమయానికి ఈ గ్రేడింగ్ విధానం వల్ల 8 శాతం మార్కులు వచ్చిన విద్యార్థి కూడా సీ, డీ గ్రేడులు పొందుతున్నారు. ఈ గ్రేడులను మళ్లీ మార్కులలోకి మార్చినప్పుడు ఈ సంస్థ పాటిస్తున్న విధానం వల్ల సదరు విద్యార్థి కనీసం 60 శాతం మార్కులు పొందుతున్నాడు. దీంతో ఈ సంస్థలో విద్యార్థుల ఉత్తీర్ణతశాతం 95 శాతంగా కనిపిస్తోంది.

నాటి ప్రతిభ ఏదీ?

ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఏమిటంటే ఈ సంస్థలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థీ పదోతరగతిలో కనీసం 90శాతం మార్కులు సాధించినవారే. వారిక్కడ ఆరేళ్లపాటు చదువుతారు. అలాంటి మెరిట్ విద్యార్థి చివరికి 8 శాతం మార్కుల స్థాయికి దిగిపోవడానికి కారణమేంటి? దానిలో సంస్థ, విద్యార్థి బాధ్యత ఎంత? అనే విషయం ప్రశ్నించుకోవాలి.

సైకాలజీతో కాసులు!

- టెట్‌లో ఈ సబ్జెక్టుకు 30 మార్కులు.. కానీ టీచర్ల కొరత
- సైకాలజీ టీచర్లకు రోజుకి 50 వేలు చెల్లించేందుకూ సై

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సైకాలజీ సబ్జెక్టు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ సబ్జెక్టు బోధించే టీచర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకుని బోధన చేయాలన్న ఉద్దేశంతో సైకాలజీ సబ్జెక్టును ఉపాధ్యాయ విద్యలో ఓ బోధనాంశంగా చేర్చారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)లో సైకాలజీ సబ్జెక్టుకు 30 మార్కులు కేటాయించారు. ఇదే ఇప్పుడు సైకాలజీ టీచర్లకు వరమైంది. సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఎంపిక కావాలనుకునే అభ్యర్థులందరికీ 'టెట్'లో సైకాలజీ సబ్జెక్టు తప్పనిసరి. ఇది కొంచెం క్లిష్టమైన సబ్జెక్టు కావడంతో అభ్యర్థులు దీనిపై ఎక్కువ దృష్టిపెట్టారు. అయితే ఈ సబ్జెక్టును బోధించే వారి కొరత ఎక్కువగా ఉంది. కొద్ది మంది స్కూల్ అసిస్టెంట్ టీచర్లు మాత్రమే సైకాలజీని సమర్థంగా బోధించగలుగుతున్నారు. దీంతో వారికి విపరీతమైన డిమాండ్ ఉంటోంది. గతంలో జరిగిన టెట్‌కు కోచింగ్ ఇచ్చిన వారికి మరింత డిమాండ్ ఉంటోంది. తమ వద్ద సైకాలజీ సబ్జెక్టు బోధిస్తే రోజుకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తామంటూ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో సైకాలజీ సబ్జెక్టులో అనుభవమున్న కొందరు స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు పెట్టి మరీ కోచింగ్ సెంటర్లలో బోధన చేస్తున్నారు.

సబ్జెక్టు టీచర్లకూ పంట పండింది

సాధారణంగా బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చినందుకు సబ్జెక్టు టీచర్లకు రెమ్యునరేషన్ చెల్లిస్తుంటారు. ఇతర సబ్జెక్టుల్లోనూ ఇలానే జరుగుతుంది. ప్రస్తుతం సైకాలజీ సబ్జెక్టు బోధించేవారు తమకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రోజువారీ వేతనం తీసుకుంటున్నారు. వీరిని చూసి సబ్జెక్టు టీచర్లు సైతం అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. నవ్యాంధ్రలో తొలిసారి టెట్ నిర్వహిస్తుండటంతో ఈసారి చాలా మంది అభ్యర్థులు హైదరాబాద్‌కు వెళ్లకుండా స్థానికంగానే కోచింగ్ తీసుకుంటున్నారు. దీంతో కోచింగ్ సెంటర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100కుపైగా కోచింగ్ సెంటర్లు వెలిశాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డలోనే రికార్డు స్థాయిలో దాదాపు 25 వేల మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, రాజమండ్రి.. తదితర నగరాల్లోనూ రెండు నెలలుగా కోచింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది. టెట్ సిలబస్ కవర్ చేయాలంటే ఒక్కో సెంటర్ నిర్వాహకులు కనీసం పది మంది టీచర్లను నియమించుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది అభ్యర్థులు టెట్ కోచింగ్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు.



అవనిగడ్డలో భాషా పండిత అభ్యర్థుల ఆందోళన

టెట్.. ఫైట్!

- స్పష్టత లేని సిలబస్.. భాషా పండితుల హైరానా
- పరీక్ష తేదీలు మార్చాలని డిమాండ్

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/విజయవాడ, జనవరి 21 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసే భాషా పండిత అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. తమకు సిలబస్ సకాలంలో ఇవ్వలేదని, పైగా మార్చిన సిలబస్‌పై స్పష్టత లేదని వారు వాపోతున్నారు. ఈ విషయంలో స్పష్టత ఇచ్చి ప్రిపరేషన్‌కు కనీసం రెండు నెలల గడువు ఇచ్చేలా టెట్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తో ఆదివారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. కోచింగ్ కోసం ఇక్కడికి వచ్చిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు ఇందులో పాల్గొన్నారు. మ్యాథ్స్, సైన్స్, సోషల్ అభ్యర్థులకు ఇచ్చిన సిలబస్‌లో 6 నుంచి 10వ తరగతి వరకూ ఉన్న పాఠ్యపుస్తకాల్లో ప్రశ్నలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినందున.. తమకు కూడా ఇలాగే ఇవ్వాలని తెలుగు, హిందీ పండిట్ అభ్యర్థులు కోరుతున్నారు. హిందీ భాషా పండితులకు మారిన సిలబస్ 2017-18 విద్యా సంవత్సరం అభ్యర్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని టెట్ పరీక్ష తేదీలను పొడిగించాలని హిందీ సేవా సదన్ వ్యవస్థాపకుడు, ఏపీ హిందీ ప్రచారసభ సెక్రటరీ గైబువల్లి విజయవాడలో ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.



వంశీకృష్ణ (ఫైల్)

ఐ హేట్ లైఫ్.. హేట్ మనీ..!

- కొత్తనోట్లపై రాసిన బీటెక్ విద్యార్థి
- ఏలూరులో ఉరేసుకొని ఆత్మహత్య

ఏలూరుక్రైం, జనవరి 21 : పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. 'ఐహేట్ మై లైఫ్.. ఐ హేట్ మనీ'.. అంటూ ఓ కొత్త నోటుపై రాసి, ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. ఏలూరు పోలీసుల కథనం ప్రకారం, గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన మోతుకూరి వంశీకృష్ణ(20).. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో రూమ్‌లో ఉంటూ కాలేజీకి వెళ్లేవాడు. శనివారం రాత్రి 7 గంటలకు ఓ హోటల్‌లో వంశీకృష్ణ రూమ్ తీసుకొన్నాడు. అతని రూము నుంచి ఆర్డర్లు లేకపోవడంతో ఆదివారం సాయంత్రం హోటల్ నిర్వాహకులకు అనుమానం వచ్చింది. రూమ్‌లోకి వెళ్లిన హోటల్ సిబ్బందికి.. సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకున్న వంశీకృష్ణ మృతదేహం కనిపించింది. ఈ గదిని పరిశీలించిన పోలీసులకు రెండు 200 రూపాయల కొత్త నోట్లు, టిష్యూ పేపర్‌పై రాసిన సూసైడ్ నోటు కనిపించాయి. 'ఐ హేట్ మనీ.. ఐ హేట్ మై లైఫ్' అని ఆ కొత్త నోట్లపై రాసి ఉంది. "నా చావుకు ఎవరూ కారణం కాదు. నేను చనిపోయాక మా ఇంటికి ఫోన్‌చేసి చెప్పండి" అని కోరాడు. ఆ లేఖలో తన కుటుంబసభ్యులు, బంధువులను పేరు పేరున పలకరించాడు. తాను ఎవరెవరి వద్ద అప్పులు చేసింది వివరంగా రాసి, మొత్తం 63 వేల రూపాయలను కట్టాలని మరోసారి కోరుతున్నానని వేడుకొన్నాడు. కాగా, వంశీకృష్ణ తల్లి అతని చిన్ననాడే మరణించింది. తండ్రి పార్థసారథి ఇటీవలే ప్రమాదానికి గురయ్యాడు. అటు తల్లి దూరం కావడం, ఇటు తండ్రి మంచం పట్టడం వంశీకృష్ణను కుంగదీసిందని స్నేహితులు వాపోయారు. పోలీసులు కేసు నమోదుచేశారు.



శ్రీవారి సేవలో సుప్రీం న్యాయమూర్తి

తిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అర్జన్‌కుమార్ సిక్రి ఆదివారం సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వాదం పలుకగా.. జేఈవో శ్రీనివాసరాజు తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు.

ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 21 : రాష్ట్రంలో ధాన్యం సాగు చేసిన రైతులు ఎవరూ తక్కువ ధరకు అమ్ముకోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం రాత్రి మంత్రి విలేకరులతో మాట్లాడారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ధాన్యానికి ధర తగ్గినట్టు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మద్దతు ధరకే కొనుగోలు చేయాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా జోసెఫ్ సుధీర్‌బాబు

తిరుపతి (విద్య), జనవరి 21: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ ఏపీ) 70 వసంతాల మహాసభల్లో చివరి రోజైన ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జిల్లాకు చెందిన జోసెఫ్ సుధీర్‌బాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు జిల్లాకు చెందిన గాజుల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆర్థిక కార్యదర్శిగా సుబ్బరాజు, అసోసియేట్ అధ్యక్షులుగా జయరామయ్య, గౌరీశంకర్, కేవీ శేఖర్, ప్రసాద్‌రాజు, నీలకంఠయ్య, శ్రీనివాసులు.. రాష్ట్ర కార్యదర్శిగా ధనంజయనాయుడు ఎన్నికయ్యారు.

కర్ణాటక మార్కెట్లో మలేసియా ఇసుక!

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి ఇసుక కష్టాలు తీరనున్నాయి. అక్కడి నిర్మాణ రంగానికి సమస్యగా మారిన ఇసుకను మలేసియా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. సోమవారం నుంచి మార్కెట్‌లో ఈ ఇసుక లభ్యం కానుంది. మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఎంఎస్ఐఎల్) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని సరఫరా చేయదలిచినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు హంపనగౌడ బాదర్లి, ఎండీ జి.సి. ప్రకాశ్ వెల్లడించారు. దేశంలోనే మొదటిసారిగా 50కిలోల సంచుల ద్వారా ఇసుకను విక్రయిస్తున్నామని వారు తెలిపారు. దీనికోసం గతేడాది జూన్‌లో గ్లోబల్ టెండర్లు ఆహ్వానించగా మలేసియా నుంచి దిగుమతికి కంపెనీలు ముందుకొచ్చాయి. ఆ దేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం ఓడరేవుకు వచ్చే ఇసుకను ప్యాకింగ్ అనంతరం గూడ్స్ రైళ్ల ద్వారా బెంగళూరుతో పాటు రాష్ట్రమంతటా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం ఈ ఇసుక టన్ను ధర జీఎస్టీతో కలిపి బెంగళూరులో రూ.4వేలు, మైసూరులో రూ.4,200గా నిర్ణయించారు. వివిధ జిల్లాల్లో రవాణా చార్జీలు కలుపుకొని ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

పెరగని పింఛన్.. తరగని టెన్షన్!

భారంగా నెట్టుకొస్తున్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు

- 2002 ముందు రిటైర్ అయి ఉంటే నో డీఏ
- ఆరోగ్య బీమా ప్రీమియానికీ చాలని పెన్షన్
- గ్రీవెన్స్‌కు అవకాశమివ్వడం లేదని ఆవేదన

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులకు నెలగడవడం భారంగా మారింది. సుమారు 30, 40 ఏళ్లపాటు బ్యాంకింగ్ రంగంలో సేవలందించిన తాము జీవిత చరమాంకంలో చాలీ చాలని పెన్షన్‌తో సతమతమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామెన్ని పోరాటాలు చేసినా.. న్యాయమైన తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు. పింఛనుదారుల సమస్యలను నివేదించేందుకు కూడా బ్యాంకింగ్ రంగంలో అవకాశం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మూడన్నర లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఇండియన్ బ్యాంక్ అసోషియేషన్ (ఐబీఏ) విఫలమైందని విమర్శిస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను రిటైర్డ్ ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా పరిష్కారం ఎలా లభిస్తుందని ఏపీ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ ప్రశ్నిస్తోంది. 2015లో ఐబీఏ నిర్వహించిన సమావేశంలో రికార్డ్‌నోట్‌లో పేర్కొన్న అంశాలన్నింటినీ పెండింగ్‌లో పెట్టారని పేర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలకు.. ఆసరాగా ఒక్క పైసా కూడా పెన్షన్ పెరగకపోవడంతో తిప్పలు పడుతున్నట్టు చెబుతున్నారు. 2002 నవంబరు ముందు రిటైరైన ఉద్యోగులకు కరువు భత్యం(డీఏ) ఇవ్వడం లేదని, 1986లో రిటైరైన సీనియర్ మేనేజర్ పెన్షన్ నెలకు రూ.3,770 వస్తోందంటే తమ దీనస్థితికి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుందని అంటున్నారు. తమకొచ్చే పెన్షన్ ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించేందుకు కూడా చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పింఛన్‌కు సంబంధించి ఎలాంటి పురోగతీ లేదని చెబుతున్నారు.



ఫలించని గత చర్చలు!

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ఐబీఏ, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నేతలతో చర్చలు నిర్వహించారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు కూడా ప్రస్తుతం పనిచేస్తున్న బ్యాంకు ఉద్యోగుల మాదిరిగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని సిఫారసు చేసింది. ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్‌బీఐ ఉద్యోగుల మాదిరిగానే బ్యాంకు ఉద్యోగులకు కూడా పింఛన్ సవరించాలన్న డిమాండ్‌పై సానుభూతితో పరిష్కరిస్తామందే తప్ప ఎలాంటి హామీ ఇవ్వలేదు. నవంబరు 2002 ముందు రిటైరైన బ్యాంకు ఉద్యోగులకు నూరుశాతం డీఏ పరిహారం అందాలని రిటైర్ ఉద్యోగులు డిమాండ్ చేయగా, ఈ కేసు సుప్రీంకోర్టులో ఉండటంతో దానిపై నిర్ణయం తీసుకోలేమని పేర్కొంది. పెన్షన్‌దారులందరికీ బేసిక్ పెన్షన్ అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్‌ను ఐబీఏ పరిశీలనలో ఉంచింది. పెన్షన్‌దారులందరికీ, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు పెన్షన్ అప్‌డేట్ చేయాలని కోరగా ఇది ఆర్థిక భారంతో కూడినదని, అసాధ్యమని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా సమానంగా సంక్షేమనిధిని కేటాయింపు బ్యాంకు స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమని తేల్చేశారు. ఏళ్ల తరబడి పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించడంలో ఐబీఏ తాత్సార ధోరణిపై అనేక దఫాలు కేంద్ర మంత్రులు, ఎంపీలకు విన్నవించుకున్నా తమ బాధలు పట్టించుకునే వారు లేకుండా పోయారని ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్లు ఇవే..

- 2002 నవంబరుకు ముందు రిటైరైన ఉద్యోగులకు 2002 తర్వాత రిటైరైన ఉద్యోగుల మాదిరిగా పింఛను ఇవ్వాలి.
- బ్యాంకు ఉద్యోగుల వేతనాలను ఏటా రివైజ్ చేసే ఐబీఏ రిటైర్డ్ ఉద్యోగులకు ఇక నుంచైనా పింఛన్‌ను సవరించాలి.
- బ్యాంకు పింఛనుదారులకు సంబంధించిన పీఎఫ్ నిధులు రూ.1.60 లక్షల కోట్లు ఉంటే.. వాటిని నిర్వహించే ట్రస్టు రిజిస్టర్ అయిందో? లేదో? వెంటనే తెలియజేయాలి.
- డిపాజిట్ వడ్డీ రేటును 2005 నుంచి 12% నుంచి 7%కి తగ్గించింది. దీంతో ఆర్థిక పరిస్థితి భారంగా మారింది. దీనిని సవరించాలి.



రాజావాసిరెడ్డి వారసులకు భువనేశ్వరి పరామర్శ

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని రాజావాసిరెడ్డి వారసులను ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆదివారం పరామర్శించారు. నందమూరి రామకృష్ణ సతీమణి జయశ్రీతో కలిసి రాజా వాసిరెడ్డి శ్రీరామ భానుభూపాల్ భార్య భారతిదేవి పరామర్శించి ఆమె యోగ క్షేమాలపై ఆరా తీశారు.

ఎమ్మెల్సీ వాకాటిపై మళ్లీ సీబీఐ విచారణ

నెల్లూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల టీడీపీ శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డిని ఆదివారం సీబీఐ మరోసారి విచారించింది. ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ఫిర్యాదు మేరకు గతేడాది వాకాటిపై సీబీఐ కేసు నమోదు చేసి విచారించింది. ఇప్పుడు బెంగుళూరుకు పిలిపించుకున్న సీబీఐ అధికారులు మరోసారి ఆయనను విచారిస్తున్నారు. భారతీయ రైల్వే ప్రాజెక్టుల నిర్మాణంలో దిగ్గజంగా పేరు గడించిన వీఎన్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థలు వ్యాపారం కోసం వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందాయి. అయితే ఐదేళ్ల క్రితం నెలకొన్న ఆర్థిక మాంద్యం కారణంగా ఈ సంస్థ ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కోవడంతో రుణాలు చెల్లించలేక డీ ఫాల్టర్‌గా మారింది. ఈ కంపెనీ అధినేత, టీడీపీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పూచీకత్తు రుణాల కింద బ్యాంకుల నుంచి రూ. 443 కోట్లు తీసుకున్నారు. ఇవి సకాలంలో చెల్లించలేదు. దీంతో మూడు జాతీయ బ్యాంకులు వాకాటి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం ఈ వివాదం నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో నడుస్తోంది. ఇదిలా ఉండగా 2014-15లో తమ వద్ద రూ. 190 కోట్లు తీసుకుని వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ. 205 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఈ సొమ్ము చెల్లించలేదంటూ దీనిపై విచారించాలని ఐఎఫ్‌సీ.. సీబీఐకి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి గత ఏడాది మే 12న నెల్లూరు, హైదరాబాద్‌లలో వీఎన్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ కార్యాలయాలపై తనిఖీలు చేసి కొన్ని రికార్డులను తీసుకెళ్లారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడి

కత్తివారిపాలెం, (పిట్టలవానిపాలెం) జనవరి 21: వావి వరుసలు మరచిన ఓ మానవ మృగం అభం శుభం ఎరుగని ఓ నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు శివారు కత్తివారిపాలెం గ్రామానికి చెందిన దంపతులు కూలి పనులకు పొరుగు ఊరు వెళుతూ తమ కుమార్తె(4)ను నాయనమ్మ వద్ద ఉంచారు. శనివారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా మూసి ఉండటంతో బాలిక అంగన్‌వాడీ టీచర్ చెట్టుపల్లి వెంకటేశ్వరమ్మ ఇంటికి వెళ్లింది. కనగాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న అంగన్‌వాడీ టీచర్ కుమారుడు ప్రవీణ్ ఆ బాలికకు వరసకు బాబాయ్ అవుతాడు. బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తూ వెళ్లి నాయనమ్మకు జరిగిన విషయం చెప్పింది. దీంతో చిన్నారిని తీసుకుని ఆమె నాయనమ్మ చందోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.చెన్నకేశవులు తెలిపారు. డీఎస్పీ గంగాధరం ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రేవులో ప్రసవం!



- ఆస్పత్రిలో చేరేందుకు పడవెక్కిన గర్భిణి
- ఒడ్డుకు చేరగానే పండంటి బిడ్డకు జన్మ

నరసాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరేందుకు పడవ ఎక్కిన ఓ నిండు గర్భిణి రేవులోనే ప్రసవించింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం మాధవాయిపాలెం రేవులో ఈ ఘటన చోటు చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా మలికిపురం మండలం రామేశ్వరానికి చెందిన నల్లి రోజాకు ఆదివారం ఉదయం నొప్పులు రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన నరసాపురం బయలుదేరారు. సఖినేటిపల్లి రేవులో పడవ ఎక్కగానే నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. పడవ ఒడ్డుకు చేరిన అనంతరం రేవు గట్టు ఎక్కలేక రోజా అక్కడే కుప్పకూలిపోయింది. ప్రసవం జరిగే సూచనలు కనబడటంతో ఆమె తల్లిదండ్రులు దుప్పటి అడ్డుగా పెట్టారు. అక్కడే ఉన్న మహిళా ప్రయాణికులు ప్రసవమయ్యే వరకు ఆమె చుట్టూ వలయంగా నిలబడి మానవత్వాన్ని చాటుకున్నారు. సమయానికి అంబులెన్స్ రాకపోవడంతో ఆటోలోనే శిశువుతో పాటు రోజాను రుస్తుంబాద ఏరియా అస్పత్రికి తరలించారు.

బాలిక ప్రాణం తీసిన గుళికల మందు

- ఇద్దరు చిన్నారులు ఆస్పత్రిపాలు

అమరావతి, జనవరి 21: తినుబండారం అనుకుని చిన్నారులు గుళికల మందు తినగా ఓ బాలిక మృతి చెందింది. మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు జిల్లా అమరావతి మండలం నరుకుళ్లపాడులో ఆదివారం జరిగిన సంఘటన వివరాలు.. గ్రామంలో ఓ రైతుకు చెందిన చేలో పత్తి తీసేపనికి కర్నూలు జిల్లా పల్లెపాడు నుంచి వలస కూలీలు వచ్చారు. ఆదివారం పనికివెళుతూ కమల్‌దిన్ లక్ష్మణ్ కుమార్తె అను(2), యర్నలుతోట చినభీమన్న కుమార్తె సురేఖ (1), పెదబీమన్న కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి(3), మరోచిన్నారిని సమీపంలోని ట్రాక్టరులో వదిలి, బిస్కెట్లు ఇచ్చి వెళ్లారు. చిన్నారులు బిస్కెట్లను తీసుకుంటూ ట్రక్కులో పడిఉన్న మొక్కజొన్న పైరుకు వేసిన గుళికలనూ తిన్నారు. మందు ఘాటుకు అను(2) కింద పడిపోగా, సురేఖ, లక్ష్మీకాంతరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతూ అను మృతి చెందింది. సురేఖ, లక్ష్మీకాంతరెడ్డిని గుంటూరుకు తరలించారు.

మావాళ్లను బంధించారు!

- నిత్యానంద ఆశ్రమం వద్ద తల్లిదండ్రుల నిరసన



చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానశిక్షణ కోసం వెళ్లిన డాక్టర్‌ను, మరో యువతిని తిరువణ్ణామలైలోని నిత్యానంద ఆశ్రమంలో నిర్బంధించారంటూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం ఆ ఆశ్రమం వద్ద వారి తల్లిదండ్రులు, బంధువులు ధర్నా చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తమిళనాడులోని తేని జిల్లా పెరియకుళానికి చెందిన గాంధీ, ఈశ్వరీ దంపతులకు మనోజ్‌కుమార్ (30) అనే కుమారుడు, వనితా అనే కుమార్తె ఉన్నారు. మనోజ్ మేలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం మదురైలోని నిత్యానంద ఆశ్రమం ఆధ్వర్యంలో జరిగిన ధ్యాన శిక్షణకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. మనోజ్‌కుమార్ మేనకోడలు నివేద (17) కూడా ధ్యాన శిక్షణకు వెళ్లి ఇంటికి చేరుకోలేదు. ఆ ఇరువురూ తిరువణ్ణామలై ఆశ్రమంలో ఉన్నారంటూ సమాచారం అందటంతో కుటుంబీకులు ఆదివారం అక్కడికి చేరుకుని వారిని విడిచిపెట్టాలంటూ ధర్నా చేపట్టారు. అయితే, మనోజ్‌కుమార్, నివేదలు దీక్ష పొంది నిత్యానందకు శిష్యులుగా మారిపోయారని, ఇక వారికి కుటుంబంతో ఎలాంటి సంబంధాలు ఉండవని ఆశ్రమ నిర్వాహకులు వారిని తరిమికొట్టారు. నివేద తల్లి వనితా మాట్లాడు తూ తన కుమార్తెలాగే మరో 50 మంది యువతులు కూడా ఆశ్రమంలో బందీలుగా ఉన్నారని, వారందరినీ విడిపించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త భాష వెదుక్కొంటున్న అర్బన్ కవిత

మొన్నో రోజు మా చిన్నోడు ఒక కొత్త sports కారుని చూపిస్తూ "Dad, This is sick!" అన్నాడు. "sick" అనే పదానికి నాకు తెలిసిన అర్థం వేరు. కానీ వాడి భాషలో దానికి అర్థం అద్భుతం అని. ఇంకోరోజు ఒక మిత్రునితో మాట్లాడుతూ ఏదో విషయం మీద తీవ్రంగా చర్చిస్తుంటే, ఒక రకమైన యాసలో "ద్యావుడా" అంటూ వెళ్ళిపోయాడు. జంధ్యాల సినిమాలంటే మనందరికీ ఇష్టమే. ఆయన సినిమాలు ఎన్ని తెలుగు పదాలకి అర్థాలు మార్చాయో చూడండి. ఓ ముప్పైఏళ్ల కిందటి 'సుత్తి' అనే పదానికి ఇప్పటి 'సుత్తి'కి అర్థంలో ఎంత తేడా ఉందో గమనించండి. 'డబ్బా', 'తొక్క', 'గురు', 'ముదురు', 'వీర', 'జాలం', 'కుమ్మడం', 'దొబ్బడం'... ఇలా అర్థాలు మారిన పదాల గురించి చెప్పుకుంటూ పోతే ఒక Urban నిఘంటువే తయారవుతుంది.

మారుతున్న కాలంతోపాటు మనం మాట్లాడే భాష మారుతుంది, యాసా మారుతుంది. మనం రోజువారీ మాట్లాడే భాషలో ఉపయోగించే పదాలూ మారతాయి. ఈ మార్పుని మనం ఆపలేం. మార్పును అంగీకరించి ఆ కొత్త slangని అర్థం చేసుకోవాల్సిందే.

కవిత్వానికి కూడా వాహిక భాషే కాబట్టి మనం మాట్లాడే భాష నుంచే కవిత్వం పుడుతుంది. ఏ కాలానికనుగుణంగా ఆ కాలపు కవిత్వ భాష కూడా మార్పు చెందుతూ వస్తుంది. ఈమధ్య రాస్తున్న అర్బన్ కవుల కవిత్వం చదువుతుంటే... ఆధునిక కవిత్వ భాష మనం రోజువారీ మాట్లాడే భాషకి దగ్గరగా వచ్చినట్టే అనిపిస్తుంది.

కొత్త కవులు తమ వ్యక్తీకరణలో, నిర్మాణంలో, నుడికారంలో, పదాల వాడుకలో స్వతంత్రతా, పరిపక్వతా చూపిస్తున్నారు. అవసరమున్న చోట పరభాషా పదాలను, కర్స్/ కస్ వర్డ్స్‌ని వాడటానికి కూడా వెనకాడటం లేదు. ఇప్పుడొస్తున్న కవిత్వంలో పదసరళి ఎలా మారుతోంది? పదచిత్రాలు, శబ్ద ప్రయోగాలు, కవి వాడే సంకేత పదాలుఎలా మారుతున్నాయో తెలుసుకోవడానికి మచ్చుకి కొన్ని కవితల్ని చూద్దాం:

రెండు ఆవులింతల నడుమ
ఓ ఆలోచన తప్పిపోతుంది అనామకంగా

ఎరుపురంగు సిగ్నల్దగ్గర
ఎస్పై చేతిలో రాయబడుతుంది ఓ మాదర్చోద్గీతం.

ఎక్కడో సముద్రాలావల తలలెగుర్తుంటాయ్
తమాషాగా అతిసుందరంగా
లేని రేపట్లోకి
ఉన్న సమయమంతా దాచబడ్తుంది అమాయకంగా,
నేనున్నాన్నీకేంభయంలే..
ఎప్పుడైనా అనుమానించావా
ఈత రాకపోతే ఎక్కడోమునిగి ఎక్కడో తేలేవాళ్ళమని
***
సర్సరే దొబ్బనిక
బ్రో
మనకెందుగ్గానీ ఈ హైబ్రో స్టఫ్
కాస్త "హై"లో ఉంటే చాలుకదా ఎల్లప్పుడూ,
నేనున్నాన్నీకేం... *(వంశీధర్ రెడ్డి - 'ultimate lyric')*

- ఇది ఈ కాలపు కవి వంశీధర్‌రెడ్డి రాసిన 'ultimate lyric' అనే కవిత. ఈ కవితలో ముఖ్యంగా రెండు పదాల గురించి చెప్పుకోవాలి. "మాదర్చోద్గీతం" అనే ఒక్క పదం వలన రెడ్ లైట్ దగ్గర జరిగిన హైడ్రామా అంతా మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. కవి ఎప్పుడైనా ఒక తిట్టు/ బూతుపదాన్ని వాడాల్సి వచ్చినపుడు అది మెప్పించదగేదిగా ఉండాలంటే, ఆ సందర్భంలో ఆ పదం బలంగా ఇమిడిపోయేట్టు ఉండాలి. సందర్భం ఆ పదాన్ని డిమాండ్ చెయ్యాలి. 'మో' రచనల్లో మనకు తారసపడే ఇలాంటి పదాలు పెద్దగా ఇబ్బంది పెట్టవు. ఎందుకంటే, కవి రచనాస్థాయిలో అవి చక్కగా ఒదిగిపోతాయి కాబట్టి. వంశీ కవితల్లో కూడా అలాంటి పదాలు చక్కగా ఒదిగిపోతాయి.

ఇదే కవితలో ఇంకో పదం 'హైబ్రో' చూడండి. 'Hybro' అంటే: male individual in one's friend circle who is intoxicated by a chemical substance, especially THC (tetrahydrocannabinol found in marijuana). అయితే, ఇక్కడ కవి 'హైబ్రో'ని highbrow (intellectual taste) అనే అర్థంతో వాడాడా అన్న అనుమానం కూడా వస్తుంది. ఈ కవితలో 'Hybro' నప్పినంతగా Highbrow నప్పదని నా అభిప్రాయం. అందులో వంశీ స్వయానా డాక్టర్ కాబట్టి 'హైబ్రో'ని chemical contextలోనే వాడిఉంటాడు. ఈ కవిత మనల్ని ఒకతాత్విక భావనలోకి నడిపిస్తుంది కాబట్టి హైబ్రో అనే పదాన్ని philosophical contextలో వాడి ఉండొచ్చు లేదా హైదరాబాద్‌లో ఇప్పుడు విచ్చలవిడిగా దొరుకుతున్న వీడ్, డ్రగ్స్ గురించి అయినా కావొచ్చు. ఇది ఇప్పటి జనరేషన్‌లో విరివిగా వాడుకలో ఉన్న పదం కూడా అయి వుండవచ్చు.

ఇప్పుడు రాస్తున్న urban కవులు కవిత్వంలో medical, scientific, technical terms కూడా విరివిగా వాడుతున్నారు. మనకు తెలియకుండానే మన professionలో నలుగుతున్న పదాలు మన కవిత్వంలో అలవోకగా వచ్చి చేరతాయనడానికి ఇది మంచి ఉదాహరణ. కవితల్లో ఇంగ్లీష్ పదాల వాడకానికి ఉదాహరణగా కూడా ఇందాకటి 'hybro'నే తీసుకోవచ్చు.



అయితే ఒక్క ఇంగ్లీష్ పదాల వాడకం వలన మాత్రమే కాదేమో ఇలాంటి కవితలకి ఆ elevation వచ్చేది. పట్టణ సంబంధమైన సంకేత పదాలతో, నుడికారంతో కవి తను పెరుగుతున్న society attitudeని పట్టుకొచ్చి చూపించడంవలన ఆ నవీనత వస్తుంది:

"చుట్టుతా ఉన్నది శూన్యం అసలే కాదు. రాలటానికీ పూయటానికీ మధ్య దుఃఖానికి వ్యవధి లేదు. రాత్రుళ్ళు గదిలో జ్ఞాపకాలు పచార్లు చేస్తున్నాయని, నిద్రంతా నీటి పాలౌతుందనీ అదే అదే సూడో రొమాంటిక్ లాఫింగ్ స్టఫ్- ప్లీజ్... ఇకపై వద్దు. హృదయం మధుపాత్ర కాదు, కనీసం డిస్పోసబుల్ టీకప్ కూడా కాదు. పింగాణీ ప్లేటో, పులిస్తరాకో తేల్చుకోవాల్సినంత సీనేం లేదు. నేను హిపోక్రాట్‌ని కావచ్చు కానీ మానిప్యులేటర్‌ని కాదు. నేను పిచ్చికుక్కని కావచ్చు కానీ కోడిపెట్టని కానందుకు క్షమించొచ్చు." (స్వాతి కుమారి బండ్లమూడి - 'అంతా అనుకున్నట్టే')

స్వాతికుమారి విలక్షణమైన ఆధునికవాక్సరణి వల్ల ఈ కవిత కొత్తదనాన్ని ఎలా సంతరించుకుందో గమనించవచ్చు. ఇలాంటి భాష వల్ల interior composition లోని గాఢత పెరుగుతుంది. మన జీవితంలోని సాంకేతికతను, పెరిగిపోతున్న complexityని పట్టుకోవాలంటే పాత భాష సరిపోదేమో అన్నట్టు ఉంటుంది ఇప్పుడు రాస్తున్న అర్బన్ కవులకవిత్వ భాష.

ఇంకో కవిత:

"దిమ్మెరపోతాం. దిక్కులు చూస్తాం. బ్లడీ క్యాన్సరని పండ్లు/ కొరుకుతాం. అంతకు మించి ఏమీ చెయ్యలేం./ రక్తదాహం./ స్లిప్ రాయించుకుని పరిగెత్తడం./ ఆ యొక్క బ్లడ్ బ్యాంకు ముందు నిలబడి, మరి, అయ్యా,/ "బీ పాజిటివ్?"./ "టైమ్ పడ్తుంది-"/ పద, ఆ హిమాలయ హోటల్లో మరింత వేడెక్కుదాం. రెండు/ చాయ్ లు, మూడు సిగరెట్లు./ ఇచ్చిన రక్తంపొట్లంలో గుండె చిక్కబట్టుకొని పీఛేముడ్." (మోహన్ రుషి - 'ఒక తండ్రి')

'స్లిప్ రాయించుకుని', 'రక్తం పొట్లం', 'పీఛేముడ్', 'హిమాలయ హోటల్లో', 'ఎన్టీయార్ నగర్ పరిసర ప్రాంతాల్లోని శృతి బార్లో' అంటూ, కవి ఈ కాలానికి నప్పే పదాలతో కవిత వెనకున్న కథని ఎంతో ఆర్ద్రంగా విప్పి చెబుతున్నాడు.

"మెట్లవద్ద ఎదురుపడ్డ మొహమాటపు తెర/ స్ట్రాటజీల వలసలో సగ్రున చిరిగింది/ వర్షాకాలపు సాయంత్రాలను సాగనంపుతున్నప్పుడు/ చిలిపి మువ్వల రింగ్‌టోన్ సవ్వడి మదిని తాకిందా?" (జెన్నీ - 'కంట్రోల్ ఆల్ట్ డిలీట్')

"అవును కదా!/ వెల్కమ్ డ్రింక్‌లు తాగేసి/ ఫేడెడ్ జీన్స్ మ్యాచ్ అయ్యాయని మురిసిపోతే సరా?/ ఒంటరి స్నేహగీతికలు ఆలపించి ఎవరిని మభ్యపెట్టినట్లు?" (జెన్నీ - *'After all, You are a faded memory!'*)

జెన్నీ కవితలలో పట్నవాసపు నైరాశ్యపు జీర వినిపిస్తుంది. మోహన్ రుషి, వంశీధర్ రెడ్డి, జెన్నీ (అపర్ణ తోట)... వీళ్ళ కవిత్వంలో ఒక urban flavor ఉంటుంది. పబ్లిక్ ప్లేసుల్లో తరచూ వినిపించే స్లాంగ్‌ని పట్టుకుని అక్షరబద్ధం చేస్తున్నారు వీళ్ళు. నిజానికి వారి మాట తీరు కూడా అచ్చువాళ్ళు రాసే కవిత్వంలానే ఉంటుంది.

"ఒక అగ్గిపుల్లని వెతుక్కుని/ ముద్దుగా నిన్ను వెలిగించుకుని/ When you tasted like a cigarette/ నిన్ను ఊదేస్తున్న/ పెదిమల చివరి నవ్వంతా తవ్వుకుని/ నిన్ను వదలక తాగే/ ఊపిరి కింది బాధంతా హత్తుకుని" *(నందకిషోర్ - 'Antithesis')*

ఇలా కొంత ఇంగ్లీష్ లో కొంత తెలుగులో సాగుతుందీ కవిత. నందకిషోర్ ఈ మధ్య రాస్తున్న కవితలన్నిటికి ఇంగ్లీష్ లో టైటిల్స్ పెట్టడం కూడా ఈ మార్పుకు సంబంధించినదే.

ఇప్పటి కవులు ఎంపిక చేసుకుంటున్న వస్తువుల కారణంగా కూడా కవిత్వ భాష మారుతోంది. కంప్యూటర్ మానిటర్‌కి అంటించే యెల్లో స్టికీ నోట్ గురించి, మౌస్ కీబోర్డ్‌ల గురించి, ఓలా ఉబర్ల గురించి, మెట్రో స్టేషన్ల గురించి, ఫేస్బుక్ ట్విట్టర్ల గురించి, ఆలుమగలు ఆఫీస్ నుండి ఇంటికెళ్ళే ముందు బండి ఆపి కొనుక్కునే కర్రీల గురించి ఇంకా కవిత్వం రావాల్సి ఉంది. ఇలాంటి వస్తువుల గురించి రాసినపుడు వాటి నేపథ్యాన్ని మనకు పట్టి చూపించాలంటే కవి కొత్త భాషను ఆశ్రయించాల్సిందే.

అయితే కవిత్వభాషకు సంబంధించిన మార్పు నిజంగా ఇప్పుడు వాడుతున్న ఆధునిక/ పరభాషా పదాల వల్ల మాత్రమే వచ్చింది కాదనిపిస్తుంది. ఎందుకో ఈ కవిత చూడండి:

"ఛందోబందో బస్తులన్నీ - ఛట్! ఫట్ ఫట్ మని త్రెంచి/ Damn it! ఏమిట్రా ఇదంటే/ Pray! it's poetry అందాం..." ఇలా సాగుతుంది. ఇది శ్రీశ్రీ రాసిన 'కొంటె కోణాలు' కవిత. శ్రీశ్రీ కవితలు, మో కవితలు, తిలక్ 'కాస్మాపాలిటన్' కవిత, ఇలా పాత తరం కవితల్లో కూడా ఇంగ్లీష్ పదాల వాడకం విరివిగానే జరిగింది. దిగంబర కవులు కూడా కర్స్ వర్డ్స్ ఎక్కువగానే వాడారు. మరి అప్పటి భాషకి ఇప్పటి భాషకి తేడా ఏమిటి?

ప్రతి తరంలోనూ అన్యదేశ్యాలు వున్నాయి. కాని, మా చిన్నోడు వాడినట్టు వాటి అర్థాలు మారుతున్నాయి. ఇప్పటి కవిత్వ భాషలో వస్తున్న ఈ మార్పుకి కారణం పదాలకు మించి ఇంకేదో ఉంది. ఈ మార్పు ఏ freedom of expression వల్లనో వచ్చి ఉండదు. బహుశా ఇప్పుడు రాస్తున్న ఈ కవులంతా పట్టణాల్లో నివసిస్తుండటం వలన కావొచ్చు. ఇప్పుడొస్తున్న కవిత్వ భాష ఇప్పటి జీవితంలో ఉన్న సంక్లిష్టత నుండి, ఇప్పుడున్న uncertainty నుంచి, struggle నుంచి, frustration నుంచి, ఒక maturity నుంచి వస్తుంది. అయితే ఇదే కొత్త కవిత్వం syntaxను మారుస్తుందా? ఈ sytaxని కవి తనకై తాను ప్రత్యేకంగా సృష్టించుకునే క్రమంలో పాత పదాలకు కొత్త అర్థాలను కనిపెడుతున్నాడా?

భాషా, కవిత్వం.. ఈ రెండు ఒకదానికొకటి complementary. భాష వల్ల కవిత్వానికి కొత్తదనం వస్తుంది. కవిత్వం వల్ల భాష కొత్తదనాన్ని నింపుకుంటుంది. 70'ల, 80'లలానే ఈ తరం కూడా తనదైన idiomని వెదుక్కుంటోంది. కానీ, ఇలా వెదుక్కునే క్రమంలో కొత్త తరం కవులు భాషని tamper చేస్తున్నారా అన్న సందేహం కూడా మనకి కలుగుతుంది.

■ రవి వీరెల్లి
ravinder.verelly@gmail.com

థర్డ్ డిగ్రీ



ప్రతి గ్రామం
నిలువెల్లా గాయం
ప్రతి మనిషి
అందంగా చెక్కిన నగిషీ

బుల్లితెర సెల్‌ఫోన్
వాట్సప్ ఫేస్‌బుక్
ఏదో ఒక వ్యసనంకు బానిసను చేసి
రాజ్యం గమ్మత్తును చూస్తుంది

కత్తికి నెత్తురు అంటదు
అమానుషం జరిగి పోతుంది

ఓటు కోసం మాటు వేయడం
పాము కాటు కన్నా ప్రమాదకరం

అనస్తీషియా అక్కర లేదు
చర్మం మొద్దు బారి పోతుంది
మర్యాద ముసుగులో
సమస్యనుంచి పారిపోతాం

అమ్ముల పొదిలోని
ఆయుధం ప్రశ్న ఎక్కుపెట్టకుండానే
రంగం నుంచి నిష్క్రమించడం

ఆధిపత్యం ముంచుతుందనే
అస్తిత్వం నిలబెట్టుకున్నం
ముందు తరాలకు ఏమి వుంచుతున్నరు
వనరులను ఏమి పంచుతున్నరు



కాసులకు దాసులు
అవడం నూతనమేమి కాదు
కేసుల్లో ఇరికించడం
పెద్ద కొత్తదేమి కాదు

పటం మారింది గానీ
పాలకుల మటం అంతా ఒక్కటే

నిజమే చట్టానికి కులం వుండదు
ఆచరణ చుట్టానికి మాత్రం
ఎల్లప్పుడూ బలహీనుడే
బలి చక్రవర్తి అయిపోతాడు

పాత చింతకాయ కుళ్లింది
కారణం గతం మీద
నెట్టి వేసే కాలం చెల్లింది

కాలంలో పుండు మానిపోవచ్చు
మచ్చ మెండుగా సలుపుతున్నది
ఒకానొక హెచ్చరికను తెలుపుతున్నది

నీ లోలోన ఎల్లెడలా
ఒక థర్డ్ డిగ్రీ అమలు అవుతుంది
దెబ్బలు కనిపించవు
పెడ బొబ్బలు వినిపించవు
మందని కట్టెలా
పొగచూరి పోతుంటావు



నీకు నువ్వే స్వచ్ఛందంగా
నియంత్రించుకుంటావు

కవి పాత్ర అప్రమేయం
మాట్లాడుతున్నది గాయం

మెచ్చుకోలు కోసం
పనకుచ్చులా ఎగిరెగిరి పడుతావు
అంతస్తుకు మస్తుగా చేరి
నిచ్చెనను బచ్చాలా తన్నేస్తావు

■ జూకంటి జగన్నాథం

గ్రంథ పరిచయ సభ

గండ్ర లక్ష్మణరావు రచించిన 'తెలంగాణ పద్యకవితా వైభవం', ఖలీల్ జిబ్రాన్ అనువాదం 'వెర్రిమానవుడు' గ్రంథాల పరిచయ సభ కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో జనవరి 24 సా.5గం.లకు నిర్వహించబడుతుంది. ముఖ్యఅతిథి నందిని సిధారెడ్డి; అధ్యక్షత దాస్యం సేనాధిపతి; పరిచయ ప్రసంగకర్తలు నలిమెల భాస్కర్, వారాల ఆనంద్. సభలో ఎన్. శ్రీనివాస్, వేణుశ్రీ, అనంతాచార్య తదితరులు పాల్గొంటారు.

- సాహితీ గౌతమి

రాజారాం మహారాజ్ పురస్కారం

రామదాసి రాజారం మహారాజ్ స్మారక సాహితీ పురస్కార ప్రదాన సభ జనవరి 28 ఉ.10గం.లకు హోటల్ నిఖిల్ సాయి ఇంటర్నేషనల్, నిజామాబాద్ నందు జరుగుతుంది. ముఖ్య అతిథి నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథి భరత్ నగేష్. పురస్కార ప్రదాత సురేశ్ ఆత్మారాం మహారాజ్. గ్రహీతలు: అయాచితం నటేశ్వర శర్మ, ఏనుగు నరసింహారెడ్డి, దాస్యం సేనాధిపతి, వి.పి.చందన్‌రావు, శ్రీచరణ్, పాయల్.

- పోరెడ్డి రాజేశ్వరి

ఉమ్మడిశెట్టి పురస్కారం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు త్రిదశాబ్ది పురస్కారం 2017కు శ్రీసుధ మోదుగు కవితా సంపుటి 'అమోహం' ఎంపికైంది. న్యాయనిర్ణేతలు కొప్పర్తి వెంకట రమణమూర్తి, మేడిపల్లి రవి కుమార్, ఆర్.సీతారాం. త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న సభలో ఈ అవార్డు ప్రదానం జరుగనుంది.

- రాధేయ

'మడి విప్పిన చరిత్ర' పుస్తకావిష్కరణ

'అన్వేషి', 'హైదరాబాద్ బుక్ ట్రస్ట్'ల సంయుక్త నిర్వహణలో బ్రజ్ రంజన్ మణి రచించిన 'మడి విప్పిన చరిత్ర' (ఆంగ్లమూలం: 'డీబ్రాహ్మినైజింగ్ హిస్టరీ') పుస్తకావిష్కరణ సభ జనవరి 27 సా.5.30గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ నందు జరుగుతుంది. ఈ సందర్భంగా 'భారత ప్రజాస్వామ్యానికి వారసత్వ హిందుత్వ ముప్పు' అంశంపై పుస్తక రచయిత కీలకోపన్యాసం చేస్తారు. అధ్యక్షత ఎ.సునీత, అన్వేషి; వక్తలు ఎం.ఎఫ్. గోపీనాథ్, భంగ్యా భుక్యా, అశోక్ టంకశాల.

- హైదరాబాద్ బుక్ ట్రస్ట్



ఒక దేహాత్మలోకి...

చిరుగాలి
అల్లరి ఆటలకు
పట్టుతప్పిన
ఒక్కో పారిజాతమూ
మేనిపై
మెత్తగా రాలుతుంటే...!

ఎదలో ఒక మత్తైన
ప్రేమ తడి ఆర్తిగా
తాకుతూ
వెన్నెముక చివరికంటా
ఒక వెచ్చని పెదవుల
రహస్యపు సడి!

మోహసంద్ర మథనంలో
పుట్టిన మధురం
నాల్గు అధరాల
ప్రాణాధరువైన వైనం
మదినిమీటి ఎగస్తున్న
తీపి కూనిరాగం!

మేఘంలా కమ్మేసి
అణువణువునా తడుముతూ
తడుపుతుంటే
మృణ్మయ పాత్రలో
తొలి చినుకు రేపే
ఆవిరి పరిమళం!

ఓటమిలేని
వూపిరులాటలో
ఒళ్ళంతా పూస్తున్న
వెన్నెల నలుగు
ప్రతి పున్నమి రాత్రీ
వెలుగు చినుకులైన సంరంభం!

మేని చినుకులే
కుడ్య చిత్రాలుగా
మొలుచుకొస్తుంటే
పొత్తిళ్ళలో బిడ్డలా
కనులనిండుగా పూసి
వొడి బరువెక్కుతున్న తమకం!

రాలుతున్న పువ్వులన్నీ
జ్ఞాపకాల రాశులే!

■ ఝాన్సీ పాపుదేశి

రాయలపై రాయకూడని రాతలు

రాయల కాలం తరువాత 150 ఏళ్ళకు సుమారుగా తెలుగులో వచ్చిన 'రాయవాచకం'లోనూ, దానిని అనుసరించి కన్నడంలో రచింపబడిన 'కృష్ణరాయదినచరి'లోను రెండు సంఘటనల వివరాలున్నాయి.

వారసత్వపు రాచపుండుతో దేహమంతా వాతానికి గురియై, తన అంత్యకాలం సమీపించడం గమనించి, తుళువ నరసనాయకుడు తన తరువాత తన బాధ్యతనెవరికొప్పించాలో నిర్ణయించడానికి సమర్థుని ఎన్నుకోవడానికి పూనుకొని- తివాచీ మీద కాలుపెట్టకుండా తన వద్దకు వచ్చి, బాగా వాచి స్పర్శను కోల్పోయిన తన వేలికున్న ఉంగరాన్ని తీసుకోవలసిందిగా కోరాడట. ఆయన కుమారులందరినీ పిలిపించి తన నిశ్చయాన్ని తెలిపాడట. నరసనాయకుని మిగతా పుత్రులందరూ ఎలా తండ్రిని చేరుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతూంటే ఆయన రెండవ కుమారుడైన కృష్ణదేవరాయలు, తివాచీకి కాళ్ళు తగలకుండా తివాచీపై పడుకొనే పొర్లుతూ రాజును చేరి, బాగా వాచి ఉబ్బిపోయి కదల్చలేని వేలిని చురికతో తీసివేసి ఉంగరాన్ని గ్రహించాట్ట. (ఇంకో దాంట్లో ఉంగరం బదులుగా కత్తి వుంది.) దాన్ని గమనించిన నరస నాయకుడు, పరిపరి విధాల హర్షించి తన తదుపరి వారసత్వపు హక్కును కృష్ణరాయలకు అందించాడని ఒక కథనం వుంది. అది కృష్ణరాయల సమయస్ఫూర్తినీ, ప్రజ్ఞను ప్రదర్శించిన సంఘటనగా పేర్కొనబడింది.

ఈమధ్యనే 'కర్ణాటక సామ్రాజ్యపు శ్రీకృష్ణదేవరాయలు' పేరిట 'చరిత్ర పరిశోధనము' అన్న ఉపశీర్షికతో కర్రి నాగార్జునశ్రీ అనే రచయిత (ఇటీవలనే 06-02-2015న కాలధర్మం చెందినవారు) రాసిన పుస్తకం పైకథలను ఒక కొత్త కోణంలో పరిశీలించి వ్యాఖ్యానాన్ని జోడించింది. పై రెండు సంఘటనలనూ-- అంటే ఉంగరాన్ని స్వీకరించడం, ఖడ్గాన్ని స్వీకరించడం అనే రెండు ఘట్టాల్ని-- వారు విశ్లేషించిన తీరు ఇది. వ్రేలు నరికివేసి ఉంగరం స్వీకరించడంలో "వ్రేలు" అంటే హత్యకు గురైన (నరసనాయకుని రక్షణలోవున్న సమయంలో చంపబడిన) సాళువ తిమ్మరాయలు. కృష్ణరాయలే సాళువ తిమ్మరాయల్ని చంపించగా అది తెలిసీ పుత్ర వ్యామోహంతో నరసనాయకుడు మౌనం వహించాడనీ, నింద తనమీద రాగా, తరువాత మాపుకొన్నాడని అర్థమట. దీని సారాంశం కృష్ణరాయలు రాజ్యం కోసం ఎంతటి హైన్యానికైనా తయారవుతాడనీ, దురాశాపరుడనీ, నేల మీద పడిపొర్లుతూ వెళ్ళడంలోని అంతరార్థం అదేననీ విశ్లేషించారు.

ఇహ ఖడ్గాన్ని అందుకొనేటప్పుడు కూడా కృష్ణరాయలు పైపంథాలోనే ఖడ్గం దక్కించుకొన్నాడనీ, సాళువ తిమ్మరాయల హత్య తరువాత నరసనాయకుడు (13 ఏళ్ళ తరువాత) తానే గద్దె మీద కూర్చొనజేసిన తుమ్మరాయల్ని కృష్ణరాయల కోసం చంపి నింద మూటకట్టుకొన్నాడనీ రచయిత తన సొంత ఊహాపోహలతో నిర్ణయించివేశారు. ఇదే జరిగివుంటే నరసనాయకుని మరణం తరువాత కృష్ణరాయలు ఆయన పదవిలోకి రాలేదెందుకని? నరసనాయకుని మరణం తరువాత 3 ఏళ్ళ వరకూ తుళువ వీరనరసింహరాయలు రాజప్రతినిధిగా వుండి తరువాతనే తుమ్మరాయలని ప్రక్కకునెట్టి తనను సార్వభౌమునిగా ప్రకటించుకొన్నాడని శాసనాధారాలతో ఎందరో చరిత్ర పరిశోధకులు తేల్చారే. ఏ ఆధారమూ లేకుండా ఒక మహావ్యక్తిపై బురద చల్లడం ఏమిటో అర్థం కావడం లేదు.


అంతటితో రచయిత ఊహాసంపద ముగిసిపోలేదు. ఈ పుస్తకంలో ఇంతకు మునుపు కృష్ణరాయలపై ఏ ఒక్కరూ కూడా మోపని ఒక గొప్ప నిందను మోపారు. అది ఇలా సాగింది. చాటుపద్యంగా, తెనాలి రామకృష్ణునిదిగా, కృష్ణరాయల రెండో అల్లుడైన తిరుమల రాయల్ని గూర్చి రాసినదిగా భావింపబడుతున్న ఈ క్రింది పద్యం--

కం: అన్నాతి గూడ హరుడగు
అన్నాతిని గూడకున్న అసురగురుండౌ
అన్నా! తిరుమల రాయా
కన్నొక్కటి లేదుగానీ కంతుడవు కావే!

అన్న పద్యానికి వారి నిర్వచనం చూడండి.

ఈ రచయిత దృష్టిలో ఈ పద్యంలో శ్రీకృష్ణరాయలు తన కుమారుడు ఆరేళ్ళ తిరుమల రాయలకు అన్న వీరనరసింహరాయలను గూర్చి తెలిపాడట. అదీ రామకృష్ణుని ద్వారా చెప్పడం. పట్టమహిషి కొడుకైన వీరనరసింహరాయలు సింహాసారోహణకు అనర్హుడనీ, అందుకు కారణం అతనిలో ఏదో లోపం ఉండాలని, అందుకే తన మరణవేళ తిమ్మరుసును పిలిచి తన కొడుకును అతనికి అప్పగించి కృష్ణరాయల్ని అంధుణ్ణి చేయమని చెప్పాడనీ, తిమ్మరుసు రాయల్ని ఒక గుర్రపుశాల వద్దకు తోడ్కొనిపోయి, అన్నగారి ఆదేశాన్ని వినిపించగా అందుకు కృష్ణరాయలు హక్కురీత్యా రాజ్యాధికారం తనకే చెందవలసి వున్నా- తనకా ఆశలేదనీ, ఏ పదవినీ చేపట్టటం ఇష్టం లేదని, లోకంలో ఒక జోగిలాగా కాలం గడపాలనుకుంటున్నాననీ, తన కన్నులు తీయించడమంత అపరాధం అన్న యెడల తానేమీ చేయలేదని తెలిపాడట.

పేయస్, న్యూనిజ్‌లు పోర్చుగీస్ భాషలో రాయగా కాలాంతరంలో బళ్ళారి జిల్లా కలెక్టర్ రాబర్ట్ సీయెల్ మహాశయుని చేత ఆంగ్లంలోకి అనువదింపబడి 20వ శతాబ్ది ప్రారంభంలోనే వచ్చిన 'The Forgotten Empire' అన్న గ్రంథానికి పూర్వం నిజంగానే విజయనగర సామ్రాజ్యం మరపున ఉండేది. ఇన్నిసార్లు భాషలు మారినపుడల్లా ఎంత పొల్లు చేరిందో, ఎంత పలుచన అయ్యిందో గానీ, నరసనాయకుని వారసత్వం కృష్ణరాయలకే ఉంది అన్న సూచన తిమ్మరుసుతో కృష్ణరాయల సంభాషణల్లో వ్యక్తమౌతుంది. తన మరణం తరువాత తన కొడుకును గద్దెపై కూర్చొండబెట్టమని తిమ్మరుసును ఆజ్ఞాపించిన వీరనరసింహరాయల మాటల్లో కూడా గద్దెనెక్కే హక్కు కృష్ణరాయలకే వున్నట్లు చూచాయగా తెలియవస్తుంది. అంటే జ్యేష్ఠునికే చెందవలసిన తండ్రి వారసత్వం, వీరనరసింహులకి కాక కృష్ణరాయలకే వున్నది, అంటే పెద్దవాడు ఏ కారణం చేతనో అనర్హుడైతేనే ఇది సాధ్యం. అతని లోపం ఒక కన్ను లేకపోవడం కావచ్చు కదా! ఎంత త్వరగా ఎక్కడా ఏ ఆధారమూ కనిపించని, వినిపించని గుట్టును రచయిత కనిపెట్టేసారు! పాపం తండ్రి తరువాత ఏ అవరోధాలూ లేకనే రాజ ప్రతినిధిగా స్వయంనియామకుడై మరో మూడేళ్ళకు, సాళువ తిమ్మరాయల్ని పక్కకు తోసి తానే చక్రవర్తిత్వం నెఱపడం వీరనరసింహరాయలకి ఎలా సాధ్యపడిందో మరి. కృష్ణరాయలు తన కళ్ళు తీయించి తనను గద్దెనెక్కకుండా నిరోధించే ప్రయత్నం చేసిన వీరనరసింహరాయల గురించి- తాను పట్టాభిషక్తుడైన రెండుమూడేళ్ళలో తిరుపతిలో వేయించిన త్రిభాషా శాసనంలో తానూ, తన అన్న వీరనరసింహరాయలు రామలక్ష్మణుల్లా అన్యోన్యంగా వుండేవారమని ఎలా తెలిపాడు? మన రచయితకు ఇదంతా తెలియదో, సత్యమైన సంగతులు తెలిపే సమయంలో ఆయన కళ్ళు మసకబారతాయో తెలియదు. కృష్ణరాయలే వారు ఊహించినంత దుర్మార్గుడూ రాజ్యకాంక్ష ఉన్నవాడూ అయితే గద్దెనెక్కిన తర్వాత తనకు ప్రతిస్పర్థులుగా వున్న అన్న కొమరునితో పాటు, అచ్యుతరాయుడిని చంపకుండా చంద్రగిరిలో సుఖంగా ఎలా వుంచాడు?



సాళువ నరసింహరాయల కుమారుల్లో తిమ్మరాయల్ని కృష్ణరాయలు తండ్రిని బెదిరించి హత్య చేయించాడనీ, నింద నరసనాయకునిపై పడిందనీ, ఆయన చాలా జాగ్రత్తగా నిందను మాపుకొన్నాడనీ రచయిత రాశారు. 13 ఏళ్ళ తరువాత తిమ్మరాయల తమ్ముడు తమ్మరాయలను నరసనాయకుడే చంపించాడని మరోచోట చెబుతారు. ఒకచోట సాళువ, తిమ్మ, తమ్మరాయళ్ళను కృష్ణరాయలే చంపి (13 ఏళ్ళ అంతరంలో) తన స్థానాన్ని సుస్థిరపరుచుకొన్నాడని రాశారు. నరసనాయకుడు 1503లో మరణిస్తే తమ్మరాయలు 1506లో అసువులు కోల్పోయాడు. అంటే వీరనరసింహరాయలు తమ్మరాయల్ని చంపో, తప్పించో తానే రాజైనాడు. మధ్యలో పాలన 1503-06 వరకు దమ్మరాయల పేరునే సాగించదని శాసనాల ద్వారా తెలుస్తున్నది.

రచయిత పొంతనలేని వూహల ద్వారా విశ్లేషణ చేసిన విధానంలో స్పష్టత కొరవడి గజిబిజి చేసి తాను కూడా ముడులు విడదీయలేని దారపు వుండ బాపతుగా మిగిలిపోతారు. ఏ శాసనాన్ని కానీ, ఏ పూర్వ రచనల్ని కానీ వున్నదున్నట్టుగా స్వీకరించకుండా అవన్నీ ఎన్నో గుప్తమైన అంతరార్థాలు కలిగి వున్నాయని చెబుతారు. మళ్ళీ మొదటికొచ్చి కృష్ణరాయలు సాళువ తిమ్మరాయల్ని భౌతికంగానూ, తండ్రి నరసనాయకుణ్ణి నైతికంగానూ హత్యచేశాడని తెలుపుతారు. పుక్కిటి పురాణాలను ఆధారం చేసుకొని, చాలా అనుచితమైన వ్యాఖ్యలు చేస్తారు. కృష్ణరాయలకీ విజయనగర సామ్రాజ్యానికి సంబంధంలేని అనేక విషయాల్లో తలదూరుస్తారు. కృష్ణరాయలు పదవీ వ్యామోహ పీడితుడనీ, తన లక్ష్యమైన రాజ్యాధిపత్యానికై సిగ్గుశరాలు మరచి, వంశ ప్రతిష్ఠనూ, తండ్రి ప్రతిష్ఠనూ తుడిచిపెట్టి నీచాతినీచంగా ప్రవర్తించాడని ఆరోపిస్తారు. మన చరిత్రలో అత్యుత్తమ పాలకులు ఐదారుగురిలో ప్రథమ స్థానంలో ఉండి, మన జాతికీ సాహిత్యానికీ ఆర్షధర్మానికీ చైతన్యాన్ని నింపిన మహానుభావుడు రాయల్ని ఈవిధంగా దృష్టించడం అతిహేయమైన పని.

■ గుత్తి (జోళదరాశి) చంద్రశేఖర రెడ్డి
91779 45559

3 వేల కిలో మీటర్లకు మహర్దశ

జాతీయ రహదారులుగా రాష్ట్ర రహదారులు.. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో ప్రాధాన్యం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కీలకమైన రాష్ట్ర రహదారుల దశ తిరగనుంది. పెరిగిన ట్రాఫిక్, రవాణా, ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని 3,000 కిలోమీటర్ల పరిధిలోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని రోడ్లు, భవనాల శాఖ(ఆర్అండ్బీ) నిర్ణయించింది. వీటిలో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే 2,000 కిలోమీటర్ల రహదారులకు జాతీయహోదా కల్పించనున్నారు. ఈ భారీ ప్రాజెక్టు అమలుకు రూ.15వేల కోట్లపైనే ఖర్చుకానుందని అధికారులు అంచనావేశారు. అయితే, జాతీయ రహదారుల నిర్మాణం, అభివృద్ధికి కేంద్రం పూర్తిగా ఆర్థిక సహాయం చేయనుంది కాబట్టి తొలుత రాయలసీమ, ఆ తర్వాత మిగిలిన జిల్లాల్లోని రాష్ట్ర రహదారులను నేషనల్ హైవే జాబితాలోకి తీసుకురావాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6,401 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారులు ఉన్నాయి. కొత్తగా ప్రతిపాదించిన, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు ఇందుకు అదనం. 15,366 కిలోమీటర్ల పరిధిలో రాష్ట్ర ప్రధాన రహదారులున్నాయి. జిల్లా ప్రధాన, గ్రామీణ రహదారులు 31,593 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర ప్రధాన రహదారులను విస్తరించి రెండు నుంచి నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని తొలుత భావించారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని, రాష్ట్రం భరించలేదని తేల్చారు. ఈ నేపథ్యంలో వాటిని జాతీయ రహదారుల జాబితాలోకి తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు నెలల క్రితం జరిగిన ఓ సమీక్షలో ఆర్అండ్బీని ఆదేశించారు. అయితే, సాధ్యాసాధ్యాలపై అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. తొలుత పంచాయతీరాజ్ నుంచి తీసుకున్న 5,000 కిలోమీటర్ల రహదారులనే పూర్తిగా ఆర్అండ్బీ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధిచేయలేకపోయారు. ఇందులో ఇప్పటికి కేవలం 3,280 కిలోమీటర్లనే ఆర్అండ్బీ ప్రమాణాలతో అభివృద్ధి చేశారు. మిగిలిన రహదారుల అభివృద్ధికి ఆర్అండ్బీ వద్ద డబ్బుల్లేవు. అయితే గత ఏడాది డిసెంబరులో కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన ప్రజారవాణా అవసరాలను తీర్చేందుకు జిల్లా రహదారులను రాష్ట్ర రహదారులుగా, రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని, ఇందుకు వెంటనే ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలిస్తామని రాష్ట్రాలకు తెలిపింది. దీంతోపాటు, కేంద్రం వద్ద ఉన్న పెండింగ్ ప్రతిపాదనలకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులోనే ఏపీకి సంబంధించిన 1200 కిలోమీటర్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అదనంగా మరో 1800 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను కూడా కలిపి మొత్తం 3000 కిలోమీటర్లను జాతీయ రహదారులుగా మార్చాలని ఆర్అండ్బీ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి అదనపు ప్రతిపాదనలు పంపించనుందని తెలిసింది. ముందుగా కేంద్రం ఒకే చేసిన 1200 కిలోమీటర్లను తొలి రెండేళ్లలో పూర్తిచేయాలని భావిస్తున్నారు.

పంచాయతీ రోడ్ల అభివృద్ధి కష్టమే!

పంచాయతీరాజ్ శాఖ నుంచి తీసుకున్న 5,486 కిలోమీటర్ల రహదారులను ఆర్అండ్బీ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ఆర్అండ్బీని నిధుల కొరత వెంటాడుతోంది. నాబార్డు, ఏఐఐబీ, ఎన్‌డీబీ, ఏడీబీ బ్యాంకుల నుంచి రుణం తీసుకొని వీటిని అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు, 4500 కిలోమీటర్ల నిడివిగల జిల్లా ప్రధాన రహదారులను రాష్ట్ర రహదారులుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించనున్నారు. 2018-19లో ఈ రోడ్ల అభివృద్ధికి రూ.350 కోట్ల నిధులను కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రహదారుల విస్తరణ వల్ల గ్రామీణ రోడ్ల దశ తిరగనుంది. సింగిల్ లేన్‌గా ఉన్న ఈ రోడ్లను పెరిగే అవసరాలను ఎదుర్కొనేలా విస్తరించనున్నారు. 2200 కిలోమీటర్ల రహదారులను రెండు వరుసలుగా అభివృద్ధి చేస్తారు.

▸▸ బ్యూటీషియన్‌గా వచ్చి..

పనిమనిషిగా మారి..!



విమానాశ్రయంలో లక్ష్మీనర్సమ్మకు టికెట్ అందజేస్తున్న మంజు మణికంఠన్

తోటి భారతీయురాలి సాయంతో ఎట్టకేలకు ఇంటికి..

ఎడారి దేశంలో ప్రొద్దుటూరు మహిళ అగచాట్లు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: బ్యూటీషియన్లకు మంచి డిమాండ్ ఉంది. నెలకు లక్షల్లో సంపాదించవచ్చన్న ఏజెంటు మాటలు నమ్మి సౌదీ అరేబియాకు వెళ్లిన తెలుగు మహిళ అక్కడ పనిమనిషిగా మారి నానా అగచాట్లు పడిన ఉదంతమిది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గాల లక్ష్మీనర్సమ్మ రెండేళ్ల క్రితం అప్పు చేసి మరీ సౌదీ అరేబియాలోని ఓ ఎడారి పట్టణానికి వెళ్లింది. బ్యూటీషియన్ ఉద్యోగం ఇప్పిస్తానన్న ఏజెంటు చివరికి ఆమెను ఓ ఇంట్లో పనిమనిషిగా చేర్చాడు. మోసపోయానని తెలుసుకున్నా తిరిగి వచ్చే దారి లేక రెండేళ్లుగా లక్ష్మీనర్సమ్మ అదే ఇంట్లో పనిమనిషిగా చేస్తోంది. అయితే, గత 9 నెలలుగా యజమానురాలు ఆమెకు జీతం ఇవ్వడం మానేసింది. కనీసం స్వదేశానికైనా పంపాలన్న లక్ష్మీనర్సమ్మ వినతిని యజమానురాలు తిరస్కరించింది. దీంతో ధైర్యం కూడగట్టుకుని ఇంటి నుంచి పారిపోయిన లక్ష్మీనర్సమ్మ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఆమెను దమ్మాంలోని విదేశీయుల విభాగానికి పంపించగా, అక్కడ మంజు మణికంఠన్ అనే భారతీయ మహిళా సామాజిక కార్యకర్త లక్ష్మీనర్సమ్మ యజమానురాలితో మాట్లాడి 3 నెలల జీతం ఇచ్చేలా ఒప్పించారు. శనివారం రాత్రి తానే దగ్గరుండి లక్ష్మీనర్సమ్మను చెన్నై విమానం ఎక్కించారు.



విజయనగరంలో ఓ కార్యక్రమంలో బాబూమోహన్

చంద్రబాబు సూపర్

▸ ఏ ఉపద్రవాన్నైనా తట్టుకోగలరు: బాబూ మోహన్

విజయనగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి పరిపాలనాదక్షుడు.. అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేసే నేతగా తెలంగాణ రాష్ట్రసమితి ఎమ్మెల్యే, సినీ నటుడు బాబూమోహన్ అభివర్ణించారు. ఆదివారం ఓ వ్యక్తిగత కార్యక్రమంలో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఎలాంటి ఉపద్రవం వచ్చినా తట్టుకుని ముందుకు పోగల ధైర్యం చంద్రబాబు సొంతమని కితాబిచ్చారు. 'ఆయనతో కలిసి పనిచేసిన రోజుల్లో ఆయన పనితనాన్ని దగ్గరగా చూసేవాడిని. ఆయన ఓపిక, పట్టుదలను చూసి ముగ్ధులయ్యేవారం. ఇప్పటికీ అదే స్పీడు, పట్టుదల ఆయనలో కనిపిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బాబు సూపర్.. బ్రహ్మాండం' అని చెప్పారు.

ప్రగతి చెప్పుకోలేని శాఖ నాది

▸ ఎంపీ అవంతితో ఎక్సైజ్ మంత్రి జవహర్

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర మంత్రివర్గంలో ప్రతి మంత్రి తన శాఖలో సాధించిన ప్రగతిని చెప్పుకొంటారు. కానీ నేను మాత్రం చెప్పుకోలేను' అని ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. ఆదివారమిక్కడ జరిగిన టీడీపీ వర్క్‌షాపు సందర్భంగా ఆయనకు, అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్‌కు మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. తాము కేంద్రాన్ని ఒప్పించి ఏదో ఒకటి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ఏదో ఒకటి సాధిస్తే తప్ప తమకు గౌరవం ఉండదని.. రాష్ట్రంలో ఉన్నవారికి అలాంటి ఇబ్బందులు లేవని ఎంపీ సరదాగా వ్యాఖ్యానించారు. జవహర్ స్పందిస్తూ.. 'నాది మరీ చిత్రం. నా శాఖలో ఆదాయం పెరిగిందని, ప్రగతి పెరిగిందని చెప్పుకోలేను. మద్యం అమ్మకాలు పెరిగినా పెరిగాయని గొప్పగా.. ఆ మాటకొస్తే అసలు చెప్పుకోలేని పరిస్థితి. అందుకే మా శాఖ సాధించిన ప్రగతి బెల్టుషాపులు లేకుండా చేయడమేనని మాత్రమే చెబుతున్నా' అని నవ్వుతూ అన్నారు.

వీఆర్‌వోల సమస్యలపై ఐక్య పోరాటం: అశోక్‌బాబు

విజయనగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలంతా ఐక్యంగా ఉండాలని, సమస్యలపై కలసికట్టుగా పోరాడదామని ఎన్‌జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాచలం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులంతా ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని చెప్పారు. 2002 జనవరిలో వీఆర్వోలను రెగ్యులర్ చేసినప్పటికీ ఎన్‌జీవోలుగా గుర్తించలేదని, పోరాటంతో ప్రభుత్వం స్పందించి గుర్తింపు ఇచ్చిందని తెలిపారు.

పనిచేస్తే ఎప్పటికీ మనమే

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉంటే.. ఐదేళ్లు ప్రతిపక్షం అన్నట్టు పరిస్థితి ఉండేది. ప్రభుత్వ వ్యతిరేకత ఎన్నికల్లో కీలకపాత్ర పోషించేది. 1991 నుంచే ట్రెండ్ మారింది. సమర్థత, పనితీరు ఆధారంగానే ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో 15-20 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. మనం కూడా గతంలో వరుసగా రెండుసార్లు గెలిచాం. ఆ తర్వాత కొన్ని కారణాలతో ఓడిపోయాం. కొంచెం జాగ్రత్తగా ఉండుంటే తెలుగుదేశం పార్టీని ఓడించే శక్తి ఎవరికీ ఉండేది కాదు.' అన్నారు. ఉండవల్లిలోని సీఎం నివాసం సమీపంలో ఆదివారం టీడీపీ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చింది ఈ మూడున్నరేళ్లేనని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు కూడా మారారని, టీడీపీకి మద్దతు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారని అన్నారు. ప్రజలకు ప్రతిపక్షంతో అవసరం లేదని, 175 అసెంబ్లీ స్థానాలు, 25 లోక్‌సభ స్థానాల్లో పార్టీ గెలుపు ఖాయమని ఉద్ఘాటించారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో రాజకీయ పునరేకీకరణ జరగాలని అన్నారు. అభివృద్ధికి మరింత సమయం కేటాయించేందుకు అన్ని ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. 'స్థానిక సంస్థల ఎన్నికలు, సహకార ఎన్నికలు, శాసనసభ, పార్లమెంటు ఎన్నికలు అన్నీ ఒకేసారి వచ్చేలా చేస్తున్నాం. ఈ ఎన్నికలన్నీ ఆరునెలల కాలంలో అయిపోతాయి. మిగిలిన నాలుగున్నరేళ్లు పనిచేసేందుకు అవకాశం ఉంటుంది.' అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నో సమస్యలు ఎదురైనా అన్నింటినీ అధిగమించి ముందుకు సాగుతున్నామని ప్రకటించారు. రాజధాని రైతుల మంచితనంతో 33 వేల ఎకరాలను సమకూర్చుకున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంపై ప్రజల నమ్మకం ఏమాత్రం సడలలేదని తెలిపారు. మూడున్నరేళ్ల తర్వాత నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశంలో ప్రజలు చూపిన ఆదరణే దీనికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌పై ఎవరో ఏదో మాట్లాడుతున్నారని, 1995 ముందు జరిగిన అభివృద్ధి - 1995 తర్వాత జరిగిన అభివృద్ధి ఏమిటనేది పరిశీలిస్తే హైదరాబాద్‌కు ఎవరేం చేశారో స్పష్టంగా తెలుస్తుందన్నారు.

ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దీక్ష

రాష్ట్రవ్యాప్తంగా ఈ మార్చినాటికి అందరికీ మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్యం పూర్తికాకుంటే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేస్తానని సీఎం తెలిపారు. నాడు మహాత్మాగాంధీ కూడా ఇదే పని చేశారని, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంత కంటే మార్గం లేదన్నారు. ఎన్నికల హామీల్లో ఇక రెండే మిగిలి ఉన్నాయని సీఎం తెలిపారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి, నిరుద్యోగ భృతి ఇస్తే ఇచ్చిన హామీలకు మించి వందరెట్లు చేసినట్లు అవుతుందన్నారు. 'రేషన్‌కార్డులు రాష్ట్రంలో ఉన్న కుటుంబాల కంటే ఎక్కువున్నాయి. రేషన్‌కార్డుల కోసం కుటుంబాలను విడదీయవద్దు.' అన్నారు. సంప్రదాయం పేరుతో కోడి పందేలు ఆడుతున్నారని, వాటి పక్కనే జూదం ఆడుతున్నారని ఇలాంటి వాటిని సహించేది లేదన్నారు. వచ్చే ఏడాది జూదం అన్న పదానికే చోటు లేకుండా చూడాలన్నారు. ఈ నెల 26న దళిత తేజం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, దళితుల కోసం పార్టీ ఎంతో చేసిందని, ఈ విషయాలను వివరించి వారిని పార్టీ వైపు ఆకర్షించాలని చంద్రబాబు సూచించారు.

త్వరలో పోలవరం ఎస్క్రో ఖాతా

▸ జాప్యం లేకుండా చెల్లింపులు

మూడున్నరేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చానని సీఎం తెలిపారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా ప్రాజెక్టులు పూర్తి చేసి తీరుతామన్నారు. 'పోలవరం ప్రాజెక్టును చాలావరకు పూర్తిచేశాం. ఒక కార్యదర్శి చేసిన పనివల్ల ఆలస్యమైంది. కానీ చివరకు ఎగువ కాఫర్ డ్యామ్‌కు కేంద్రం అనుమతించింది. 2014 ధరలతో చేస్తామని నవయుగ ముందుకొచ్చింది. త్వరలో ఎస్క్రో ఖాతా తెరచి నవయుగకు బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తాం. చింతలపూడి ఎత్తిపోతల నుంచి ఆరువేల క్యూసెక్కుల నీరు తీసుకెళ్తాం. ఆ నీటిని పోలవరం కుడి కాల్వకు తేగలిగితే.. అమరావతిలో వైకుంఠపురం దగ్గర ఎత్తిపోతల పెట్టి నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాల్వ కింద 13-14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వొచ్చు. పోలవరం ప్రాజెక్టును వందకు వెయ్యి శాతం పూర్తి చేస్తాం.' అని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్తులో నాగావళి -వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా.. ఐదు నదుల్ని అనుసంధానించి మహాసంగమం చేస్తామని ప్రకటించారు.

ఊరికే కబుర్లు చెప్పొద్దు!

▸ ఎవరేంటో నాకు తెలుసు

▸ పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక

తనకు ఊరికే కబుర్లు చెప్పే ప్రయత్నం చేయొద్దని ఎమ్మెల్యేలను చంద్రబాబు హెచ్చరించారు. 'మీలో నియోజకవర్గాల్లో ఎవరు బలంగా ఉన్నారో.. ఎవరు బలహీనంగా ఉన్నారో నా వద్ద లెక్కలు ఉన్నాయి. అన్నిచోట్లా ఒకే రకమైన పథకాలు అమలు చేస్తున్నా కొన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉంటే కొన్నిచోట్ల బలహీనంగా ఉన్నాం. అక్కడ నాయకత్వ లోపమే దీనికి కారణం. దానిని సరిచేసుకోండి. దిద్దుకోలేని వారిని మోయలేం. అవసరమైతే మార్పు తప్పనిసరి అవుతుంది. జాగ్రత్త' అని సీఎం హెచ్చరించారు. ఎమ్మెల్సీలు తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో కలబడే ప్రయత్నం చేయవద్దని గట్టిగా చెప్పారు. తాను చెప్పిన దానికి భిన్నంగా వెళ్తే మరోసారి ఎమ్మెల్సీలుగా అవకాశం రాదని స్పష్టం చేశారు.



కమిటీల ఏర్పాటు పూర్తిచేయండి: కళావెంకట్రావు

పార్టీలో వివిధ స్థాయుల్లో ఖాళీగా ఉన్న కమిటీల భర్తీపై జిల్లాల నాయకులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్ మంత్రి కిమిడి కళావెంకట్రావు సూచించారు. అన్ని కమిటీల నియామకాలను నెలాఖరులోగా పూర్తిచేయాలని వర్క్‌షాపులో కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కమిటీల ఏర్పాటును ప్రాధాన్యంగా తీసుకోవాలని, నిర్దేశించిన విధంగా సమావేశాలు నిర్వహించాలని స్పష్టంచేశారు. ఈ సమావేశాల బాధ్యత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు తీసుకోవాలని.. గ్రామ, వార్డు స్థాయుల్లో మూడు నెలలకోసారి.. మండలాలు, పట్టణాల్లో ఆరు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలన్నారు.

ఎవరైనా పాదయాత్రలు చేయొచ్చు: పయ్యావుల

ప్రజాస్వామ్యంలో పాదయాత్రలు చేసే హక్కు అందరికీ ఉంటుందని టీడీపీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ అన్నారు. వర్క్‌షాపు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తలపెట్టిన యాత్రపై స్పందించారు. ఎవరైనా పాదయాత్రలు చేయొచ్చని.. గత మూడున్నరేళ్లుగా అధికారంలో ఉన్న తామే ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు యాత్ర చేస్తున్నామని గుర్తుచేశారు.

దళితులంతా టీడీపీవైపు రావాలి: జూపూడి

రాష్ట్రంలో దళితుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, దళితులంతా టీడీపీవైపు రావాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ పిలుపిచ్చారు. దళితుల కోసం ప్రత్యేకంగా జనవరి 26 నుంచి ఏప్రిల్ 20 వరకు 82 రోజుల పాటు 'దళిత తేజం- తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోనే 2 లక్షల మందితో పెద్దఎత్తున మహాసభ నిర్వహిస్తామన్నారు.

విితంతువులు, దివ్యాంగులకు నూరు శాతం పింఛన్లు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వితంతువులు, దివ్యాంగులకు నూటి నూరు శాతం పింఛన్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆదివారం టీడీపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో పింఛను దరఖాస్తుల పరిష్కారంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గానికి రెండు వేలు చొప్పున ఇచ్చిన కొత్త పింఛన్లలో వితంతవులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని, మిగిలినవి వృద్ధులకు ఇవ్వాలని తెలిపారు. పింఛన్లు ఇవ్వడానికి పెట్టిన నిబంధనల వల్ల పట్టణ ప్రాంతాల్లో ఇబ్బంది వస్తోందని, నెలకు రూ.500 కరెంటు బిల్లు వచ్చే కుటుంబాలకు పింఛను ఇవ్వరాదన్న నిబంధన సడలించాలని విజయవాడ నగర ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. విజయవాడలో అవసరమైతే భూమిని కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, బహుళ అంతస్థులు కాకుండా మూడు అంతస్థులకు పరిమితం చేయాలని మున్సిపల్ మంత్రి నారాయణకు సీఎం సూచించారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో కొన్ని పాములను ఏసీబీ పట్టుకున్నా కొత్తగా వచ్చినవారు అంతకు మించిన పాములుగా తయారయ్యారని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. చిరునామా అవసరాల కోసం కొందరు పింక్ రేషన్‌కార్డులు అడుగుతున్నారని, వారికి అవి ఇస్తే ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సంతృప్తి శాతం పెంచడానికే కోడి పందేలు ఆడిస్తున్నావా అని ఆయనపై ముఖ్యమంత్రి చలోక్తి విసిరారు. దీంతో సమావేశంలో నవ్వులు విరిశాయి. 26 నుంచి నిర్వహిస్తున్న 'దళిత తేజం' కార్యక్రమం గురించి మంత్రి ఆనంద్‌బాబు వివరించారు. జన్మభూమి మాదిరిగా దీనినీ విజయవంతం చేయాలని సీఎం కోరారు. జగ్జీవన్‌రామ్‌కూ స్మారక కేంద్రం నిర్మిస్తామన్నారు. జన్మభూమి కార్యక్రమానికి సంబంధించిన గ్రేడులను నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి చదివి వినిపించారు. విశాఖ జిల్లాలో చోడవరం, గుంటూరు జిల్లాలో మాచర్ల సి గ్రేడ్లతో చివరిస్థానంలో నిలిచాయి. బి గ్రేడ్‌లో మాడుగుల, తాడేపల్లిగూడెం, కైకలూరు, పెడన, గురజాల, పాణ్యం, శ్రీశైలం, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తి, ఆత్మకూరు, నగరి, మదనపల్లి, పుంగనూరు, తంబళ్లపల్లి ఉన్నాయి. మిగిలిన వాటికి ఎ, ఎ ప్లస్ వచ్చాయి.

జగ్జీవన్ రామ్‌కూ స్మారక కేంద్రం: సీఎం

ప్రజల సంతృప్తి కోసమే కోడి పందేలా!

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై సీఎం చలోక్తి



శ్రీకాళహస్తిలో కూలిపోయిన జగన్ సభ వేదిక

స్వార్థం కోసం హోదా తాకట్టు

▸ ఓట్ల కోసం బాబు కొత్త ఎత్తుగడలు

▸ ప్రత్యేక హోదాపై కోర్టుకెళ్తారట.. పాదయాత్రలో జగన్ ధ్వజం

శ్రీకాళహస్తి, జనవరి 21: ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వార్థం కోసం ప్రత్యేక హోదాను కేంద్రప్రభుత్వానికి తాకట్టు పెట్టారని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆరోపించారు. పాదయాత్రలో భాగంగా ఆదివారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు ఓట్ల కోసం కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రత్యేక హోదా కోసం కోర్టుకెళ్తానని చెప్పడం విడ్డూరం. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండి టీడీపీవారు మంత్రి పదవులు చేపట్టారు. అలాంటపుడు చంద్రబాబు ఎవరిపై కోర్టుకు వెళ్తారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఆడియో, వీడియో ఆధారాలతో బహిరంగంగా పట్టుబడ్డారని.. ఇలాంటి వ్యక్తిపైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 'సాధారణ ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఆ హామీ ఇంతవరకు నెరవేర్చలేదు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టు పనులు 70శాతం, గాలేరు-నగరి పనులు 80 శాతం పూర్తి చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ పనులు పూర్తి చేయలేదు. శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద రూ.6వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన మన్నవరం ప్రాజెక్టు గురించి పట్టించుకోకపోవడం బాధాకరం. చంద్రబాబు తన హెరిటేజ్ సంస్థ కోసం చిత్తూరు జిల్లాలో విజయ, చిత్తూరు చక్కెర ఫ్యాక్టరీలను ఓ పథకం ప్రకారం మూత వేయించారు' అని ఆరోపించారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చిందేపల్లిలో తన 67వ రోజు పాదయాత్రను ప్రారంభించిన జగన్.. 12.7 కిలోమీటర్లు నడిచారు. చెర్లోపల్లె దళితవాడ వద్ద ఆయన యాత్ర 900 కిలోమీటరుకు చేరింది. దీంతో ఆయన అక్కడ పార్టీ జెండా ఆవిష్కరించారు. గుర్తుగా రావిమొక్క నాటారు.

కూలిన ప్రధాన వేదిక.. 24 మందికి గాయాలు

శ్రీకాళహస్తిలో జగన్ పాదయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆయన బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక కుప్పకూలింది. ఈ ఘటనలో 24 మంది గాయపడ్డారు. జగన్ వేదికపైకి ఎక్కకముందే ఈ సంఘటన చోటు చేసుకుంది. తర్వాత ఆయన ప్రచారరథంపైకి వెళ్లి ప్రసంగించారు. గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు హుటాహుటిన శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

మాజీ డీజీపీ రాగాల కన్నుమూత



రామంతాపూర్/హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మాజీ డీజీపీ ఆర్.కె.రాగాల కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హబ్సిగూడలోని స్వగృహంలో కన్నుమూశారు. 1937 జూలై 15న జన్మించిన ఆయన ఆంధ్రా యూనివర్సిటీ నుంచి కామర్స్‌లో పీజీ చేశారు. 33ఏళ్లపాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీగా, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, అగ్నిమాపక శాఖ డీజీగా, ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు అదనపు డీజీగా, సీబీ సీఐడీలో డీఐజీగా, సీఆర్‌పీఎఫ్ డీఐజీగా, వివిధ జిల్లాల ఎస్పీగా విధులు నిర్వహించారు.

మిత్రధర్మం పాటిస్తాం

స్నేహానికి కట్టుబడతాం.. కుదరని పరిస్థితి వస్తే అదే చెప్పి దండం పెడతాం.. బీజేపీతో బంధంపై బాబు

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఒకసారి స్నేహం చేస్తే టీడీపీ దానికి కట్టుబడి ఉంటుంది. మిత్రధర్మాన్ని పాటిస్తుంది. రోజూ గొడవ పెట్టి రచ్చ చేసే పార్టీ కాదు మనది. ఏవైనా సమస్యలుంటే అంతర్గతంగా చెబుతాం తప్ప బయట రోడ్డెక్కడం ఉండదు. మరీ కుదరని పరిస్థితి వస్తే ఆ మాటే చెప్పి దండం పెడతాం తప్ప న్యూసెన్స్ చేయం. ఇంతకు ముందైనా.. ఇప్పుడైనా.. రేపైనా మన వైఖరి ఇదే' అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చిచెప్పారు. ఆదివారమిక్కడ సీఎం నివాసం పక్కన ఉన్న గ్రీవెన్స్ హాల్లో టీడీపీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జరిగింది. రాష్ట్రంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. దీనికి సమాధానంగా చంద్రబాబు మాట్లాడారు. 'రాష్ట్రానికి రావలసిన వాటి విషయంలో రాజీపడను. కొన్ని పార్టీలు లోపల రాజీపడి బయట మాట్లాడతాయి. మనం బయట మాట్లాడకుండా లోపల మాట్లాడుతున్నాం. మనకు రావలసిన వాటి కోసం పది సార్లయినా.. ఇరవై సార్లయినా ఢిల్లీ చుట్టూ తిరుగుతాను. అది తప్పేం కాదు. న్యాయం జరిగేవరకూ ప్రయత్నం విరమించేది లేదు. ప్రజలు నష్టపోకుండా వ్యూహాత్మకంగా వెళ్లాలి. మనం ఆవేశంతో తప్పటడుగు వేస్తే రాష్ట్రం, ప్రజలు నష్టపోతారు. నేను ఖాతాను మూయలేదు. తెరిచే ఉంచాను. రావలసినవి రాబట్టుకోవడానికి ఒత్తిడి తెస్తూనే ఉంటాను. మోదీ మాట నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాను' అని ఆయన తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో తన వంటి సీనియర్లతో కూడా సంప్రదింపులు జరపకుండా కాంగ్రెస్ పార్టీ తీవ్ర ద్రోహం చేసిందని, కొత్త రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లు కావాలని తాను చెబితే 20 లక్షల కోట్లయినా ఇస్తామంటూ దిగ్విజయ్‌సింగ్ హేళనగా మాట్లాడారని ధ్వజమెత్తారు. దానికి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిఫలం అనుభవించిందని, మూడున్నరేళ్ల తర్వాత జరిగిన నంద్యాల ఉప ఎన్నికలో కూడా ఆ పార్టీకి కేవలం 800 ఓట్లు వచ్చాయని గుర్తుచేశారు. కసితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పిన తాను.. అందుకోసం ప్రతి నిమిషం పనిచేస్తున్నానని, అన్నీ బాగున్న రాష్ట్రాలు సాధించలేకపోయినా ఈ రాష్ట్రంలో నూరు శాతం విద్యుత్ సరఫరా, నూరు శాతం గ్యాస్ కనెక్షన్లు, నూరు శాతం మరుగుదొడ్లు ఇచ్చామని తెలిపారు. హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేసి చూపించామో అమరావతిని కూడా అలాగే చేసి చూపిస్తామని పేర్కొన్నారు.



టీడీపీ సమావేశానికి హాజరైన నేతలు

విభజనకు బీజేపీ కూడా కారణం

▸ అవంతి శ్రీనివాస్ ఆగ్రహం

వర్క్‌షాపులో అంతకుముందు ఎంపీ అవంతి శ్రీనివాస్ మాట్లాడారు. 'రాష్ట్రం విడిపోవడానికి కాంగ్రెస్ ఎంత కారణమో బీజేపీ కూడా అంతే కారణం. కాంగ్రెస్ విభజనలో అన్యాయం చేసింది. ఆదుకుంటానన్న బీజేపీ కూడా ఇప్పుడు అన్యాయంగా వ్యవహరిస్తోంది. రేపు వచ్చేది ఆఖరి బడ్జెట్. ఇందులోనైనా రాష్ట్రానికి కొన్ని ఇవ్వకపోతే వారిచ్చేది ఇక ఏమీలేదు. రాజధాని నిర్మాణానికి రూ.వేల కోట్లు అవసరముంటే ఏదో కొద్దిగా ఇస్తున్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికి నలభై సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగారు. ఆయన కేవలం ఒక పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఐదు కోట్ల మంది ప్రజల ప్రతినిధి. ఆయన్ను ఇన్ని సార్లు తిప్పుకోవాలా? ఒడిసాలో ఎన్నికలు ఉన్నాయని విశాఖ రైల్వే జోన్ ఇవ్వం అంటారు. ఈ రాష్ట్రం దేశంలో భాగం కాదా? ఆంధ్రప్రదేశ్ ప్రజలు సహనశీలురు. రోడ్లపైకి వచ్చి గొడవ చేయరు. కానీ సమయం వచ్చినప్పుడు తమ కోపం చూపిస్తారు. ఒకప్పుడు కాంగ్రెస్‌పై ప్రజల్లో ఎంత కసి ఉందో ఇప్పుడు బీజేపీపైనా అంతే కసి ఉంది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలకు సమావేశంలో ఉన్న ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు చప్పట్లు కొట్టారు. ఆ సమయంలో చంద్రబాబు జోక్యం చేసుకుని తాను మాట్లాడారు.

ఉద్యోగుల్లో మనపై

ఒకప్పుడు వ్యతిరేకత

▸ 2004లో మనకు వ్యతిరేకంగా ఓట్లేశారు

▸ ఇప్పుడు ప్రజలకు వారిని చేరువ చేశాం

▸ మంచిపేరు తెచ్చుకునేలా చేశాం: సీఎం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అంటే ఉద్యోగుల్లో కొంత వ్యతిరేకత ఉండేది. జీత, భత్యాలన్నీ బాగానే ఇచ్చినా.. తమపై ఒత్తిడి ఉందనేవారు. దీంతో 2004 ఎన్నికల్లో ఒక్కొక్కరు 50 ఓట్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసేశారు. ఆ విషయం వాళ్లే చెప్పారు కూడా. గతంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు ఎవరైనా అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తే ప్రజలు మెచ్చేవారు. కానీ ఇప్పుడు పరిస్థితిలో మార్పు తెచ్చాం. విధానం మార్చాం. అధికారులు ప్రజలకు దగ్గరగా ఉంటే వారికొచ్చే మంచిపేరు ఏంటన్నది తెలిసేలా చేశాం.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఆదివారమిక్కడ టీడీపీ వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. 'జన్మభూమి అవార్డుల ఫంక్షన్‌కు రాజమండ్రి నుంచి ఒక నోడల్ అధికారి వచ్చారు. అదేరోజు ఆ అధికారి కుమార్తెకు నిశ్చితార్థం. ఏం చేయాలని ఆయన వాళ్లమ్మాయితో మాట్లాడారు. నాన్నా! నీ శ్రమకు గుర్తింపుగా వచ్చిన అవార్డు అది. ఆ కార్యక్రమానికే వెళ్లు అని కుమార్తె చెప్పింది. ఈ విషయాన్ని ఆ అధికారే స్వయంగా చెప్పారు. అధికారులు, నాయకులు ఇలా బాధ్యతతో ఉంటే ప్రజల్లో ఆదరాభిమానాలు పెరుగుతాయి' అని పేర్కొన్నారు. 'ఇటీవల కుప్పం వెళ్లాను. అన్నీ సిమెంటు రోడ్లు వేసేశారు. ఎక్కడా మట్టి కూడా కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితిపై ఆలోచించాలి. గ్రామాల్లో కొంత దూరం నడిచేందుకు గ్రావెల్ రోడ్డు కూడా ఉండాలి' అని సూచించారు.

'రాష్ట్ర విభజన అనంతరం ఎన్నికలు జరిగాక.. ప్రధాని మోదీ మే 26న ప్రమాణం చేశారు. జూన్ 2న రాష్ట్ర విభజన నోటిఫికేషన్ వచ్చింది. నేను ప్రమాణం చేయలేదు. ప్రధానిని ఒకటే అడిగాను. పోలవరం ముంపు మండలాలు ఏడింటినీ ఏపీలో కలపాలని. కేంద్ర ప్రభుత్వం ఏర్పడగానే తొలుత పార్లమెంటును సమావేశపరుస్తారు. కానీ దానికి భిన్నంగా మంత్రివర్గ సమావేశం పెట్టారు. అందులో పోలవరం ముంపు మండలాల్ని ఏపీలో విలీనం చేయాలన్న ఆర్డినెన్సును ఆమోదించారు. అది ఏపీకి తొలి విజయం. ఆ తర్వాత జూన్ 8న నేను ప్రమాణస్వీకారం చేశాను' అని సీఎం గుర్తుచేశారు.

దావోస్ బయల్దేరిన చంద్రబాబు బృందం

చంద్రబాబు ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు తన బృందంతో బయల్దేరారు. 27వ తేదీవరకు దావోస్‌లో ఈ బృందం పర్యటిస్తుంది. ముఖ్యమంత్రి మాత్రం గణతంత్ర వేడుకల కోసం 26నే అమరావతి చేరుకుంటారు.

'సంధానం'తో సరి!

(మొదటి పేజీ తరువాయి)

నిధుల విషయంలో కేంద్రం అంత సుముఖంగా ఉన్నట్లు లేదని అవగతమవుతోందని రాష్ట్ర జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం.. నదుల అనుసంధాన ప్రక్రియను కేంద్రం చేపడుతున్నప్పటికీ.. నదీ జలాల అంశం రాష్ట్రాల పరిధిలోదే అయినందున.. రాష్ట్రాల సమ్మతితోనే ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని గడ్కరీ సదరు సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిసింది. 'రాష్ట్రాలు ఇప్పటికే పలు ప్రాజెక్టులను భారీ వ్యయంతో నిర్మిస్తున్నాయి. అనుసంధానానికి ఉపకరించే ఆ ప్రాజెక్టుల కయ్యే వ్యయాన్ని.. జలాలు అవసరమయ్యే రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది' అని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తెలంగాణ రూ.80,000 కోట్లకు పైగా వ్యయం చేస్తోందని, నదుల అనుసంధానం ద్వారా నీరు కావాలనుకుంటున్న ఇతర రాష్ట్రాలు ఈ మొత్తంలో వాటా భరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నదుల అనుసంధానానికి కేంద్రం సంధానకర్తగా వ్యవహరిస్తుందే తప్ప నిధులు భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సిద్ధంగా లేదని స్పష్టీకరించారు. ఇప్పటిదాకా అనుసంధాన ప్రక్రియకు కేంద్రం 60 శాతం మేర నిధులిస్తుందని ఆశించిన నవ్యాంధ్ర, ఇతర రాష్ట్రాలకు గడ్కరీ పెట్టిన కొత్త మెలిక మింగుడు పడడంలేదు. అనుసంధానం తొలి దశలో గోదావరి జలాలను అకినేపల్లి నుంచి నాగార్జున సాగర్‌కు తీసుకెళ్లి.. అక్కడి నుంచి సోమశిల ద్వారా పెన్నా నదికి పంపి.. ఆ తర్వాత కావేరికి తరలించాలన్న ప్రతిపాదనను తీసుకొచ్చింది ఆయనే. దీనికి తెలంగాణ నీటి పారుదల మంత్రి హరీశ్‌రావు అంగీకరించలేదు. ముందుగా తెలంగాణ అవసరాల కోసం 1500 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించాలని.. దీనికి అంగీకరిస్తేనే గోదావరి-కావేరి అనుసంధానానికి ఆమోదిస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ సమావేశానికి హాజరైన అధికారులు మాత్రం కేంద్రం విధానం ఏమిటో తెలుసుకునేదాకా.. తమ అభిప్రాయాన్ని వెల్లడించరాదన్న అభిప్రాయంతో మౌనం దాల్చారు. కావేరిలోకి 150 టీఎంసీలకు బదులు 50 టీఎంసీలనే ఎందుకు ప్రతిపాదించారని తెలంగాణ, కర్ణాటక అధికారులు గడ్కరీని ఈ సందర్భంగా అడిగారు. ఆయన స్పందిస్తూ.. తొలి దశలో 50 టీఎంసీలను.. మలిదశలో మహానది-కావేరి అనుసంధాన పథకాన్ని అమలు చేస్తే.. మిగిలిన 100 టీఎంసీలను అందిస్తామని వివరించారు. అయితే.. భారీ స్థాయిలో కేంద్రం నిధులిస్తుందని అనుకోవద్దన్నారు. గోదావరి జలాల్లో తమ వాటాను స్పష్టం చేయాలని హరీశ్‌రావు కోరడంతో ఒడిసా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, జల వనరుల మంత్రులు, ఆ శాఖ కార్యదర్శులతో సమావేశాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని గడ్కరీ చెప్పారు. ఆ భేటీలో ముఖ్యమంత్రులు వెల్లడించే అభిప్రాయం మేరకు మహానది-గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియపై నిర్ణయం తీసుకుందామని తెలిపారు. జాతీయ నదుల అనుసంధాన ప్రక్రియలో గతంలో ఉన్న 90:10గా ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటాను 60:40గా కుదించిన కేంద్రం.. ఇప్పుడు దాని నుంచి కూడా తప్పించుకునే పనిలో పడిందని గడ్కరీ మాటల ద్వారా అర్థమవుతోందని జల వనరుల శాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి.

విజేత



ప్రతికూల భావనలు పరార్!

థింక్ పాజిటివ్ అంటారు. కానీ, మనలో ఎక్కువమంది నెగిటివ్‌గానే ఆలోచిస్తుంటారు. ఈ నెగిటివిటీ మన ఆలోచనా విధానంలో వేర్వేరు రూపాల్లో ఉంటుంది. దాన్ని పెకలించి వేయగలిగితే జీవితంలో పాజిటివిటీకి స్థానం కల్పించినవాళ్లమవుతాం!

- **పర్‌ఫెక్షనిజం:** దీన్ని అందుకోవటం దాదాపు అసాధ్యం. దీన్ని సాధించటానికి చేసే ప్రతి ప్రయత్నం చివరికి అసంతృప్తినే మిగిలిస్తుంది. కాబట్టి పర్‌ఫెక్షనిజంను పక్కనపెట్టి.... ప్రయత్నం మీద దృష్టి పెట్టి ఫలితాన్ని ఆస్వాదించాలి.
- **ఇతరులతోపాటు మిమ్మల్ని మీరు జడ్జ్ చేసుకోవాలి:** జడ్జిమెంట్ మీద దృష్టి పెడితే, మీలోనే కాదు ఇతరుల్లో కూడా మీకు నెగిటివ్ లక్షణాలే కనిపిస్తాయి. కాబట్టి జడ్జ్ చేయటం మానేసి ఉన్నది ఉన్నట్టు స్వీకరించటానికి సిద్ధపడండి.
- **అపనమ్మకం:** అపనమ్మకం చీడ లాంటిది. దాన్ని వేరుతో సహా పెకిలించకపోతే మీ జీవితాన్నే మింగేస్తుంది. ఆత్మవిశ్వాసం పెంచుకుని జీవితంలో ముందుకెళ్లటం ఉత్తమం.
- **కీడు జరుగుతుందనే నిర్ధారణకు రావటం:** పరిస్థితులు మెరుగ్గా ఉంటాయనే ఆలోచన మీకు రాకపోతే అవి ఎప్పటికీ మెరుగ్గా ఉండవు. ఇలాంటి అనుమానం మీ ఆశల్ని కుదేలు చేసి జీవితాన్ని నిరర్థకంగా మారుస్తుంది. కాబట్టి మేలెంచి కీడెంచాలి.

బ్యూటీ కేర్

నల్లటి వలయాలు పోవాలంటే...

- అర చెంచా శెనగపిండి, చిటికెడు పసుపు, నిమ్మ, టొమాటో రసాలు చెరొక అర స్పూను కలిపి మెత్తగా పేస్టులా చేయాలి. ఆ పేస్టును కళ్ల చుట్టూ రాసుకుని 20 నిమిషాలు అలాగే ఉంచుకుని ఆ తర్వాత తడిచేసిన దూదితో దాన్ని తుడిచేసుకోవాలి. ఇలా కొన్ని రోజులపాటు చేస్తే మంచి ఫలితం కనపడుతుంది.
- అర కప్పు కీరకాయ తరుగు నుంచి జ్యూసును తీసి, కాటన్ ప్యాడ్స్‌ను అందులో తడిపి కనురెప్పల మీద వేసుకుని 20 నిమిషాలు అలాగే ఉంచాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే కళ్ల కింద మచ్చలు పోతాయి.
- బంగాళాదుంప తరుగు నుంచి జ్యూసు తీసి కాటన్ ప్యాడ్స్‌ను అందులో ముంచి కనురెప్పల మీద ఇరవై నిముషాలపాటు పెట్టుకోవాలి. ఇలా కొన్నిరోజులు చేస్తే కళ్ల కింద నల్లటి వలయాలు పోతాయి. కళ్లు విశాలంగా అవుతాయి కూడా.



ట్రెండింగ్

కొత్త టాటూలు గురూ...

మినిమలిస్టు టాటూస్ నేటి అమ్మాయిల కొత్త ఫ్యాషన్ ట్రెండు. ఈ టాటూల ట్రెండు ఈ ఏడాది ప్రారంభం నుంచే ఊపందుకుంది. వీటిల్లో ఆకట్టుకునే పలురకాల డిజైన్లు కూడా ఎన్నో ఉన్నాయి.


జియోమెట్రిక్ డిజైన్లు, జంతువుల అవుట్‌లైన్స్, పలురకాల సింబల్స్, ఫ్రేజెస్ ఈ టాటూస్‌లో కనిపిస్తాయి. వీటిల్లో ఎక్కువ వర్కు ఉండదు. అలాగే ఎక్కువ రంగుల మేళవింపు కూడా ఉండదు. సింపుల్‌గా ఉండి చూడడానికి ఎంతో హుందాగా కనిపిస్తాయి. అందుకే ఇవి అమ్మాయిలను ఎక్కువగా మురిపిస్తున్నాయి. ఈ తరహా టాటూల్లో చక్కని అవుట్‌లైన్‌తో పాటు విభిన్నమైన షేడ్స్ సైతం ఉండి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చూడడానికి చాలా సెన్సిటివ్‌గా ఉంటాయి.. ముఖ్యంగా తాము పనిచేస్తున్న కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్‌కు తగ్గట్టుగా ఈ టాటూలను అమ్మాయిలు వేయించుకుంటున్నారు.

అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడే వాటిల్లో సముద్రం మీద పయనిస్తున్న నావ, కీస్, కెమెరా అవుట్‌లైన్స్ ఉంటున్నాయి. ఈ తరహా టాటూల్లో డాట్స్, లైన్స్ ఎక్కువ ఉంటాయి. ఇవి సింబాలిక్‌గా ఉండవు కానీ ఎలాంటి దుస్తుల మీదైనా బాగుంటాయి. మొత్తానికి మినిమలిస్ట్ టాటూలతో కొత్త ఫ్యాషన్ ట్రెండ్‌ను ప్రారంభించిన అమ్మాయిలు 'సింపుల్ అండ్ బెస్ట్' తమ స్టైల్ స్టేట్‌మెట్' అని తెలియజెప్పారు. మినిమలిస్ట్ టాటూల్లో ఫీదర్, స్టార్, హార్ట్, క్రౌన్, పెట్ సిల్‌హౌటీస్ సింబల్స్‌ను కూడా అమ్మాయిలు వేయించుకుంటున్నారు. ఈ టాటూలను చాలామంది ముంజేతి మీద ఎక్కువగా వేయించుకుంటున్నారు. ఈ టాటూలు వేయించుకున్న వారు వాటికి తడి తగలకుండా జాగ్రత్తపడాలి. వాటిపై రోజూ నూనె లేదా వాజిలెన్‌లను రాస్తుండాలి. సూర్యకాంతి వాటిపై పడకుండా చూసుకోవాలి.



షైనీ కాకి... డాక్టర్ విత్ ఎ డిఫరెన్స్... తన ఈడు వైద్యుల్లాగా 'మనీరంజకంగా' సాగే కార్పొరేట్ వైద్యాన్ని ఆమె ఎంచుకోలేదు. సరిహద్దులు దాటి... అత్యంత సంఘర్షణాత్మక ప్రాంతాల్లో, అనుక్షణం మృత్యువు పొంచి ఉండే చోట, అంతర్యుద్ధాలతో అట్టుడుగుతున్న ప్రదేశాల్లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఏ క్షణం ఎటు నుంచి ఉగ్రదాడి జరుగుతుందో తెలియని భయానక పరిస్థితుల నడుమ, సైన్యం ఆంక్షలు హూంకరింపుల మధ్య ప్రజలకు, శరణార్థులకు వైద్య సేవలందిస్తున్నారు. 'ప్రతిరోజూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేస్తాం. కానీ అంత ఒత్తిడికి గురైనా... రాత్రి పడుకోబోయేముందు ఆ రోజు కనీసం ఒక రోగి ప్రాణాన్ని కాపాడానన్న తృప్తి ఉంటుంద'ంటారామె. షైనీ సాహసోపేత వైద్య సేవల గురించి ఆమె మాటల్లోనే....

గుడ్ సర్వీస్





మృత్యు నీడలో వైద్య సేవ

'ఒక రోజు మా కజిన్ యాక్సిడెంట్‌లో మరణించినట్టు తెలిసి షాక్‌కి గురయ్యాను. ఆ నిజాన్ని జీర్ణించుకోవడానికి నాకు చాలా సమయమే పట్టింది. అయితే... ఆ సంఘటనే నా జీవితాన్ని అనూహ్యమలుపు తిప్పుతుందని మాత్రం నేను అస్సలు ఊహించలేదు.

అది ఓ పెద్ద మలుపు...

కజిన్ మరణంతో ఒత్తిడి, డిప్రెషన్లకు గురయ్యాను. ఇంట్లో ఎవ్వరితో మాట్లాడకుండా గంటల తరబడి గదిలో ఒంటరిగా గడిపేదాన్ని. ఆ సమయంలోనే 'డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ గురించి ఇంటర్నెట్‌లో చూశాను. అదే నా జీవిత గమ్యం అనుకున్నాను. అమ్మా, నాన్న, చుట్టాలు అందరూ నా నిర్ణయం విని కోప్పడ్డారు. ఆ బాట ఎంచుకోవద్దని వారించారు. కానీ నేను ఎవ్వరి మాటా వినలేదు. నా పట్టు వీడలేదు. ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరై ఎంపికయ్యాను. చిన్నతనం నుంచీ నాలో సాహసప్రవృత్తి ఎక్కువ. ఎవరూ చేయలేని పని చేసి ప్రపంచంపై నాదైన ముద్ర వేయాలనుకునేదాన్ని. ఒక ప్రాజెక్టులో పనిచేసి తిరిగి స్వదేశానికి వచ్చి పీజీ పూర్తి చేద్దామనుకున్నాను. కానీ... అలా దేశ సరిహద్దులు వీడి వెళ్లిన నేను మూడేళ్ల పాటు అందులోనే ఉన్నాను. జాతీయ వాలీబాల్ ప్లేయర్‌నయిన నేను ప్రపంచ ప్రసిద్ధ వాలీబాల్ క్రీడాకారిణిని అవుతాననుకున్నారు మా ఇంట్లోవాళ్లు. కానీ వాళ్ల కలల్ని కల్లలు చేశాను.

ఎల్లలెరుగని వైద్యం...

'డాక్టర్స్ వితౌట్ బోర్డర్' ఆర్గనైజేషన్‌లో 2013లో చేరాను. ఇందులో పనిచేసే వైద్యులం యుద్ధ ప్రాంతాల్లో.... సాయుధ ఘర్షణలు నెలకొన్న దేశాల్లో... అంతర్యుద్ధాలు సాగుతున్న చోట, అంటువ్యాధులు ప్రబలిన చోట, ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన చోట వైద్యసేవలు అందిస్తాం. మా విధుల నిర్వహణ కత్తి మీద సాములాంటిది. ఏ క్షణంలోనైనా ప్రాణాలు పోవచ్చు. మేం ఫలానా దేశంలో విధులు నిర్వహించడానికి వెళ్లబోయే ముందు ఆ దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలను ముందుగానే ఆకళింపు చేసుకుంటాం. స్థానికులతో కమ్యూనికేషన్ చేయగలిగే మేర వారి భాష కూడా నేర్చుకుంటాం.

కిక్ ఇస్తుంది...

'డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్' సంస్థ సేవల గురించి తొలిసారిగా తెలిసినపుడు ఇంత కాలంగా నేను ఎదురు చూస్తోంది ఇలాంటి పనికోసమే అనిపించింది. సరిహద్దుల కతీతంగా .... అనుక్షణం సవాళ్ల మధ్య ఈ ఆర్గనైజేషన్‌లోని వైద్యులు పనిచేయడం నన్నెంతో ఆకట్టుకుంది. వారు చేసే పనిలో 'కిక్' ఉందనిపించింది. అలా 'డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్' సంస్థలో అడుగుపెట్టిన నేను ఇప్పటివరకూ నైజీరియా, సూడాన్, సోమాలియా, ఇథియోపియా, యెమెన్ దేశాల్లో వైద్య సేవలు అందించాను. ముఖ్యంగా ఆఫ్రికాదేశాలకు వెళ్లాను. నైజీరియాలో బోకో హరామ్ తీవ్రవాదం భయానక పరిస్థితులను సైతం ఎదుర్కొన్నాను. నా తర్వాతి ప్రాజెక్టు సిరియా.



మొట్టమొదట నేను సోమాలియా-ఇథియోపియాల మధ్యనున్న సరిహద్దు సమీపంలో విధులు నిర్వహించాను. అక్కడ తీవ్ర అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అనుక్షణం ప్రత్యర్థి వర్గాల మధ్య ఘర్షణలు జరుగుతుండేవి. తుపాకీ మోతలతో ఆ ప్రాంతం ఎప్పుడూ దద్దరిల్లిపోతుండేది. ఆసుపత్రుల్లోకి ఆయుధాలతో ఎవరు వచ్చినా అనుమతించేవాళ్లం కాము. కానీ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే తీవ్రవాదుల నుంచి చిన్నపిల్లల దాకా ప్రతి ఒక్కరి చేతిలో అక్కడ తుపాకులు ఉంటాయి. ఎనిమిదేళ్ల వయసు బాలురు తుపాకీలు పట్టుకుని గ్రామంలో తిరుగుతుంటారు. అక్కడ ఇది అత్యంత సాధారణ దృశ్యం!

ప్రతి క్షణం మృత్యు భయం...

మేము ప్రతిక్షణం ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని పనిచేయాలి. ఎలాంటి రాజకీయ సంబంధాలు వైద్యులకు ఉండకూడదు. కానీ... ఎవరి మీదైనా అనుమానం వస్తే తీవ్రవాదులు వారిని వదలరు. వారిపై తుపాకీ గుళ్ల వర్షం కురిపిస్తారు. అంతెందుకు నేను అత్యవసర సేవలు, టిబి,హెచ్ఐవి, పిల్లల వార్డుల్లో పనిచేసేటప్పుడు ఇథియోపియా సైన్యం, సొమాలియా పోలీసుల మధ్య పరస్పర కాల్పుల్లో స్థానిక పౌరులు చిక్కుకోవడం ప్రత్యక్షంగా చూశాను. తర్వాత దక్షిణ సుడాన్‌లోని శరణార్థుల క్యాంపులో పనిచేశాను. అక్కడ ప్రసూతి సదుపాయాలు లాంటి మౌలిక సౌకర్యాలు కూడా లేవు. ఇక యెమెన్ గురించి చెప్పాలంటే కొన్నేళ్లుగా అక్కడ అంతర్యుద్ధం కొనసాగుతోంది. దాంతో ఆ దేశంలో పారిశుధ్య పరిస్థితులు క్షీణించాయి. పరిశుభ్రమైన ఆహారం కరువైంది. సురక్షిత నీరు, వైద్య సదుపాయాలు ఘోరంగా ఉండేవి. ఫలితంగా అక్కడ కలరా ప్రబలింది. అప్పుడే అక్కడకు నేను వైద్యసేవలు అందించడానికి వెళ్లాను. చికిత్సతో పాటు మా దగ్గరకు వచ్చే పేషంట్లకు పరిశుభ్ర పరిస్థితుల ఆవశ్యకత గురించి చెప్పేదాన్ని. కలరా సెంటర్లలో మేం అందించిన వైద్యసేవల వల్ల బయట కన్నా మా క్యాంపు సెంటర్లలో మరణాల సంఖ్య తక్కువగా ఉండేది. నైజీరియాలోని 'మైదుగురి'కి వైద్యసేవలు అందించడానికి మా వైద్యుల బృందంతో వెళ్లాను. అక్కడి చిన్నారుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతుంది. పోషకాహారలోపంతో వందలకొద్దీ చిన్నారులు అక్కడ చనిపోతున్నారు.

తలచుకుంటేనే..

విధుల నిర్వహణలో నేనెంతో స్ట్రిక్ట్. అందువల్ల కొన్ని సమస్యలు తలెత్తేవి. ప్రపంచంలో ఏ సంక్షోభ ప్రాంతానికి వెళ్లినా రాజకీయంగా తటస్థంగా ఉంటూ విధులు నిర్వహిస్తాం. మా దగ్గరకు తీవ్రవాదుల మొదలు సైన్యం, దోపిడీదారులు ఎవరు వచ్చినా వైద్యం చేస్తాం. మిలిటెంట్ల నుంచి ఏ ఒక్కరినీ ఆయుధాలతో ఆసుపత్రిలోకి అనుమతించం. తీవ్రవాదులు, సైనికులను చూస్తే భయమేస్తుంది. ఇక్కడ ఒక సంఘటన చెప్పాలి. ఒకరోజు అర్థరాత్రి అత్యవసర సేవలు అందించాల్సి వచ్చి ఆసుపత్రికి వెళ్లాను. హఠాత్తుగా బయట గొడవ మొదలైంది. ఆసుపత్రి బయట లారీ ఆగి ఉంది. అందులో ఆర్మీ ఉంది. బయటకు వచ్చి విషయం తెలుసుకుని సైన్యం దగ్గరకు వెళ్లి ఆయుధాలు బయట వదిలేసి రావాలని చెప్పాను కానీ ఆ మాటలు వాళ్లతో చెప్పాలనే ఊహకే గుండెలు గుభేలుమన్నాయి. అలా చెప్పినందుకు నన్ను ఎక్కడ కాల్చేస్తారోనని భయపడ్డాను. వైద్యసేవలు అందించే కల్లోల ప్రాంతాల్లో పరిస్థితులు అలా ఉంటాయి.

యుద్ధ పరిస్థితులు, సాయుధ ఘర్షణలు నెలకొన్న చోట మాకు భద్రత బాగుంటుంది. మా వెంట అనుక్షణం రేడియో ఉండాల్సిందే. ప్రతి అరగంటకొకసారి మేం ఎక్కడ ఉన్నదీ సైన్యానికి సమాచారం అందిస్తుండాలి. స్థానికంగా ఏవైనా గొడవలు జరుగుతుంటే కాల్పులు, దాడులు లాంటివి నిర్వహిస్తున్నామని, ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని సైన్యం ముందుగానే మాకు తెలియజేస్తుంది. ఇది నిత్యం జరిగే ప్రక్రియ. రాత్రుళ్లు ఎక్కడైనా బాంబుల మోత వినిపిస్తే ఇంకొద్ది సేపట్లో మాకు ఎమర్జన్సీ కాల్ వస్తుందని అర్థమైపోయి మేం రెడీగా ఉండేవాళ్లం. ఒకసారి నేనున్న ఆసుపత్రిపైనే బాంబు దాడి జరిగింది. రోగులను వెంటనే ఖాళీ చేయించాము. లక్కీగా నా కేమీ కాలేదు. అయితే మేం వెళ్లే దేశాలన్నింటిలోనూ పరిస్థితులు ఒకేలా ఉండేవి కావు. ప్రాంతానికి ప్రాంతానికీ పరిస్థితులు మారుతుంటాయి.

స్త్రీలంటే తక్కువ భావం...

నేను వెళ్లిన దేశాల్లోని సంస్కృతి విభిన్నం. లింగ వివక్ష బాగా ఉంది. మహిళలంటే చిన్నచూపు కూడా ఎక్కువే. వీటికి తోడు అక్కడి స్త్రీలకు సంప్రదాయాలు, కట్టుబాట్ల పరిమితులు అధికం. అయితే స్త్రీలకు సంబంధించి కొన్ని విషయాలు తెలిసినపుడు మాత్రం నేను తీవ్రంగా షాక్‌కి గురయ్యాను. కొన్ని దేశాల్లో మహిళల జననేంద్రియాలను కట్ చేస్తారట. దాంతో మూత్రం పోసే మార్గం చిన్నదైపోతుంది. దాంతో మహిళలకు మూత్రం పోసుకోవడం కష్టమవుతుంది. మూత్ర విసర్జనకు ఎంతో సమయం పడుతుంది. ఆ దేశాలకు వెళ్లిన కొత్తల్లో అక్కడి స్థానిక నర్సులు బాత్రూంకి వెళ్తామని చెప్పి ఒక పట్టాన వచ్చేవారు కాదు. పని ఒత్తిడితో ఉన్న నేను 'ఇంతసేపా'? అంటూ నర్సుని కోప్పడ్డాను. కానీ ఆతర్వాత అసలు విషయం తెలిసి ఒళ్లు గగుర్పొడిచింది. ఎందుకంటే వీళ్లల్లో బిడ్డ పుట్టడం ప్రక్రియ కూడా చాలా కష్టమవుతుంది. అంతేకాదు మూత్రం శరీరం లోపల ఉండిపోయి స్త్రీలు రకరకాల ఇన్ఫెక్షన్ల బారిన పడతారు. అక్కడ సామాజిక, సాంస్కృతికపరమైన మార్పులు వస్తేనే ఇలా ంటివి చేయకూడదనే చైతన్యం ప్రజల్లో తీసుకురాగలుగుతాము. ఇంకొక ఘటన కూడా ఇక్కడ చెప్పాలి. ఒక మహిళ చనిపోవడంతో ఆమెని మార్చురీకి పంపమని చెప్పాను. కానీ అక్కడి వాళ్లు చెప్పిన సమాధానంతో నేను గడ్డకట్టుకుపోయాను. ఇంతకూ వాళ్లు చెప్పిన దేమిటంటే ' మార్చురీలో చనిపోయిన ఒక పురుషుడి శరీరం ఉంది కాబట్టి చనిపోయిన మహిళను అందులో ఎలా పెడతాం?' అని వారన్నారు. మృతదేహమే అయినా కూడా ఆ దేశంలోని స్త్రీ 'స్టాటస్' అది! అక్కడ నేను విధులు నిర్వహించేటప్పుడు పేషంట్ల విషయంలో స్థానిక వైద్య సిబ్బంది (మగవాళ్లు)నా ఆదేశాలను పాటించడానికి ఇష్టపడేవారు కాదు. వారు చేసిన తప్పులను సరిచేసుకోవడానికి సైతం నిరాకరించేవారు. దీనికి నేను మహిళను కావడం ఒక కారణమైతే... వారికన్నా చిన్నదాన్ని కావడం మరో విషయం. స్త్రీల పట్ల అక్కడి పురుషుల భావజాలం అది.

ప్రజారోగ్యరంగానికి బాట..

ఈ పనిని ఎందుకు ఎంచుకున్నానా అని ఎప్పుడైనా అనుకున్నారా... అని చాలామంది నన్ను అడుగుతుంటారు. కొన్నిసార్లు ఇంటిపట్టున ఉంటే పొందే సుఖాలు గుర్తుకువచ్చేవి. మేం పనిచేస్తున్న సంస్థకు చెందిన వైద్యులు కొందరిని కిడ్నాప్ చేసిన ఘటనలున్నాయి. అవి నాలో తీవ్ర అభద్రతను రేకెత్తించిన క్షణాలున్నాయి. కానీ రాత్రి పడుకోబోయే ముందు ఈ రోజు ఒక ప్రాణాన్నైనా కాపాడగలిగానన్న ఫీలింగ్ నా భయాలు, బాధలను ఒక్కసారిగా తుడిచిపెట్టేసేది. ప్రస్తుతం ఒక ప్రాజెక్టులో భాగంగా సిరియా వెడుతున్నాను. దాని తర్వాత పీజీ పూర్తి చేస్తాను. పెళ్లి చేసుకుంటాను. ఆ తర్వాత తిరిగి డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్‌తో కలిసి వైద్యసేవలు కొనసాగిస్తాను. నా జీవిత లక్ష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితిలలో ఉన్నత స్థాయిలో పనిచేయాలి. పబ్లిక్ హెల్త్ పాలసీపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. నేను ప్రజారోగ్య రంగంలో అడుగుపెట్టడం ద్వారా కొంతమందినైనా ఆ బాట పట్టేలా ప్రభావితం చేయాలి. 'ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ మెడిసిన్' నా లక్ష్యం' అన్నారు షైనీ.

• నవ్య డెస్క్

ఉమ్మడి కుటుంబం మాది...



నేను పుట్టింది నర్సాపూర్. నా చదువంతా విజయవాడలోనే సాగింది. మాది ఉమ్మడి కుటుంబం. ఇంట్లో బోలెడుమంది కజిన్స్ ఉండేవారు. వారందరిలోకి నేనే పెద్దదాన్ని కావడంతో ఇంట్లో అంతా నన్ను ఎంతో గారాబంగా చూసేవాళ్లు. నా కజిన్సే నా స్నేహితులు... సర్వస్వం. మా నాన్న సుదర్శన్ లయోలా కళాశాలలో ప్రొఫెసర్. అమ్మ జలజ టీచరుగా పనిచేసి రిటైరయ్యారు. నాకొక తమ్ముడున్నాడు. నేను పోటీ పరీక్షలో ఎంపికై వేలూరు సిఎంసి కాలేజీలో ఎంబిబిఎస్ చేశాను. మెడిసిన్‌పూర్తయిన తర్వాత రెండేళ్ల పాటు అలహాబాదులోని కుష్టు వ్యాధి ఆసుపత్రిలో రోగులకు సేవలందించాను. ఆ తర్వాత నాది 'ఎల్లలు లేని' ప్రయాణమైంది.

పేరెంటచ్

పిల్లలకు సొంతూరును పరిచయం చేయండి



దశాబ్దాల క్రితమే సొంతూరు వదిలేసిన దంపతులకు కలిగే పిల్లల్లో చాలామందికి నగరం త ప్ప సొంతూరు తెలియదు. వాళ్ల మిత్రులూ, ఆత్మీయులు అంతా ఇక్కడి వారే. అలా నగరమే వారి ప్రపంచమ వుతుంది. ఇంకొంచెం ముందుకు వెళితే, ఏ విదేశాల గురించిన ఆలోచనలో ముసురుకుంటాయే తప్ప వాళ్ల మనసుల్లో పల్లె మూలాలే ఉండవు. ఇదంతా నగరాల్లో పుట్టి పెరగడం వల్లే జరిగిందని కాదు. తలిదండ్రులు తమ పిల్లల్ని ఏనాడూ సొంతూరుకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేయకపోవడం ఇందుకు కారణం. చాలామంది తలిదండ్రులకు ఈ విషయంలో ఏమాత్రం శ్రద్ధ ఉండదు. 'సొంతూరుతో ఉన్న బంధం మాతోనే తెగిపోతుంది. ఆ ఊరితో ఇంక మా పిల్లలకేం పని?' అనుకుంటారు. కానీ, ఎక్కడో... ఎవరో మీ సొంతూరేది? అని అడిగినప్పుడు వారి పరిస్థితి అయోమయంగా ఉంటుంది. సమాధానంగా 'పేరైతే తెలుసు గానీ, ఇంతవరకు ఆ ఊరికే వెళ్లలేదు' అని చెప్పాల్సి వస్తుంది. అది వాళ్లకు ఏదో ఒక మూలన ఇబ్బందిగానే అనిపిస్తుంది. "మేము నగరంలోనే పుట్టాం, నగరంలోనే పెరిగాం" అని సగర్వంగా చెప్పుకునే పిల్లలు కూడా ఉంటే ఉండవచ్చు. కాకపోతే వారిలో ఊరి సోయగం గానీ, అక్కడ ఉండే ప్రకృతి సహజమైన మనోల్లాసం గానీ తెలియని వాళ్లే ఎక్కువ. భారతదేశం లాంటి ఏ దేశానికైనా ఆయువు పట్టు పల్లెటూర్లే కదా! అలాంటప్పుడు ఆ పల్లెల గురించిన ఎంతో కొంత పరిచయం ఆ పిల్లలకు ఉండాలి కదా! ఇతరత్రా అవసరం ఏమున్నా లేకపోయినా నగరపు ఒత్తిళ్ల మధ్య నిరంతరం నలిగిపోతున్న దశలో కాస్త రిలాక్స్ అవుదామనుకుంటే ఆ పిల్లలు ఎటుపోతారు? విహార యాత్రల పేరిట ఏ దూర ప్రాంతాలకో వెళ్లవచ్చు. కానీ, సొంతూరు ఆనందం ముందు అవన్నీ బలాదూరే.! అందుకే అప్పుడప్పుడు, ఏవైనా ఫంక్షన్లు జరిగి నప్పుడైనా, పల్లెలకు పిల్లలను వెంట తీసుకెళ్లడం చాలా అవసరం. ఆ ప్రదేశాలనే కాదు, అక్కడున్న ఆత్మీయులనూ, రక్తసంబంధీకులనూ వారికి పరిచయం చేయాలి. మనుషులతోనే కాదు ఆ నేలతో ఉన్న గాఢానుబంధాన్ని గురించి చెప్పాలి. పిల్లలకి ఇవి పరిచయం చేస్తే ఆ తరం నుంచి మరో తరానికి ఆ అనుబంధాలు కొనసాగుతాయి. అవి జీవితమంతా వారికి ఎడతెగని ఉత్సాహాన్ని,ఆనందాన్ని ఇస్తాయి.



స్టాక్ మార్కెట్లు దూకుడుగా పరుగెడుతున్నాయి. రోజుకో కొత్త రికార్డు సృష్టిస్తున్నాయి. మరిలాంటి సమయంలో మార్కెట్లో ఇన్వెస్ట్ చేయవచ్చా? ఒక వేళ చేస్తే ఎలా వ్యవహరించాలో 'బిజినెస్ ప్లస్' పాఠకులకు వివరిస్తున్నారు ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శరవణ కుమార్.



ఆటుపోట్లూ అవకాశాలే..

స్టాక్ మార్కెట్ సంక్షోభాలపై ఆందోళన వద్దు

మన దేశంలో చాలా మందికి ఇప్పటికీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులంటే అదో భయం. బంధుమిత్రులు ఆ మాట కొస్తే కుటుంబ సభ్యులు కూడా అదేదో పేకాటో లేదా ఇంకేదో జూదం అన్నంతగా భయపడి పోతుంటారు. అబ్బే మనకెందుకు ఆ రిస్క్... ఉన్న సొమ్ము ఏదైనా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే అసలుకు ఢోకా లేకుండా ఎంతోకొంత వడ్డీ సంపాదించి పెడుతుందని సలహాలిచ్చే వారే ఎక్కువ. ఇలా సలహాలిచ్చే వారిలో ఎక్కువ మంది స్పెక్యులేషన్‌కు లేదా అల్లాటప్పా కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేసి చేతులు కాల్చుకున్న వారే ఎక్కువ మంది ఉంటారు. సరైన సమయంలో మంచి ఫండమెంటల్స్ ఉన్న కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేసి దీర్ఘ కాలంలో మంచి లాభాలు సంపాదించిన ఇన్వెస్టర్లూ మార్కెట్‌లో కోకొల్లలు.

మారుతున్న ధోరణి

ఆలస్యంగా అయినా పరిస్థితుల్లో కొద్దిగా మార్పు కనిపిస్తోంది. ప్రస్తుతం మన రిటైల్ ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది నేరుగా షేర్లలో ఇన్వెస్ట్ చేయకుండా మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ పథకాల ద్వారా స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలోనూ రిటైల్ ఇన్వెస్టర్లలో ఈ ప్రధాన మార్పు కొనసాగింది. గతంలో ఇలాంటి ప్రధాన మార్పులు చోటు చేసుకున్నపుడు రిటైల్ ఇన్వెస్టర్లు భయపడి పోయి మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు అమ్ముకునేవారు. ఇపుడు మాత్రం దీర్ఘకాలిక లాభాలపై నమ్మకంతో సిప్ ద్వారా పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. ఇందుకోసం మార్కెట్లో చోటు చేసుకునే ఆటుపోట్లనీ పెద్దగా పట్టించుకోవడం లేదు.

మార్కెట్ నిజంగా ప్రమాదకరమా ?

ముందూ వెనకా ఆలోచించకుండా స్పెక్యులేషన్‌తో ఏదో ఒక కంపెనీ షేర్లలో ఇన్వెస్ట్ చేసే వారికి స్టాక్ మార్కెట్ జూద గృహమే. నిపుణుల సలహాతో లేదా కంపెనీ విషయంలో సరైన హోమ్ వర్క్ చేసి ఇన్వెస్ట్ చేసే వారికి మాత్రం స్టాక్ మార్కెట్ బంగారు గని. దీర్ఘకాలిక లక్ష్యాలతో పాటు ద్రవ్యోల్బణాన్ని మించిన రాబడులు కావాలనుకునే వ్యక్తులకు ఈక్విటీ మార్కెట్‌ను మించిన పెట్టుబడి అవకాశం లేదు.

ఇన్వెస్టర్లలో రకాలు

స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై ధోరణిని బట్టి ఇన్వెస్టర్లను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు.

ముందు లాభం - తర్వాత నష్టాలు

కొంత మంది రిటైల్ ఇన్వెస్టర్లు తొలి ట్రేడింగ్ లేదా పెట్టుబడులతోనే భారీ లాభాలు కళ్లజూస్తారు. ఆ వెంటనే భారీ నష్టాల్లో మునిగిపోతారు. ముందు వచ్చిన లాభాల ధీమాతో వీరిలో ఎక్కువ మంది గుడ్డెద్దు చేలో పడ్డట్టు, ముందూ వెనకా చూడకుండా అల్లాటప్పా కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు ప్రధాన కారణం.

ముందు నష్టాలు - తర్వాత లాభాలు

కొంత మంది రిటైల్ ఇన్వెస్టర్లు ముందు నష్టపోయినా, తర్వాత వరుసగా లాభాలు కళ్ల జూస్తుంటారు. ముందు చేసిన తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడమే ఇందుకు కారణం.

తెలివైన ఇన్వెస్టర్లు

మరికొందరు ఇన్వెస్టర్లు ముందు నుంచి తెలివిగా క్రమ పద్ధతిలో మంచి కంపెనీల షేర్లు లేదా ఈక్విటీ పథకాలను ఎంచుకుని మరీ ఇన్వెస్ట్ చేసి లాభాలు ఆర్జిస్తుంటారు. ఇలాంటి వ్యక్తులు దీర్ఘకాలిక లక్ష్యంతో మార్కెట్‌లో వచ్చే ఆటుపోట్లను కూడా అవకాశాలుగా మార్చుకుని మరీ ఇన్వెస్ట్ చేస్తుంటారు.

నిరాశాపరులు

వీరి దృష్టిలో స్టాక్ మార్కెట్ అంటే ఒక జూద గృహం. ఇలాంటి ఇన్వెస్టర్లు ఉన్న మిగులు నిధులన్నీ అసలుకు ఢోకా లేని ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పిపిఎఫ్, బీమా పాలసీల్లో లేదా కొద్దో గొప్పో రిస్కు ఉండే రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు.

ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు ఎందుకంటే?

- ద్రవ్యోల్బణానికి మించిన రాబడుల కోసం.
- సరైన అవగాహనతో ఇన్వెస్ట్ చేస్తే అద్భుతమైన లాభాలకు అవకాశం.
- దీర్ఘకాలిక లాభాల కోసం మంచి కంపెనీల షేర్లు కొని ఎక్కువ కాలం అట్టిపెట్టుకోవాలి. ఇలాంటి కంపెనీల షేర్లను తరచూ అమ్మడం కొనడం చేయకూడదు. అలా చేస్తే బ్రోకరేజ్‌తో బ్రోకర్లు బాగుపడతారు తప్ప, ఇన్వెస్టర్లు కాదు.
- మార్కెట్‌లో చోటు చేసుకునే ఆటుపోట్లను అవకాశాలుగా చూడాలే తప్ప భయపడి ఉన్న పెట్టుబడులు ఉపసంహరించుకోకూడదు.
- ఆదాయ పన్ను చెల్లింపు పరిధిలో ఉంటే దీర్ఘ కాలిక లాభాల కోసం సెక్షన్ 80సి కింద మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో (ఇఎల్ఎస్ఎస్) ఇన్వెస్ట్ చేయడం మంచిది. దీని వలన పన్ను పోటు తగ్గడంతో పాటు దీర్ఘకాలిక లాభాలు చేకూరే అవకాశం ఉంది.



- మంచి కంపెనీల షేర్ల విషయంలో 'బై అండ్ ఫర్గెట్' వ్యూహం మంచి లాభాలు తెచ్చిపెడుతుంది. కొన్ని మంచి కంపెనీల షేర్లను వాటి ఐపిఒల్లో కొని మర్చిపోయిన ఇన్వెస్టర్లే ఇందుకు ఉదాహరణ.
- ఏదైనా ఒక మంచి కంపెనీ షేరులో మంచి లాభాలు బుక్ చేసుకున్నా, అదే లక్ష్యంతో మంచి కంపెనీల షేర్లలో పెట్టుబడులు కొనసాగించాలి. ఇలాంటి ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌ను సంపద సృష్టించే మార్కెట్‌గా చూడాలే తప్ప డబ్బులు సృష్టించే మార్కెట్‌గా చూడకూడదు. ఏదైనా కంపెనీ వ్యాపారం అదే పనిగా పెరుగుతుంటే ఆ కంపెనీ షేర్లను పోర్టుఫోలియోలో కొనసాగించాలి. ఎంతో తప్పని సరైతే తప్ప లాభాల్లో ఉన్నామని అమ్ముకోకూడదు.
- స్వల్పకాలిక అవసరాల కోసం దాచుకున్న డబ్బుల్ని ఎప్పుడూ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయకూడదు.
- 'ఓపికగా వేచి చూడడం' స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో అన్నిటికన్నా ముఖ్యం అనే విషయం ఎపుడూ గుర్తుంచుకోవాలి. మార్కెట్ ఎప్పుడూ ఒకే రోజు ఆకాశాన్నంటదు. ఒక్కోసారి మనం కొన్న షేర్లు కొన్ని సంవత్సరాలపాటు ఎదుగు బొదుగులేకుండా ఉంటాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా దూసుకుపోతాయి. అప్పటి వరకు ఓపికగా వేచి చూసిన వారికే ఆ లాభాలు సొంతమవుతాయి.

టాక్స్ సేవింగ్ డిపాజిట్లు

మార్చి సమీపిస్తోంది. సెక్షన్ 80సి కింద పన్ను ఆదా కోసం చాలా మంది టాక్స్ సేవింగ్ డిపాజిట్ల (ఎఫ్‌డి)లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. అయితే చాలా మందికి ఈ డిపాజిట్లకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవు. ఆ వివరాలేంటో తెలుసుకోండి...

- వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యుఎఫ్) మాత్రమే ఈ డిపాజిట్లలో మదుపు చేయాలి.
- ఈ డిపాజిట్ కనీస మొత్తం ఎంత అనేది ఆయా బ్యాంకులను బట్టి మారుతుంటుంది.
- ఈ డిపాజిట్ల కాల పరిమితి ఐదేళ్లు. మధ్యలో వెనక్కి తీసుకునేందుకుగానీ, ఈ ఎఫ్‌డి హామీపై రుణాలు తీసుకునే అవకాశంగానీ ఉండదు.
- సహకార, గ్రామీణ బ్యాంకుల్లో తప్ప ఏ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులోనైనా ఈ డిపాజిట్ చేయవచ్చు.
- ఐదేళ్ల కాలపరిమితి ఉండే పోస్టాఫీసు టైమ్ డిపాజిట్ (పిఒటిడి)కు సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.
- పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఒక పోస్టాఫీస్ నుంచి మరో పోస్టాఫీస్‌కు బదిలీ చేసుకోవచ్చు.
- వ్యక్తిగతంగా లేదా జాయింట్‌గా కూడా ఈ డిపాజిట్లు చేయవచ్చు. జాయింట్‌గా ఉంటే, మొదటి పేరు ఉన్న వ్యక్తికి మాత్రమే పన్ను ప్రయోజనాలు లభిస్తాయి.
- ఈ డిపాజిట్లపై అందే వడ్డీ ఆదాయంపై ఆయా వ్యక్తుల టాక్స్ శ్లాబులను బట్టి పన్ను విధిస్తారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.10,000 దాటితే టిడిఎస్ కూడా వర్తిస్తుంది.
- సాధారణ పౌరులు ఫారం 15జి, సీనియర్ సిటిజన్లు ఫారం 15హెచ్ సమర్పించడం ద్వారా టిడిఎస్ చెల్లింపు నుంచి బయట పడవచ్చు.
- టాక్స్ సేవింగ్ డిపాజిట్లపై వడ్డీని నెలకు లేదా మూడు నెలలకోసారి చెల్లిస్తారు. ఇంకా కావాలనుకుంటే ఈ వడ్డీని ఇదే డిపాజిట్లలో తిరిగి ఇన్వెస్ట్ చేయవచ్చు.
- ఈ డిపాజిట్లకు నామినేషన్ సౌకర్యం ఉంది.
- టాక్స్ సేవింగ్ డిపాజిట్ల విషయంలో బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు కొద్దిగా ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తుంటాయి.



ఒక అకౌంట్ బదులు వేరే అకౌంట్‌లో పేమెంట్ చేస్తే ?



గొండాల రాంబాబు

జిఎస్‌టి కింద రిజిస్ట్రేషన్ తీసుకున్న వారు పన్నుకు సంబంధించిన మొత్తాన్ని వారి వద్ద ఉన్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి) నుంచి చెల్లించవచ్చు. ఒకవేళ సరిపోను మొత్తం ఐటిసి ఖాతాలో లేకపోయినా రివర్స్ చార్జ్‌కి సంబంధించి సరఫరాలు పొందినా పన్ను చెల్లింపును తప్పనిసరిగా నగదులో చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం ఆన్‌లైన్‌లో ఒక చలాన్‌ను తయారుచేసుకుని సంబంధిత పన్ను మొత్తాన్ని చెల్లించవచ్చు. అయితే దీనికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. చెల్లించవలసిన మొత్తం ఏ పన్ను (టాక్స్)కు సంబంధించినవి అయితే అదే టాక్స్ అకౌంట్‌లో వేయాలి. దీన్ని ఒక చిన్న ఉదాహరణతో తెలుసుకుందాం.

ఒక వ్యాపారస్తుడు తన అమ్మకానికి సంబంధించి రూ.20,000 సిజిఎస్‌టి, రూ.20,000 ఎస్‌జిఎస్‌టి చెల్లించాలనుకుందాం. తన కొనుగోళ్లకు సంబంధించిన వచ్చిన ఇన్‌పుట్ క్రెడిట్ సిజిఎస్‌టిలో ఒక రూ.15,000, ఎస్‌జిఎస్‌టిలో రూ.15,000 ఉన్నాయి. అంటే ఇన్‌పుట్ క్రెడిట్ మినహాయించిన తర్వాత ఆ వ్యాపారి సిజిఎస్‌టిలో రూ.5,000, ఎస్‌జిఎస్‌టిలో రూ.5,000 చొప్పున చలాన్ ద్వారా నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ వ్యక్తి పొరపాటున రూ.5,000 బదులు రూ.10,000 సిజిఎస్‌టిలో కట్టాడనుకుందాం. ఇలా కట్టిన పన్ను మొత్తం తొలుత ఆ వ్యాపారి నగదు లెడ్జర్‌కు జమ అవుతుంది. అక్కడ నుంచి సంబంధిత పన్ను ఖాతాకు బదిలీ అవుతుంది. ఎప్పుడైతే విడివిడిగా రూ.5,000 చొప్పున కట్టకుండా రూ.10,000 ఒకే అకౌంటులో కడితే ఆ ఖాతాకు మాత్రమే ఈ మొత్తం కనపడుతుంది. అంటే పై ఉదాహరణలో ఆ వ్యాపారి నగదు లెడ్జర్‌లో సిజిఎస్‌టి కింద రూ.10,000 కనబడతాయి. ఎస్‌జిఎస్‌టిలో ఏమి ఉండదు.


జిఎస్‌టి నిబంధనల ప్రకారం ఏ ఖాతాలోని మొత్తం ఆ పన్ను చెల్లింపునకు మాత్రమే వాడాలి. కాబట్టి సిజిఎస్‌టిలో కనపడే రూ.10,000 సిజిఎస్‌టి చెల్లింపునకు మాత్రమే వాడాలి. కానీ, ఇక్కడ సిజిఎస్‌టిలో చెల్లించాల్సింది రూ.5,000 మాత్రమే. రూ.ఐదు వేలు చెల్లించిన తర్వాత ఇంకా ఐదు వేలు సిజిఎస్‌టి ఖాతాలో ఉంటాయి. దీన్ని ఎస్‌జిఎస్‌టి ఖాతాకు బదిలీ చేసే అవకాశం లేదు. కాబట్టి, ఎస్‌జిఎస్‌టిలో కట్టాల్సిన రూ.5,000 కోసం మళ్లీ కొత్త చలాన్ ద్వారా ఆ మొత్తాన్ని ఎస్‌జిఎస్‌టి ఖాతాకు బ్యాంకు నుంచి బదిలీ చేయాలి. అంటే రూ.10,000 బదులు 15,000 రూపాయలు చెల్లించడం జరిగింది. అదనంగా చెల్లించిన 5,000 రూపాయలు సిజిఎస్‌టి ఖాతాలో జమ అయి ఉన్నాయి. అయితే ఆ మొత్తం నష్టపోవాల్సిన అవసరం లేదు. దీన్ని అలాగే ఉంచి తదుపరి నెలలో జరిగే విక్రయాలకు చెల్లించవచ్చు లేదా ఆ మొత్తం వెనక్కు కావాలి అంటే రిఫండ్ తీసుకోవచ్చు.

ఇదీ జీఎస్‌టీ

దీనికోసం జిఎస్‌టి వెబ్‌సైట్‌లో మీ ఖాతాలోకి లాగిన్ అయి రిఫండ్స్ సెక్షన్‌కు వెళ్లాలి. అక్కడ 'రిఫండ్ ఆఫ్ ఎక్సెస్ బ్యాలెన్స్ ఇన్ ఎలక్ట్రానిక్ క్యాష్ లెడ్జర్' అన్న ఆప్షన్‌ను ఎంచుకుని రిఫండ్ తీసుకోవాల్సిన వివరాలు నమోదు చేస్తే ఆ మొత్తం మీ క్యాష్ లెడ్జర్ నుంచి డెబిట్ అవుతుంది. దీనికి గుర్తుగా ఒక ఎఆర్ఎన్ సంఖ్య సిస్టమ్ కేటాయిస్తుంది. ఇప్పుడు ఆర్ఎఫ్‌డి-01ఎ అనే దరఖాస్తును పూర్తి చేసి సిస్టమ్ కేటాయించిన ఎఆర్ఎన్ వివరాలు జతచేసి మీ టాక్స్ ఆఫీసర్‌కు అందజేస్తే రిఫండ్ మొత్తం అంటే అదనంగా కట్టిన రూ.5,000 మీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయబడుతుంది.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.




ప్రకాశ్ ఇండస్ట్రీస్

దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ తయారీదారుల్లో ఒకటి. బొగ్గు, ముడి ఇనుప ఖనిజ నిక్షేపాలు కలిగిన చత్తీస్‌గఢ్ లో వ్యూహాత్మకంగా ప్లాంట్‌ను కలిగి ఉంది. ఒడిశా, చత్తీస్‌గఢ్‌ల్లో సొంత ముడి ఇనుప ఖనిజ గనులను కలిగి ఉంది. వీటితో పాటు పివిసి పైప్స్, ఫిట్టింగ్స్ డివిజన్ కూడా ఉంది. స్పాంజ్ ఐరన్ నుంచి స్టీల్‌ను తయారు చేస్తోంది. ఇందుకోసం జర్మనీకి చెందిన లుర్గి కంపెనీతో సాంకేతిక సహకార ఒప్పందాన్ని కలిగి ఉంది. చత్తీస్‌గఢ్‌లోని చంపాలో 10 లక్షల టన్నుల సామర్థ్యం గల స్పాంజ్ ఐరన్, 11 లక్షల టన్నుల స్టీల్ బిల్లెట్స్, లక్ష టన్నుల ఫెర్రో అల్లాయ్స్ ప్లాంట్లను నిర్వహిస్తోంది. అలాగే రాయ్‌పూర్‌లోని 11 లక్షల టన్నుల ఫినిష్డ్ స్టీల్ ప్లాంట్‌లో వైర్ రాడ్స్, టిఎంటి బార్స్, స్ట్రక్చరల్ స్టీల్‌ను ఉత్పత్తి చేస్తోంది. మరో 2 లక్షల టన్నుల స్పాంజ్ ఐరన్ ఉత్పత్తి సామర్థ్యం సెప్టెంబరు నాటికి అందుబాటులోకి రానుంది. దీంతో బిల్లెట్, స్టీల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తక్కువ వ్యయంతో పెంచుకోనుంది. టన్నుకు 2,000 రూపాయల వ్యయం తగ్గుతుందని అంచనా.

2020 సంవత్సరంనాటికి 40 నుంచి 45 శాతం మేర ఉత్పత్తి పెరుగుతుందని అంచనా. స్పాంజ్ ఐరన్ రూట్‌లో స్టీల్‌లో స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నందున కోకింగ్ కోల్ ధరల్లో ఒడిదుడుకుల ప్రభావం నుంచి బయటపడింది. మార్చి నాటికి సిర్కా గుట్టు ముడి ఇనుప ఖనిజ గనికి ప్రభుత్వ అనుమతులు లభిస్తాయని కంపెనీ భావిస్తోంది. అనుమతుల తర్వాత ఈ గని నుంచి 5 లక్షల టన్నుల ఐరన్ ఓర్ ఉత్పత్తి సామర్థ్యం కొత్తగా వచ్చి చేరనుంది. దీనికితోడు మరో గని కవర్ధా వద్ద 10 లక్షల టన్నుల సామర్థ్యంతో వచ్చే ఏడాదికి ఉత్పత్తిని ప్రారంభించనుంది. వచ్చే మూడేళ్లకాలంలో ఇంటిగ్రేటెడ్ ప్లాంట్‌తో కంపెనీ పనితీరు భారీగా మెరుగుపడనుంది. 2030 నాటికి తలసరి స్టీల్ వినియోగం 160 కిలోలు పెరుగుతుందని ఇటీవల విడుదల చేసిన నేషనల్ స్టీల్ పాలసీ పేర్కొంది. 2025నాటికి దేశం స్టీల్ దిగుమతులపై ఆధారపడకుండా, నికరంగా ఎగుమతి చేసే దశకు చేరుకుంటుందని అంచనా. ఇదికాకుండా ఏటా 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉత్తరాఖండ్‌లో రిజిడ్ పివిసి పైపుల డివిజన్‌ను కలిగి ఉంది.

ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో మంచి మార్కెట్ వాటాను కలిగి ఉంది. గత ఐదేళ్లుగా ఈ డివిజన్ ఏటా 16 శాతం చొప్పున వృద్ధి రేటును నమోదు చేస్తూ వస్తోంది. అలాగే నిర్వహణా మార్జిన్లు కూడా ఏటా 26 శాతం చొప్పున పెరుగుతున్నాయి. ఈ డివిజన్ వివిధ రకాల పివిసి పైపులను తయారు చేస్తోంది. అందరికీ ఇల్లు పథకంతో పాటు రైల్వేలు, రక్షణ, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో పెట్టుబడులు పెంచే చర్యలు ఈ విభాగానికి కలిసి రానున్నాయి. ఇవే కాకుండా స్వచ్ఛ భారత్ అభియాన్, జీఎస్‌టి తదితర అంశాలు సానుకూలంగా ఉన్నాయి. పివిసి పైపుల డివిజన్‌ను విడగొట్టాలన్న (డీ మెర్జర్) ప్రతిపాదనను కూడా కంపెనీ పరిశీలిస్తోంది. దీంతోపాటు రూ.500 కోట్ల నిధుల సమీకరణ కోసం వచ్చే వారం క్యుఐపి ఇష్యూను జారీ చేస్తోంది. క్యుఐపి ఇష్యూ ధరను మరో రెండు రోజుల్లో ప్రకటించనుంది.



టెక్నికల్స్

ఈ షేరు 2008 నాటి గరిష్ఠ స్థాయిని అధిగమించి గత వారం రూ.241.90 వద్ద క్లోజైంది. గత అక్టోబరులో జరిగిన ఏడేళ్ల సాసర్ ప్యాట్రన్ బ్రేకౌట్ లక్ష్యాన్ని కూడా చాలా వేగంగా కేవలం మూడు నెలల్లోనే చేరుకుంది. ప్రస్తుతం ఈ షేరు 10 వారాల మూవింగ్ సగటుకు దాదాపు 38 శాతం ఎగువన ట్రేడవుతూ ఉంది. గత ఐదువారాల్లో భారీ అక్యుములేషన్ జరిగింది. విలియం ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ అత్యధికంగా 96గా ఉంది. అలాగే ప్రైస్ ఓవర్‌బాట్‌లో ఉన్నా మూమెంటమ్ ఇండికేటర్లలో ఎలాంటి నెగటివ్ డైవర్జెన్స్ కనిపించటం లేదు. ట్రెండ్ బలాన్ని తెలిపే ఎడిక్స్ గరిష్ఠంగా 36గా ఉంది. ఈ నేపథ్యంలో ఈ షేరును దీర్ఘకాలానికి అక్యుములేట్ చేయవచ్చు. వచ్చే ఆరు నుంచి 12 నెలల కాలానికి లక్ష్యం రూ.365. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.176. దీర్ఘకాలిక లక్ష్యం రూ.576. ఈ లక్ష్యాన్ని వచ్చే 18 నుంచి 24 నెలల కాలంలో చేరుకోవచ్చు.

ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలో రెవెన్యూ 39 శాతం వృద్ధితో రూ.726 కోట్లకు చేరుకుంది. అలాగే స్థూల లాభం 143 శాతం పెరిగి రూ.152 కోట్లకు చేరింది. స్థూల లాభ మార్జిన్లు 12 శాతం నుంచి 20.9 శాతానికి పెరిగాయి. నికర లాభం 460 శాతం పెరిగి రూ.18 కోట్ల నుంచి రూ.101 కోట్లకు చేరుకుంది. నాలుగో త్రైమాసికంలో స్థూల లాభ మార్జిన్లు మరో 25 శాతం పెరుగుతుందని అంచనా. వచ్చే త్రైమాసికంలో అమ్మకాల పరిమాణం 35 శాతం, టర్నోవర్ 60 శాతం పెరగవచ్చని అంచనా. 2019 నాటికి పివిసి పైపుల ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్న యోచనలో ఉంది. కాగా గత త్రైమాసికంలో రుణాలను రూ.160 కోట్ల మేరకు తగ్గించుకోగలిగింది. కోల్ ఇండియా నుంచి 15.6 లక్షల టన్నుల కోల్ లింకేజీని వచ్చే ఐదేళ్ల కాలానికి కలిగి ఉంది. దీనికి తోడు గత మూడు నెలల కాలంలో స్టీల్, ఫెర్రో అల్లాయ్స్ ధరలు 20 శాతం మేర పెరిగిన కారణంగా కంపెనీ మార్జిన్లలో భారీ పెరుగుదల నమోదైంది. దీంతో ఈ షేరు సంస్థాగత ఇన్వెస్టర్లు, హెచ్ఎన్ఐల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 7.07 శాతం మేర ఉంది. కాగా 3.93 శాతం వాటా ఎఫ్ఐఐల చేతిలో ఉంది. అలాగే రాకేష్ ఝున్‌ఝున్‌వాలాకు 1.64 శాతం, ముకుల్ అగర్వాల్‌కు 1.51 శాతం వాటా ఉంది. కొన్ని రోజులుగా మరో హెచ్ఎన్ఐ డాలీ ఖన్నా నాలుగు లక్షల షేర్లను కొనుగోలు చేశారు. క్యాన్‌స్లిమ్ ఇన్వెస్ట్‌మెంట్ మెథడాలజీలోని తొమ్మిది అంశాల్లో ఏడింటిని ఈ షేరు కలిగి ఉంది. అక్యుములేషన్ ర్యాంక్, గ్రూప్ ర్యాంక్‌లు గరిష్ఠంగా ఉన్నాయి.

టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.



తెలంగాణలో ఎవ్వరికీ మెజార్టీ రాదు

- ముక్కోణ పోటీ తప్పదు.. ఆంధ్ర పార్టీ అన్న ముద్ర తుడిచేశాం
- ఓపెన్ హార్ట్ విత్ ఆర్కేలో రమణ, రేవూరి

మోత్కుపల్లి నర్సింహులు చెప్పిన దానితో ఏకీభవిస్తారా?

రమణ: ఆయన ఆర్గనైజేషన్ పరమైన విషయాలు మాట్లాడితే ఆశ్చర్య పోయేవారిమి కాదు. పార్టీనే విలీనం చేయాలని మాట్లాడడం.. దుర్మార్గమైన.. బాధాకరమైన మాట. పార్టీ కార్యకర్తలు కూడా ఉడికిపోతున్నారు.

చంద్రబాబు పట్టించుకోవడం లేదన్న మోత్కుపల్లి వ్యాఖ్యలపై

రేవూరి: మా అధ్యక్షుడు చెప్పేది మీ అంతట మీరు ఎదగండి అని. లక్ష ల మంది అభిమానులున్నారు. దానికి అనుగుణంగా మేం ముందుకు వెళ్తున్నాం.

రేవంత్ ఉన్నప్పుడు కొంచెం హడావుడి ఉండేది. ఇప్పుడు అదీ లేదు..

రమణ: రేవంత్ రెడ్డి ముందుకెళ్తానంటే పార్టీ అవకాశమిచ్చింది. అతనికి అసెంబ్లీలో అవకాశముంది. ఇప్పుడు పార్టీని బలపరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు. ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలోనే ఎక్కువగా అన్నగారి వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ పార్టీ ఉండాలనే భావన పేదల్లో ఉంది. మమ్మల్ని ఆదరిస్తున్నారు.

కేసీఆర్ నుంచి పిలుపు రాని వారే ఇక్కడ ఉండిపోయారంటారు

రేవూరి: కేసీఆర్ పిలిచినా నేను వెళ్లలేదు. ఈ విషయం వారికీ తెలుసు. రెండో స్థానంలో నేనే ఉంటానన్నారు. టీడీపీని నామరూపాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతోనే కేసీఆర్ చర్యలు చేపట్టారు. ఏ రోజైనా టీడీపీ పుంజుకుంటుందని ఆయనకు భయం. కాంగ్రెస్‌తో ఆ భయం లేదు. చంద్రబాబు దృష్టి పెడితే మమ్మల్ని మళ్లీ ఏకతాటిపై నడిపిస్తారు. మరో నెలన్నర తరువాత చూడండి.

రమణ: కొన ఊపిరి ఉన్నంతవరకు టీడీపీని వీడబోనని ముందే చెప్పాను. టీఆర్ఎస్‌లోకి రావాల్సిందిగా 2014కు ముందు కేటీఆర్ స్వయంగా అడిగాడు. ఎర్రబెల్లి దయాకర్‌రావు టీం వెళ్లినప్పుడు ప్రైవేటు వ్యక్తులతో అడిగించారు. తెలంగాణలో వందశాతం టీడీపీ ఉండాల్సిందే.

టీడీపీ వెనకబడటానికి కారణం?

రేవూరి: రెడ్డి-వెలమ అన్నపుడు మేం వెనుకబడ్డం.. దానికీ ఓ కారణముంది.. రేవంత్‌రెడ్డే కారణం. కేసుల్లో దొరికినపుడు అంతా వెలమరాజ్యం అయిపోతుంది అని మాట్లాడటం పార్టీకి మైనస్ పాయింట్ అయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గుర్తింపు, గౌరవం ఇచ్చిన పార్టీ బ్రాండ్ ఇమేజ్ పోతుందని మాలో మేం అనుకున్న మాట వాస్తవమే. పాత రోజులను గుర్తు చేసేలా విస్తృతంగా ప్రచారం చేసి, ఈ పార్టీయే సామాజిక న్యాయాన్ని కాపాడగలుతుందన్న నమ్మకాన్ని ఇవ్వాలి.

ఇప్పుడున్న పరిస్థితిలో.. తెలుగుదేశం ఒంటరిగా పోటీచేస్తే గెలిచే పరిస్థితి లేదు. వేరేవారితో కలిస్తే..

రమణ: ఇప్పుడు టీఆర్ఎస్ గవర్నమెంటో.. కాంగ్రెస్ గవర్నమెంటో వస్తదనే నమ్మకం ఇప్పుడైతే లేదు. 100 శాతం నువ్వా-నేనా అనే పరిస్థితి కాంగ్రెస్-టీఆర్ఎస్‌లలోనే... టీడీపీ సపోర్ట్ లేకుండా.. ఏ పార్టీ గవర్నమెంట్‌లోకి వచ్చే అవకాశం లేదు. కాంగ్రెస్ పరిపాలన చూశారు. టీఆర్ఎస్ పాలన చూస్తున్నారు. గతంలో తెలుగుదేశం పరిపాలన చూశారు. ఇప్పుడు త్రికోణ పోటీ ఉంది.

బీజేపీతో కేసీఆర్ పొత్తుపెట్టుకోరు.. కాంగ్రెస్ కలవదు. మీరు ఎటు మొగ్గుతారు.

రేవూరి: ఎటు మొగ్గుతామనేది తేల్చుకోలేదు. తెలంగాణలో టీడీపీ ఒంటరిగా అధికారంలోకి వసుందన్న నమ్మకం మాత్రం లేదు. ఓట్లు, సీట్లు పెంచుకొని ఎవరైనా మా మద్దతుతోనే అధికారం చేపట్టే పరిస్థితి కల్పిస్తాం. ఎన్నికల్లోనే మిత్రపక్షాలతో కలిసి పోటీ చేస్తాం.

ఇరవైల్లోనే అరవైల్లోకి!



యువకులపై ఫ్లోరైడ్ దాడి.. పాతికేళ్లకే సడలిన బతుకు

- విషజలాలకు పాడైన కిడ్నీలు
- ఐదేళ్లలో 300 మంది మృతి
- అత్యంత అపాయ అంచుల్లో కనిగిరిలోని వంద గ్రామాలు

కనిగిరి, జనవరి 21 : కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అని ఓ కవి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతంలో మాత్రం కుర్రవాళ్లలోనే కాదు, పసివాళ్లలోనూ వృద్ధఛాయలు కనిపిస్తున్నాయి. పాతికేళ్ల యువతి ఎముకలగూడులా ఎదురుపడుతుంది. 35 ఏళ్లు నిండకుండానే, చాలామంది యువకులు కీళ్లు సడలిపోయి, నడుములు వంగిపోయి కనిపిస్తున్నారు. అయితే, ఆ కవి అన్నట్టు, వీరంతా ఎవరికో భావ దాసులు కాదు.. ఫ్లోరైడ్ జలాలు చిమ్ముతున్న విషానికి బాధితులు. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన పిల్లలు, నవ యువకుల నుంచి మూడు కాళ్ల ముదుసరుల వరకూ ఫ్లోరైడ్ కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నారు. కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలతో మంచం పడుతున్నారు. ఇంత జరుగుతున్నా, అధికారులు, నాయకుల్లో కదలిక లేదు. నీటి పథకాల పేరుతో కోట్లు కొల్లగొడ్తున్నారేగాని ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారించడం లేదు. మూడో విడతకు నిధులు విడుదలకాక, 'రామ తీర్థం' నీటి పథకం అరకొరగా మిగిలిపోయింది. దీంతో కనిగిరి ప్రాంత ప్రజలు గుక్కెడు మంచి నీటి కోసం తమ గ్రామాలను ఖాళీచేసి, వలస బాట పడుతున్నారు.

1937లోనే గుర్తించినా..

కనిగిరి నియోజకవర్గంలోని వంద గ్రామాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ప్రమాదకర స్థాయిలో ఉంది. సాధారణంగా 5 పీపీఎం దాటితే.. ఫ్లోరైడ్ సమస్య దాదాపు చెయ్యి దాటిపోయినట్టు భావిస్తారు. కనిగిరిలోని దాదాపు 30 గ్రామాలు ఇప్పుడు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. కనిగిరి పట్టణంలోని పరాశర భారతీ వీధిలో అత్యధికంగా 9 పీపీఎం నమోదు కావడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. నిజానికి, 1937లోనే కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్యను శాస్త్రవేత్తలు గుర్తించారు. 2007, 2008లో మరోసారి పరిశోధనలు సాగించారు. ప్రజలు తాగుతున్న నీటిలో ఫ్లోరిన్ అత్యధికంగా ఉన్నట్టు గుర్తించారు. అలాగే, మరో 15 ప్రమాదకర మూలకాలనూ ఇక్కడి జలాల్లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనిపై స్పందించిన అప్పటి ప్రభుత్వం, ఈ నియోజకవర్గంలోని 442 గ్రామాలకు మంచి నీరు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రామతీర్థం జలాశయం నుంచి రూ.239 కోట్లతో పనులు చేపట్టింది. 2012నాటికి ఈ పథకం పూర్తిచేయాలని అనుకొన్నారు. మొదటి విడతగా రూ.91కోట్లు, రెండో విడత రూ.60కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో కనిగిరి, వెలిగండ్ల, పామూరు, పీసీపల్లి మండలాల్లో వాటర్ ట్యాంకులు, పైప్ లైన్ల నిర్మాణం సాగింది. ఆ తరువాత మూడో విడతగా అందాల్సిన రూ.100కోట్ల నిధులు ఆగిపోవడంతో సీఎస్‌పురం మండలంలో చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయి. సాగర్ నీరు వదలకపోవడంతో, పనులు పూర్తయిన మండలాలకూ పెద్దగా ఊరట లభించలేదు. వారానికి ఒకసారిమాత్రమే రామతీర్థం జలాలు ఈ మండలాల గొంతు తడుపుతున్నాయి.



రెండు కిడ్నీలూ పాడయి..

పామూరు మండలం తిరగలదిన్నెకు చెందిన మానం గంగయ్య(55) ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్న నీరు తాగడం వల్ల.. ఆయన రెండు కిడ్నీలూ పాడయ్యాయి. ఐదేళ్లుగా మంచంపైనే ఉన్నాడు. వారానికి రెండు రోజులు ఒంగోలు వెళ్లి డయాలసిస్ చేయించుకొంటున్నాడు. ఆయన వైద్యానికి లక్షల రూపాయల అప్పులు చేస్తున్నారు. కిడ్నీల సమస్యతో ఈ ప్రాంతంలో గత ఐదేళ్లలో 300 మంది మరణించారు.

కూలిపోయిన కుటుంబం..

కనిగిరి నగర పంచాయతీలోని కొండకింద బీసీ కాలనీలో ఉంటున్న మానికిల వారి కుటుంబం, ఫ్లోరైడ్ దెబ్బకు కూలిపోయింది. ఆ కుటుంబంలోని నలుగురు అన్నదమ్ములూ ఈ మహమ్మారి బారిన పడ్డారు. దీంతో ఎవరికీ పెళ్లిళ్లు కాలేదు. వీరిలో ఇద్దరు చనిపోగా, మిగతావారు కాలనీని ఖాళీచేసి వెళ్లిపోయారు. అయినా, వారికి కష్టాలు తప్పలేదు. కాళ్లు వంకరులు తిరిగిపోయి, 40 ఏళ్లకే ఎనభై దాటినవాళ్లలా జీవచ్ఛవాలుగా కనిపిస్తున్నారు. ఇదే కాలనీలో ఉంటున్న కొమరిగిరి మరియమ్మకు(35) ఐదేళ్లు ఉన్నపుడు ఫ్లోరోసిస్ సోకింది. వృద్ధురాలైన ఆమె తల్లి కూలీపనులు చేసి, మరియమ్మను బతికించుకొంటోంది. స్థోమత లేక మందులు, చికిత్సను అందించలేకపోతున్నానని ఆమె వాపోయింది. శివనగర్ కాలనీకి చెందిన చలంచర్ల కృష్ణ(45)కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తీవ్రమైన కాళ్లనొప్పుల కారణంగా కృష్ణ కూలి పనులకు వెళ్లలేకపోతున్నాడు. అతని అన్న ప్రసాద్ ఇటీవలే ఫ్లోరోసిస్ వ్యాధితో చనిపోయాడు. తిరగలదిన్నెకు చెందిన తాళ్లూరి బత్తయ్య(48) శరీరమంతా వొంగిపోయింది. 17 ఏళ్లుగా బత్తయ్య, కర్రపోటుపై జీవనం సాగిస్తున్నాడు.



సంతకాల వంతెన రెడీ!

ఇదిగో సంతకాల వంతెన...ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సంతాకాల వంతెనేంటి అనుకుంటున్నారా? దీని వెనక కథేమిటంటే...విశాఖ-విజయనగరం రోడ్డులో వాహనాలు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి విజయనగరం పట్టణంలోని ప్రజలతో లక్ష సంతకాలు సేకరించి కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు కేంద్రానికి పంపించారు. దీంతో రైల్వే శాఖ స్పందించి రూ.16.80 కోట్లు మంజూరు చేసింది. ఏడాది కిందట నిర్మాణం ప్రారంభమై ఇటీవలే పూర్తయింది. లక్ష సంతకాలతో ప్రతిపాదించి మంజూరైన వంతెన కావటంతో దీనికి సంతకాల వంతెనగా నామకరణం చేశారు.

- విజయనగరం



కేవీబీపురం పాఠశాలలో మొక్కల సంరక్షణలో విద్యార్థినులు

పచ్చని పాఠశాలల్లో ఏపీ టాప్

- ఫిబ్రవరి 7న జాతీయ అవార్డు ప్రదానం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'మొక్కలు నాటండి... నీరు పోసి పెంచండి... మొక్కల్నే బహుమతులుగా ఇవ్వండి... పర్యావరణాన్ని కాపాడండి...మీరు పెంచే చెట్ల ఆధారంగా పరీక్షల్లో మార్కులు కలుపుతాం' అని సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చెవికి బాగా చేరాయి. పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంపొందించడంలో ఏడాదిన్నర క్రితం వరకూ ఎంతో వెనుకబడి ఉన్న మన విద్యార్థులు ఇప్పుడు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లోని 3ప్రభుత్వ పాఠశాలలు ప్రణాళికా బద్ధంగా చేపట్టిన మొక్కల పెంపకం విధానం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఏపీలో 50శాతం భూభాగాన్ని పచ్చదనంతో నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వనం-మనం' కార్యాక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో విద్యార్థులను భాగస్వాములను చేసి ఆశించిన ఫలితాలు సాధించారు అధికారులు. విద్యార్థుల్లో ఉన్న ఆసక్తికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, అటవీ శాఖ సహకారం తోడైంది. జిల్లా పరిషత్ పాఠశాలల్లో క్రీడా మైదనాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. ఆ స్కూలు ప్రాంగణంలో చేతిపంపులు, కొళాయి ద్వారా నీరు కూడా లభిస్తుంది. ఈ రెండింటితోపాటు మొక్కల జాతీ, వాటి ఎదుగుదల, ఎంత విస్తీర్ణంలో కొమ్మలు వెళ్తాయి, తదితర విషయాలను అటవీశాఖ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వపాఠశాలల్లో మొక్కలు పెంచడం మొదలైంది. జాతీయ స్థాయిలో 'గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' సంస్థ ఆయా స్కూళ్లలో పచ్చదనం పెంపొందించేందుకు చేపడుతోన్న కార్యక్రమాలను ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలని కోరింది. ఏపీలో మొత్తం 547 ప్రభుత్వ జెడ్పీ స్కూళ్లు నమోదు చేసుకోవడంతో సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. వాటిలో 164 పాఠశాలలు దూసుకు పోతుండగా, 216 స్కూళ్లు నెమ్మదిగా అడుగులేస్తున్నాయి. చిత్తూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ కార్యక్రమం బాగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గుర్తించింది.

దేశవ్యాప్తంగా 2,860 పాఠశాలల్ని పరిశీలించిన గ్రీన్ స్కూల్ కార్యక్రమ ప్రతినిధులు 54 పాఠశాలల్ని ది బెస్ట్‌గా పేర్కొన్నారు. వాటిలో ఆంధ్రప్రదేశ్‌లోని పత్తికొండ, కేవీబీ పురం(చిత్తూరు జిల్లా), లొద్దపుట్టి(శ్రీకాకుళం జిల్లా) పాఠశాలలు దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీ నేషనల్ గ్రీన్ కోర్‌కు ఢిల్లీలో ఫిబ్రవరి 7న అవార్డు ప్రదానం చేయబోతున్నట్లు సమాచారం ఇచ్చారు. రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి ఈ అవార్డును అందుకోబోతున్నారని, నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మూడు పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతితోపాటు విద్యార్థులకు పుస్తకాలు, ఇతరత్రా ప్రోత్సాహకాలు అందించే అవకాశముందని చెప్పారు.



పాల వెల్లువ

ఏపీలో పెరిగిన క్షీర ఉత్పత్తి

అమరావతి, జనవరి 21: ఏపీలో పాల ఉత్పత్తి గతేడాది కన్నా గణనీయంగా పెరిగింది. చిత్తూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, కడప చివరి స్థానంలో నిలిచింది. 2017-18లో 137.87 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి లభిస్తుందని అధికారుల అంచనా వేయగా.. మూడో త్రైమాసికానికే 106.51 లక్షల మెట్రిక్ టన్నుల పాలు ఉత్పత్తి అయ్యాయి. మార్చితో ముగిసే నాలుగో త్రైమాసికానికల్లా మరో 31 లక్షల మెట్రిక్ టన్నుల పాల దిగుబడి సాధిస్తే ఈ ఏడాది లక్ష్యం నెరవేరుతుంది. గతేడాది ఉత్పత్తి 121.77 మెట్రిక్ టన్నులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. రాయితీపై ఇస్తున్న సైలేజ్ గడ్డి తరహాలోనే రానున్న కాలంలో గడ్డి కొరత లేకుండా పశుగ్రాస క్షేత్రాలను భారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ధేశించింది. ప్రశుసంవర్ధకశాఖ ద్వారా సమగ్ర దాణా, పశుగ్రాసం సరఫరా, గడ్డి విత్తనాల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా పాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ఏటా ఉత్పాదకత పెరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత గణాంకాల ప్రకారం 35,25,527 పాడి గేదెలు, 19,24,499 పాలిచ్చే ఆవులున్నాయి. రోజుకు ఒక్కో ఆవు, గేదె సగటు 3.5-4 లీటర్లు పాలు ఇస్తాయి. మొత్తం ఉత్పత్తిలో 50-55 శాతం ప్రైవేటు డెయిరీలు సేకరిస్తున్నట్లు అంచనా. మిగిలిన పాలను స్థానికంగా విక్రయిస్తున్నారు. డెయిరీలు సేకరించిన పాలలో 40% ఆహారోత్పత్తులకు పంపుతుండగా, 60% ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు.

సంవత్సరం	ఉత్పత్తి (లక్షల మెట్రిక్ టన్నుల్లో)
2013-14	90.82
2014-15	96.56
2015-16	108.17
2016-17	121.77
2017-18	137.87 లక్ష్యం
2017.12.31నాటికి	106.51

పాత ఇళ్లకు రాయితీలు

- అనుమతి లేని ఇళ్ల వివరాలు సేకరణ
- క్షేత్రస్థాయిలో కమిటీల పరిశీలన
- త్వరలోనే నిధులు విడుదల
- రూ.500కోట్లు కేటాయించిన ప్రభుత్వం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకానికి ముందే... నేతల హామీలతో కట్టుకున్న ఇళ్లకు త్వరలోనే న్యాయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటికి రాయితీలు ఇవ్వాలని ఇప్పటికే తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా... అలాంటి ఇళ్లు ఎన్ని ఉంటాయనేదానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించింది. అలాగే ఆ ఇళ్ల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల సంఖ్య ఎంతో తేలే అవకాశం ఉంది. దాని ఆధారంగా ఎంతమేరకే న్యాయం చేయాలో నిర్ణయిస్తారు. అయితే ఇప్పటికే చాలా కాలం గడిచినందున నేతలపై పేదల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను మరింత ముమ్మరం చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులు ఇళ్లను గుర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షన్నర ఇళ్లు ఉండొచ్చని అంచనా వేశారు. అయితే అర్హత ఆధారంగా తనిఖీలు చేస్తే ఆ సంఖ్య చాలా తగ్గిపోతుందని అధికారులు భావిస్తున్నారు. సుమారు లక్ష ఇళ్లు అయితే వేగంగా రాయితీలు విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు రాయితీపైనా తీవ్రంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర రాయితీ ఇస్తున్నారు. అందులో రూ.92వేలు ప్రభుత్వం ఇస్తుండగా... మిగిలిన రూ.58వేలను ఉపాధి హామీ పథకం నుంచి నిధుల కన్వర్జెన్స్ కింద సమకూరుస్తున్నారు. ఉపాధి హామీ నుంచి ఇచ్చే రాయితీ రూ.58వేలను ఇటుకల తయారీ, లబ్ధిదారునికి 90రోజుల కూలీ కింద వేర్వేరుగా చెల్లిస్తున్నారు. కానీ గతంలో కట్టిన ఇళ్లకు ఉపాధి నిధులు ఇవ్వడం సాంకేతికంగా సాధ్యం కాదు. ప్రస్తుతం జరిగే పనులకు మాత్రమే ఉపాధి నిధులను వినియోగించాలన్న నిబంధన ఉండడమే ఇందుకు కారణం. కాబట్టి మిగిలిన నిధులు ఇద్దామా? అని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దాని ప్రకారం ఒక్కో ఇంటికి రూ.92వేలు రాయితీ వస్తుంది. మంజూరు కాకుండా కట్టిన ఇళ్ల సంఖ్య భారీగా పెరిగితే అంతకూడా ఇవ్వడం సాధ్యం కాదని తెలుస్తోంది. లబ్ధిదారులు కూడా ఎంతోకొంత ఇస్తే చాలనే భావనలో ఉన్నందున కొంత తక్కువైనా ఆలస్యం చేయకుండా విడుదల చేయాలనే అభిప్రాయంలో అధికార వర్గాలు ఉన్నాయి.



అక్రమాలకు అవకాశం లేకుండా..

మంజూరు కాకుండా కట్టిన ఇళ్లకు నిధులంటే ఇది మరో కుంభకోణం అయ్యే అవకాశం లేకపోలేదని సీఎం చంద్రబాబు మొదట్లోనే అనుమానం వ్యక్తంచేశారు. ప్రస్తుతం జియోట్యాగింగ్, ఆధార్ అనుసంధానం చేస్తుంటేనే అక్రమాలకు అవకాశం లేకుండా అనేక చర్యలు చేపట్టాల్సి వస్తోంది. ముందే కట్టుకున్న ఇళ్లంటే ఎప్పుడో కాంగ్రెస్ హయాంలో కట్టినవారు కూడా వస్తారని, దానిని నియంత్రించడం కష్టమని మొదట్లో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ పదేపదే ఎమ్మెల్యేలు ఒత్తిళ్లు చేయడంతో సీఎం అంగీకారం తెలిపారు. కానీ కచ్చితంగా 2014 జూన్ 2 తర్వాత కట్టిన ఇళ్లకు మాత్రమే ఆ లబ్ధి చేకూరాలని స్పష్టం చేశారు. దీంతో అధికారులు ప్రతిఇంటినీ ఇంజినీరింగ్ కోణంతో పాటు స్థానికుల సమాచారం కూడా తీసుకుని పరిశీలిస్తున్నారు. గతంలో ఎప్పుడో కట్టుకుని కొత్తగా మరమ్మతులు చేపట్టినవారు కూడా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మరోవైపు తాము సూచించిన వారికే ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు పలుచోట్ల పట్టుబడుతున్నారు. తామే సీఎం వద్ద పోరాడి ఈ ఇళ్లకు నిధులు కేటాయించేలా చేశామని, తమ వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా ఒకట్రెండు నెలల్లో ఈ ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి పేదలకు మేలు చేయాలని గృహనిర్మాణశాఖ నిర్ణయించింది. దీనికి ప్రభుత్వం ఇప్పటికే రూ.500కోట్లు కేటాయించింది. అవి సరిపోకపోతే రెండోదశ కింద మళ్లీ నిధులు విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తంచేసింది. ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున అందరికీ న్యాయం జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారత్ - ఆసియాన్ సదస్సు

జనవరి 25, 26న ఢిల్లీలో భారత్ - ఆసియాన్ సదస్సు జరగనుంది. సదస్సులో భాగంగా మహాకావ్యం రామాయణంలోని కొన్ని ఘట్టాలను కళాకారులు ప్రదర్శించనున్నారు. ఆసియాన్ దేశాల (ఇండోనేసియా, సింగపూర్, ఫిలిప్పైన్స్, మలేసియా, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, బ్రూనై, మయన్మార్, లావోస్) అధినేతలు ఈ కార్యక్రమాల్ని తిలకించనున్నారు. భారత్ - ఆసియాన్ సంబంధాలకు పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి జరిగే గణతంత్ర వేడుకలకు ఆ దేశాల అధినేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు.

కరెంట్ అఫైర్స్

అంతర్జాతీయం

కీలక ఒప్పందాలపై భారత్ - బ్రిటన్ సంతకాలు

చట్టవిరుద్ధంగా బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయులను వెనక్కి తిప్పి పంపేయడానికి సంబంధించిన రెండు ఒప్పందాలపై భారత్ - బ్రిటన్‌లు జనవరి 10న సంతకాలు చేశాయి. దాంతోపాటు నేరాలు, ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన రికార్డులను పరస్పరం తెలియచేసుకునే అంశం కూడా ఈ ఒప్పందంలో ఓ భాగంగా ఉంది. ఉభయదేశాల మధ్య కుదిరిన రెండు అవగాహన ఒప్పందాలపై భారత మంత్రి కిరణ్ రిజిజు, బ్రిటన్ ఇమిగ్రేషన్ వ్యవహారాల మంత్రి కెరోలిన్ నోక్స్ సంతకాలు చేశారు.

చైనాలో భారీ వాయు శుద్ధి పరికరం

వాయు కాలుష్యం, పొగమంచును నివారించడానికి చైనా ఒక భారీ వాయు శుద్ధి పరికరాన్ని ఏర్పాటు చేసింది. అత్యంత కలుషితమైన గ్జియాన్ నగరంలో ఈ పరికరాన్ని నిర్మించింది. స్థూపాకారంలో వంద మీటర్ల ఎత్తులో ఉండే ఈ నిర్మాణం చుట్టూ 10 కిలో మీటర్ల మేర గాలిని శుద్ధి చేయగలదు. పొగమంచులో ఉండే అత్యంత హానికరమైన పీఎం 2.5 సహా ఇతర సూక్ష్మ రేణువులను ఇది 15 శాతం తగ్గిస్తుంది. పొగమంచుకు కారణమయ్యే నైట్రోజన్ ఆక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి వాయువులను ఇది శుద్ధి చేస్తుంది.

బ్రెగ్జిట్ బిల్లుకు ఆమోదముద్ర



యురోపియన్ యూనియన్ నుంచి వైదొలిగే బ్రెగ్జిట్ బిల్లును బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ (హౌస్ ఆఫ్ కామన్స్) ఆమోదించింది. ఈ ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 324 మంది ఎంపీలు ఓటేయగా, వ్యతిరేకంగా 295 మంది ఓటేశారు. దిగువ సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ఎగువ సభలోనూ పాసవ్వాలి. యూరోపియన్ యూనియన్ చట్టాలన్నీ బ్రిటన్ చట్టాలుగా మారడానికి ఉద్దేశించిన 1972 చట్టం ప్రకారమే హౌస్ ఆఫ్ లార్డ్స్ (ఎగువ సభ)లో బ్రెగ్జిట్‌పై చర్చ జరగనుంది.

అవార్డులు

18 మంది బాలలకు జాతీయ సాహస పురస్కారాలు

18 మంది బాలలు ఈ ఏడాది జాతీయ సాహస పురస్కారాలకు ఎంపికయ్యారు. ఇందులో ఏడుగురు బాలికలున్నారు. ప్రతి సంవత్సరం అత్యుత్తమ ధైర్యసాహసాలు ప్రదర్శించే బాలలకు భారత శిశుసంక్షేమ మండలి ఐదు విభాగాలలో అవార్డులిస్తుంది. ఈ పురస్కారాలను జనవరి 18న ప్రకటించారు. దేశంలో సాహస బాలలకిచ్చే అత్యున్నత పురస్కారం 'భరత్'కు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 18 ఏళ్ల నాజియా ఎంపికైంది. గీతా చోప్రా అవార్డు.. కర్ణాటకకు చెందిన నేత్రావతి ఎం చవాన్‌కు మరణానంతరం లభించింది. ఓ చెరువులో మునిగిపోతున్న ఇద్దరిని కాపాడేందుకు 14 ఏళ్ల నేత్రావతి ప్రయత్నించి.. ఒకరిని కాపాడింది. మరొక బాలుడిని కాపాడబోయి, అతనితో పాటు అసువులు బాసింది.

మణిపూర్‌కు చెందిన 17 ఏళ్ల లాల్చాన్‌దామా, 15 ఏళ్ల లౌకురాక్పం రాజేశ్వరీ చాను(మిజోరాం)లకు కూడా మరణానంతరం గీతాచోప్రా అవార్డు దక్కింది. ఓ బస్సు ప్రమాదం నుంచి 16 మంది చిన్నారులను తప్పించిన 17 ఏళ్ల కర్ణబీర్ సింగ్ (పంజాబ్)కు సంజయ్ చోప్రా అవార్డు లభించింది. వీరందరికీ 24న ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డులందిస్తారు. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సాహస బాలలకు ప్రత్యేక విందు ఇస్తారు.

సంగీత నాటక అకాడమీ పురస్కారాలు



రాష్ట్రపతి భవన్‌లో జనవరి 16న సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానం జరిగింది. 2016కు సంబంధించి అయిదు విభాగాల్లో మొత్తం 43 మంది ప్రముఖులకు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఈ పురస్కారాలను అందజేశారు. వీరిలో రంగస్థల ప్రముఖుడు రాంగోపాల్ బజాజ్, నృత్యకారులు సునీల్ కొఠారి, కర్ణాటక సంగీత ప్రావీణ్యులు ఆర్.వేదవల్లి.. సంగీత నాటక అకాడమీ రత్న అవార్డులను అందుకున్నారు.

సంగీతం విభాగంలో కర్ణాటక సంగీత గాయకులు నీలా రాంగోపాల్, కె.ఓమనాకుట్టి, మృదంగ విద్వాంసులు జె.వైద్యనాథన్, వయోలిన్ వాద్యకారులు ఎం.మంజునాథ్; కూచిపూడిలో ఏబీ బాల కొండలరావు, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ రంగస్థల కళాకారులు అన్నాబత్తుల లక్ష్మీ మంగతాయారు, లీలాసాయి (సంయుక్తంగా); ప్రముఖ సంగీత శాస్త్రజ్ఞులు పప్పు వేణుగోపాలరావు పురస్కారాలను పొందారు.

రాష్ట్రీయం

పాడి ఉత్పత్తుల్లో తెలుగు రాష్ట్రాలు టాప్

కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం పాడి, గుడ్ల ఉత్పత్తిలో తెలుగు రాష్ట్రాలు మెరుగైన స్థానాల్లో నిలిచాయి. 2017 మార్చి - జూన్ వరకు సేకరించిన గణాంకాల ప్రకారం గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో, తెలంగాణ మూడో స్థానంలో ఉన్నాయి. తమిళనాడు మొదటి స్థానాన్ని దక్కించుకుంది. పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. తరవాత స్థానాల్లో రాజస్థాన్ (2), గుజరాత్ (3), మధ్యప్రదేశ్ (4) ఉన్నాయి.

తెలంగాణలో 'అమ్మ ఒడి' సేవల విస్తరణ

అమ్మ ఒడి (102 సేవలు) విస్తరణ, కొత్తగా ద్విచక్ర అంబులెన్సులు, ఏఎన్ఎంలు వినియోగించే ద్విచక్ర వాహనాల సేవలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జనవరి 17న హైదరాబాద్‌లో ప్రారంభించారు. కేంద్రం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా అమలవుతున్న జననీ సురక్ష యోజన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పు అయిన మహిళను, శిశువును సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమం మొదలైంది. 2016 డిసెంబర్ 28న రాష్ట్రంలో అమ్మ ఒడి సేవలను ప్రారంభించారు. మొదటి దశలో 41 వాహనాలతో సేవలు మొదలయ్యాయి. అయితే 12 జిల్లాల్లోనే ఈ సేవలను కొనసాగిస్తున్నారు. మిగతా జిల్లాల్లోనూ అమలుకు 200 వాహనాలను కొన్నారు.

నాగోబా జాతర ప్రారంభం



తెలంగాణ గిరిజన జాతరల్లో ముఖ్యమైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతర జనవరి 16న అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మహాపూజలు నిర్వహించిన అనంతరం జాతరను ఆరంభించారు.

ఏపీ ఎన్నికల ప్రధానాధికారిగా సిసోడియా

ఏపీ ఎన్నికల ప్రధానాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి రాం ప్రకాశ్ సిసోడియా ఎంపికయ్యారు. సిసోడియా ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేసిన భన్వర్ లాల్ గత ఏడాది డిసెంబరులో ఉద్యోగ విరమణ చేశారు. నూతన ఎన్నికల ప్రధానాధికారిని నియమించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు పేర్లతో ఓ జాబితాను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపింది. ఆ జాబితా నుంచి సిసోడియా పేరును ఎంపిక చేశారు.

క్రీడలు

ఐసీసీ అవార్డులు



ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వార్షిక అవార్డులను జనవరి 18న ప్రకటించింది. వివరాలు..

- సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ - విరాట్ కోహ్లీ
- వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - విరాట్ కోహ్లీ
- టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)
- టీ20 పెర్‌ఫార్మెన్స్ ఆఫ్ ద ఇయర్ - యజ్వేంద్ర చాహల్
- ఐసీసీ అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - రషీద్ ఖాన్ (60 వికెట్లు- అఫ్ఘానిస్థాన్)
- ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ - హసన్ అలీ (పాక్)
- ఫ్యాన్స్ మూమెంట్ ఆఫ్ ద ఇయర్- ఛాంపియన్స్ ట్రోఫీ విజేత - పాకిస్థాన్
- ఐసీసీ అంపైర్ ఆఫ్ ద ఇయర్ - మరాయిస్ ఎరాస్‌మస్ (దక్షిణాఫ్రికా)
- ఐసీసీ టెస్టు జట్టు: కోహ్లీ (కెప్టెన్), పుజారా, అశ్విన్ (భారత్), ఎల్గర్, డికాక్, రబాడ (దక్షిణాఫ్రికా), వార్నర్, స్మిత్, స్టార్క్ (ఆస్ట్రేలియా), స్టోక్స్, ఆండర్సన్ (ఇంగ్లండ్).
- ఐసీసీ వన్డే జట్టు: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, బుమ్రా (భారత్), వార్నర్ (ఆస్ట్రేలియా), బాబర్ ఆజమ్, హసన్ అలీ (పాకిస్థాన్), రషీద్ (అఫ్ఘానిస్థాన్), డివిల్లీర్స్, డికాక్ (దక్షిణాఫ్రికా), స్టోక్స్ (ఇంగ్లండ్), బౌల్ట్ (న్యూజిలాండ్).

వార్తల్లో వ్యక్తులు

డబ్ల్యూహెచ్‌వో 2018 క్యాలెండర్‌పై గీతావర్మ

హిమాచల్‌ప్రదేశ్‌లోని కర్సోగ్ తహసీల్ సప్నోత్ గ్రామానికి చెందిన గీతావర్మ అనే మహిళ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 2018 క్యాలెండర్‌లో చోటు సంపాదించింది. ఒక ఆరోగ్య కార్యకర్తగా స్థానిక మారుమూల గ్రామాల్లోని చిన్నారులకు టీకాలు వేయడానికి గీతా ఎంతో కష్టించింది. మంచుకొండల్లో నడిచింది. పర్వతాలు ఎక్కిదిగింది. ఎట్టకేలకు నూరుశాతం టీకాలు వేయగలిగింది. దీనికి గుర్తింపుగా గీతాకు ఈ గౌరవం దక్కింది.

న్యూజెర్సీ అటార్నీ జనరల్‌గా గుర్బీర్ గ్రేవల్

అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్ర అటార్నీ జనరల్‌గా ప్రముఖ భారతీయ - అమెరికన్ న్యాయవాది గుర్బీర్ ఎస్ గ్రేవల్ నియమితులయ్యారు. ఆయన నామినేషన్‌ను సెనేట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అమెరికాలో ఓ రాష్ట్రానికి అటార్నీ జనరల్‌గా నియమితులైన తొలి సిక్కు వ్యక్తి గ్రేవల్.

ఆర్థిక రంగం

డబ్ల్యూఈఎఫ్ తయారీ సూచీ

ప్రపంచ తయారీ సూచీలో భారత్ 30వ స్థానాన్ని పొందింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఈ సూచీని రూపొందించింది. ఇందులో జపాన్‌కు అగ్రస్థానం దక్కగా.. దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్‌లకు రెండు, మూడు, నాలుగు ర్యాంకులు లభించాయి. చైనా 5వ స్థానంలో ఉంది. చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఐర్లాండులు తొలి 10 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.

2020 - 22 నాటికి 7.3 శాతం జీడీపీ వృద్ధి రేటు

భారత్ 2020 - 22కల్లా సగటున 7.3 శాతం జీడీపీ వృద్ధి రేటును సాధించగలుగుతుందని అంతర్జాతీయ ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. మధ్యకాలికంగా ఇండియా వృద్ధి పటిష్ఠంగా ఉండగలదని, 2018 నుంచి ప్రైవేటు మూలధన పెట్టుబడుల పెరుగుదల మొదలవుతుందని, దాంతో ఉత్పాదక వృద్ధిని క్రమేపీ సాధించగలుగుతుందని మోర్గాన్‌స్టాన్లీ తాజాగా విడుదల చేసిన నివేదికలో వివరించింది.

2018లో భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో రికవరీ అవుతుందని, 2016లో 6.4 శాతం ఉన్న జీడీపీ వృద్ధి రేటు 2017లో 7.5 శాతానికి, 2018లో 7.7 శాతానికి పెరుగుతుందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

జాతీయం

అగ్ని - 5 చివరి టెస్ట్ సక్సెస్



దూరశ్రేణి లక్ష్యాలను ఛేదించగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత్ జనవరి 18న విజయవంతంగా పరీక్షించింది. ఒడిషాలోని అబ్దుల్ కలాం పరీక్షా కేంద్రం నుంచి ఈ అణు వార్‌హెడ్ ఉన్న మిసైల్‌ను మొబైల్ లాంచర్ నుంచి ప్రయోగించింది. దాని గమనాన్ని రాడార్ల ద్వారా పరిశీలించింది. ఇది 5880 కిలోమీటర్ల దూరంలోని అన్ని టార్గెట్లనూ సూటిగా తాకగలదు. 50 వేల కిలోల బరువున్న ఈ క్షిపణి- చైనా తూర్పు ప్రాంత నగరాలన్నింటినీ చేరుకోగలదు. అగ్ని-5ను పరీక్షించడం 2012 నుంచి ఇది ఐదోసారి. అన్ని పరీక్షలూ విజయవంతమయ్యాయి. దేశ ఆయుధాల అమ్ముల పొదిలో అగ్ని క్షిపణి రెండు మూడేళ్లలో చేరుతుంది.

నెతన్యాహు భారత్ పర్యటన

ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు జనవరి 14 నుంచి 19 వరకు భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా చమురు, సహజవాయువు, పునరుత్పాదక ఇంధనం, సైబర్ భద్రత, తదితర రంగాలపై ఇరు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. నెతన్యాహు తన పర్యటనలో సెంట్రల్ ఢిల్లీలోని తీన్ మూర్తి చౌక్ మెమోరియల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ చౌక్ పేరును అధికారికంగా తీన్ మూర్తి హైఫా చౌక్‌గా మార్చారు. తీన్‌మూర్తి చౌక్‌లోని మూడు కాంస్య విగ్రహాలు.. '15వ ఇంపీరియల్ సర్వీస్ బ్రిగేడ్'కు చెందిన హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్ సైనికులకు ప్రతీక.

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో సెప్టెంబర్ 23, 1918న ఇజ్రాయిల్‌లోని హైఫా నగరానికి ఒట్టోమాన్, జర్మనీ బలగాల నుంచి ఈ బ్రిగేడ్ విముక్తి కల్పించింది. ఆగ్రాలోని తాజ్‌మహల్, సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. అహ్మదాబాద్ సమీపంలోని డియో ధోలెరా గ్రామంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో కలిసి మోదీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ కేంద్రా న్ని జాతికి అంకితం చేశారు. దీన్నే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ టెక్నాలజీ (ఐక్రియేట్) అని పిలుస్తున్నారు. ముంబైలో కూడా నెతన్యాహు పర్యటిం చారు. 15 ఏళ్ల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని ఒకరు భారత్‌ను సందర్శించారు. 2003లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరన్ భారత్‌లో పర్యటించారు.

సుఖోయ్‌లో ప్రయాణించిన సీతారామన్



రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జనవరి 17న సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానంలో ప్రయాణించారు. రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ ఎయిర్‌బేస్‌లో ఐఏఎఫ్ పైలెట్‌తో కలిసి 45 నిమిషాల సేపు ఆకాశంలో విహరించారు. దీంతో సుఖోయ్‌లో ప్రయాణించిన తొలి మహిళా రక్షణ మంత్రిగా ఆమె చరిత్ర సృష్టించారు. సీతారామన్ కంటే ముందు మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలామ్ 2003లో, ప్రతిభా పాటిల్ 2009లో సుఖోయ్‌లో ప్రయాణించారు. సీతారామన్ కంటే ముందు 2003లో అప్పటి రక్షణమంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ సుఖోయ్-30 విమానంలో విహరించారు.

హజ్ రాయితీ రద్దు

హజ్ యాత్రలో భాగంగా మక్కాకు వెళ్లేవారికి ఇచ్చే రాయితీని రద్దు చేస్తున్నట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ జనవరి 16న తెలిపారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో దేశంలోని 1.75 లక్షల మంది ముస్లింలు హజ్ యాత్రలో పాల్గొననున్నారు. గతేడాది హజ్ రాయితీలకు ప్రభుత్వం రూ.250 కోట్లు వెచ్చించింది. 2012లో జస్టిస్ అఫ్తాబ్ ఆలమ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం 2022లోపు హజ్ రాయితీని ఎత్తివేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

పదేళ్ల వ్యవధిలో రాయితీని క్రమంగా తగ్గిస్తూ పూర్తిగా తీసివేయాలని పేర్కొంది. ప్రతి ముస్లిమూ తమ జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా ఈ యాత్ర చేపట్టాలని ఇస్లాం సూచిస్తోంది. భారత్ నుంచి ఏటా పెద్ద సంఖ్యలో ముస్లింలు హజ్‌లో పాల్గొంటుంటారు. వీరికి విమాన టిక్కెట్లు, కొన్ని సౌకర్యాలపై కేంద్రం రాయితీ కల్పిస్తోంది. బ్రిటిష్ కాలం నాటి నుంచే ఇది కొనసాగుతోంది. ఏటా 1.2 లక్షల మందికిపైగా ఈ రాయితీని పొందుతున్నారు.

ఎంపీ ల్యాడ్స్ కాలపరిమితి పెంపు

పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీల్యాడ్స్) గడువును 14వ ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసే వరకు.. అంటే 2020 మార్చి 31 వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 10న నిర్ణయించింది. వచ్చే మూడేళ్లలో ఈ పథకం కింద రూ.11,850 కోట్లను ఖర్చు చేయనున్నారు.



రామచంద్రారెడ్డి ఉప్పుల

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీ

ఇండియన్ నేవీ- ఎడ్యుకేషన్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్, లాజిస్టిక్స్ విభాగంలో పర్మినెంట్ కమిషన్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **38**
- పోస్టులు: ఎస్ఎస్‌సి ఆఫీసర్స్(ఎడ్యుకేషన్) 18, పిసి ఆఫీసర్స్(లాజిసిక్స్) 20 (అవివాహిత పురుషులకు మాత్రమే)
- వయసు: 1994 జనవరి 2 నుంచి 1998 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి
- అర్హత: షార్ట్ సర్వీస్ కమిషన్డ్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్/మ్యాథ్స్/ ఆపరేషనల్ రీసెర్చ్)/ ఎంఏ (ఇంగ్లీష్)/ బీఈ/ బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. పర్మినెంట్ కమిషన్డ్ పోస్టులకు బీఈ/ బీటెక్/ఎంబీఏ లేదా ఐటి విభాగంలో బీఎస్సీ/ సాధారణ బీఎస్సీ/ బికామ్‌తోపాటు పీజీ డిప్లొమా (ఫైనాన్స్/ లాజిస్టిక్స్/ సప్లయి చైన్ మేనేజ్‌మెంట్/ మెటీరియల్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. ఎంసీఏ/ ఎంఎస్సీ (ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే.
- ఎంపిక: మెరిట్, ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ కేంద్రాలు: బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరు, విశాఖపట్నం
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10, 2018.
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

ఫ్రెషర్స్ కోసం గూగుల్ కోర్సులు

గూగుల్.. ఇంటర్నెట్ ప్రపంచాన్ని మకుటం లేని మహారాజుగా ఏలుతున్న సెర్చ్ ఇంజిన్. ఇంటర్నెట్‌లో ఎలాంటి సమాచారం కోసమైనా ముందుగా సెర్చ్ మొదలు పెట్టేది గూగుల్‌తోనే. ఒక క్లిక్‌తో సెకన్ల వ్యవధిలోనే లక్షల పేజీల సమాచారాన్ని అందుబాటులోకి తేవడం గూగుల్ స్టైల్. ప్రస్తుత ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మంచి సాంకేతిక నిపుణులను రూపొందించేందుకు గూగుల్ సిద్ధమైంది. ఐటీ రంగంలో ఉన్నతంగా స్థిరపడాలనుకునే వారి కోసం కొన్ని స్వల్ప వ్యవధి కోర్సులను ప్రారంభించింది. వాటి వివరాలను చూద్దాం..

గూగుల్ టెక్నికల్ సపోర్ట్ ఫండమెంటల్స్

ఈ కోర్సులో టెక్నికల్ సపోర్ట్ ఫండమెంటల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఐటీ సపోర్ట్ స్పెషలిస్ట్ రోల్స్ ఎంట్రీ లెవల్‌గా ఈ కోర్సు ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో బైనరీ సిస్టమ్ పని విధానం, కంప్యూటర్‌ను అసెంబుల్ చేయడం, ఆపరేటింగ్ సిస్టమ్ ఇన్‌స్టాల్, ఇంటర్నెట్, ఐటీ సాఫ్ట్ స్కిల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు.

కోర్సు వ్యవధి: వారానికి 8-10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.

గూగుల్ బిట్స్ అండ్ బైట్స్ ఆఫ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్

కంప్యూటర్ నెట్‌వర్కింగ్‌పై పూర్తి అవగాహన కల్పించే విధంగా ఈ కోర్సుకు రూపకల్పన చేశారు. ఫండమెంటల్స్ నుంచి మోడర్న్ నెట్‌వర్కింగ్ టెక్నాలజీస్, ప్రోటోకాల్స్‌పై అవగాహన కల్పిస్తారు. కోర్సు పూర్తయ్యే నాటికి అభ్యర్థులకు నెట్‌వర్క్ సర్వీసెస్ (డీఎన్ఎస్, డీహెచ్‌సీపీ), ట్రాబుల్ షూటింగ్ టూల్స్, టెక్నిక్స్, స్టాండర్డ్ ప్రోటోకాల్స్ (టీసీపీ / ఐటీ కమ్యూనికేషన్స్) వంటి అంశాలపై సంపూర్ణ పరిజ్ఞానం వస్తుంది.

కోర్సు వ్యవధి: వారానికి 8 - 10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.

గూగుల్ ఆపరేటింగ్ సిస్టమ్ అండ్ యూ: బికమింగ్ ఎ పవర్ యూజర్ సర్టిఫికెట్

ఈ కోర్సులో విండోస్, లినక్స్ వంటి ఆపరేటింగ్ సిస్టమ్స్ సంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా ఇస్తారు. నావిగేట్ ద విండోస్, లినక్స్ ఫైల్ సిస్టమ్స్, సెట్ అప్ యూజర్స్, గ్రూప్స్, పర్మిషన్స్, సిస్టమ్ ప్రాసెస్, సిస్టమ్ లాగ్స్, ట్రబుల్ షూట్ వంటి అంశాలను ఈ కోర్సులో బోధిస్తారు.

కోర్సు వ్యవధి: వారానికి 8-10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.

గూగుల్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్

కంప్యూటర్ సిస్టమ్స్‌ను మెయింటెయిన్ చేసే సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి ఎదురయ్యే సమస్యలు, పరిష్కారాలు తదితరాలపై సంపూర్ణ అవగాహన కల్పించేలా ఈ కోర్సును రూపొందించారు. ఇందులో హార్డ్‌వేర్, వెండర్స్, కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డైరెక్టరీ సర్వీసెస్, బ్యాకప్, రికవరీ వంటి అంశాలను బోధిస్తారు.

కోర్సు వ్యవధి: వారానికి 8-10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.

కోర్స్‌ఎరా ద్వారా ఆన్‌లైన్‌లో

గూగుల్ ఈ కోర్సులను కోర్స్‌ఏరా ద్వారా ఆన్‌లైన్‌లో అందిస్తుంది. ఈ కోర్సులను ఐటీ రంగంలో ప్రవేశించాలనుకునే ఫ్రెషర్స్‌ను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు.

వెబ్‌సైట్: www.coursera.org

గూగుల్ ఐటీ ఆటోమేషన్

ఐటీ రంగంలో ఆటోమేషన్ మేనేజ్‌మెంట్ కాన్సెప్ట్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కోర్సును రూపొందించారు. ఈ కోర్సులో రూబీ లాంగ్వేజ్, బేసిక్ ఆటోమేషన్ స్క్రిప్ట్, రెగ్యులర్ ఎక్స్‌ప్రెషన్స్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా కోడ్‌ను మేనేజ్ చేయడం తదితర అంశాలను బోధిస్తారు. బేసిక్ నెట్‌వర్కింగ్, అడ్మినిస్ట్రేషన్ టాస్క్ వంటి వాటిపై అవగాహన ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

కోర్సు వ్యవధి: వారానికి 8 - 10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.



గూగుల్ ఐటీ సెక్యూరిటీ

వివిధ రకాల ఐటీ సెక్యూరిటీ కాన్సెప్ట్స్‌పై ఈ కోర్సులో అవగాహన కల్పిస్తారు. ఇందులో ఎన్‌క్రిప్షన్ అల్గారిథమ్స్, టెక్నిక్స్, లిమిటేషన్స్, ఆథరైజేషన్ తదితర అంశాలను బోధిస్తారు.

కోర్సు వ్యవధి: వారానికి 8 - 10 గంటలు

రిజిస్ట్రేషన్ ప్రారంభం: జనవరి 23, 2018.



ఎల్‌ఈడీ లైట్లు ఉన్న యూనిఫాం ధరించి కోల్‌కతాలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ట్రాఫిక్ పోలీసు. పోలీసుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పశ్చిమబెంగాల్ సర్కారు ఈ యూనిఫాంలు అందజేసింది. దూరం నుంచే డ్రైవర్లు వారిని గుర్తించేందుకు ఈ ఏర్పాటు చేసింది. ప్రధానంగా శీతాకాలంలోనూ, కాంతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ లైట్ల ద్వారా ట్రాఫిక్ పోలీసులను గుర్తించడం సులువు. ఇప్పటివరకు ఎల్‌ఈడీ లైట్లున్న యూనిఫాంలను వెయ్యిమందికి అందజేసిన ప్రభుత్వం త్వరలో మరో 3 వేల మందికి ఇవ్వనుంది.



వెన్నెల రోజున తెల్లగా!

- అమావాస్యకు గోధుమ వర్ణం
- సోమారామంలో లింగం ప్రత్యేకత



పున్నమి వేళ నింగి మెరుస్తుంది. నేలంతా వెన్నెల పరుచుకుంటుంది. ఆ తర్వాత ఒక్కో రోజు గడిచి అమావాస్యకు దగ్గరయ్యే కొద్దీ చంద్రుడు చిన్నబోతాడు! అచ్చం అలాగే... ఆ శివలింగం పున్నమి రోజున ధవళ వర్ణం దాల్చుతుంది. అమావాస్య వచ్చేకొద్దీ... వర్ణం మారుతూ గోధుమ రంగుకు చేరుతుంది. ఇదో వింత! దీనిని చూడాలంటే... పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సోమేశ్వర జనార్దన స్వామి ఆలయానికి వెళ్లాల్సిందే. ఇది... పంచారామాల్లో ఒకటి. సోమేశ్వర లింగం అమావాస్య, పౌర్ణమి సమయాల్లో వర్ణాలను మార్చుకుంటుంది. ఇక్కడి శివలింగాన్ని స్వయంగా చంద్రుడు ప్రతిష్ఠించినట్లు స్థల పురాణం చెబుతోంది.

ని-దర్శనం Nidarshanam

తారకాసురుడిని వధించి, ఆత్మలింగాన్ని ఛేదించిన తర్వాత భీమవరంలో పడిన ఒక ముక్కను స్వయంగా చంద్రుడే లింగాకారంగా ప్రతిష్ఠించాడని చెబుతారు. ఇక్కడి శివలింగం కూడా అచ్చం చంద్రుడిలాగానే వెన్నెల సమయంలో మెరిసిపోవడం... అమావాస్య నాటికి వన్నె తగ్గడం కనిపిస్తుంది. పౌర్ణమి రోజుల్లో సోమేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలో మరో ప్రత్యేకత కూడా ఉంది. శివాలయాల్లో ఎక్కడా లేని విధంగా సోమేశ్వరాలయం గర్భగుడి పైభాగంలో అన్నపూర్ణా దేవి ఆలయం ఉంటుంది. ఆలయం ఎదుట ఉన్న సోమ గుండం అనే కోనేరు ఉంది. ఇక్కడి నంది నుంచి నేరుగా సోమేశ్వరశివలింగం కనిపించేలా నిర్మాణం సాగింది.

– భీమవరం

25%


సైన్స్, ఇంజనీరింగ్ పట్టాలు మనవే

- పరిశోధనల్లో మాత్రం వెనుకబాటు.. అమెరికాను తలదన్నేలా దూసుకుపోతున్న చైనా
- 'అన్యువల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఇండికేటర్స్-2018 నివేదికలో వెల్లడి



భారత్‌లోని యువతను కదిలిస్తే చాలు.. పదిమందిలో కనీసం ఏడుగురు 'నాకు సైన్స్ డిగ్రీ ఉంది.. నాకు ఇంజనీరింగ్ పట్టా ఉంది' అంటున్నారు. గత పదేళ్ల కాలంలో బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పట్టభద్రుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఎంతలా అంటే.. ప్రపంచంలోనే సైన్స్, ఇంజనీరింగ్ విభాగంలో అత్యధికంగా పట్టాలు అందుకుంటున్నవారు భారతీయులే! 'అన్యువల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఇండికేటర్స్-2018' నివేదిక చెప్పిన అక్షర సత్యమిది. 2014లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం75లక్షల మంది డిగ్రీలు అందుకోగా.. వారిలో 25 శాతం(దాదాపు 18,75,000)భారత విద్యార్థులవేనని నివేదిక తెలిపింది. అయితే, పరిశోధనా రంగంలో మాత్రం మనం వెనుకబడి ఉన్నామని వెల్లడించింది. ఇక, 2014లో ఈ రెండు రంగాల్లో అమెరికాలో 40వేల మంది డాక్టరేట్లు అందుకోగా, చైనాలో 34వేలు, రష్యాలో 19వేలు, జర్మనీలో 15వేలు, యూకేలో 14వేలు, భారత్‌లో 13వేల మంది డాక్టరేట్ పట్టాలు పొందారని పేర్కొంది. మరోవైపు, 2015లో పరిశోధన, అభివృద్ధి రంగాలకు అమెరికా అత్యధికంగా రూ. 31లక్షల కోట్లు, చైనా రూ.26లక్షల కోట్లు ఖర్చు చేశాయి.

దేశాల వారీగా 2014లో డిగ్రీలు పొందినవారు



కొన్ని ముఖ్యాంశాలు..

- పరిశోధనా రంగంలో అమెరికానే టాప్
- పరిశోధనల్లో అసాధారణ వేగంతో దూసుకుపోతున్న చైనా
- త్వరలోనే అమెరికాను మించిపోయే అవకాశం
- చైనాలోని మొత్తం డిగ్రీల్లో సగం సైన్స్, ఇంజనీరింగ్ విభాగానికి చెందినవే
- 18ఏళ్లలో ఆ దేశంలో రెండు రంగాల్లో పట్టాలు అందుకుంటున్న వారి సంఖ్య 300శాతం పెరిగింది.

గుండెలన్నీ బీడు

- 2050 నాటికి భూమిపై నాలుగోవంతు కరువు

'భూతాపం సవాల్ విసురుతోంది. భవిష్యత్తులో ప్రపంచ ఉష్ణోగ్రతలు సగటున రెండు డిగ్రీల సెల్సియస్ పెరిగితే.. నాలుగోవంతు భూమి బీడుగా మారే ప్రమాదం పొంచివుంది. భూతాపంతో కరవు విలయ తాండవం చేస్తుంది. కాలిఫోర్నియా తరహాలో కార్చిచ్చు అనేక ప్రాంతాలకు వ్యాపిస్తుంది.' అని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా, సదరన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ప్రపంచ దేశాలను హెచ్చరిస్తున్నారు. రానున్న కాలంలో ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల నుంచి 2 డిగ్రీలు పెరిగితే భూమి శుష్కీభవిస్తుందని తెలిపారు. 25% భూమి ఎండిపోయి.. జీవ వైవిధ్యానికి కూడా భూతాపం శాపంగా మారుతుందని వెల్లడించారు. 'మా అంచనా ప్రకారం.. ఉష్ణోగ్రతలు సగటున 1.5 నుంచి 2 డిగ్రీలు పెరిగితే..20 నుంచి 30% నేల ఎండిపోయి బీడుగా మారుతుంది. భూమిపై 25శాతం కరువు తాండవిస్తుంది' అని యూఏఈకి చెందిన ప్రొఫెసర్ టిమ్ అబ్బర్న్ పేర్కొన్నారు. 2050 నాటికి భూ ఉష్ణోగ్రతలు సగటున 2 శాతం పెరుగుతాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూతాపానికి తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రాంతాలు

ఆసియా; దక్షిణఐరోపా; మధ్యఅమెరికా; దక్షిణఆస్ట్రేలియా



ఐస్ ఐస్ పుతిన్..

మోదీ బాటలో రష్యా అధినేత.. మతం వలలో ఓట్ల వేట

క్రిస్టియన్లకు గాలం- జీసస్ క్రైస్తవుడైన వేళ మంచు సరస్సులో మునక

చూస్తుంటే- చాలా దేశాల్లో నేతాగణం మతం వల విసిరి ఓట్లను రాబట్టుకునే ప్రయత్నాలు సాగిస్తున్నట్లే కనిపిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్- శరీరం గడ్డకట్టే శీతవేళ- మంచు సరస్సులో స్నానం చేయడం దీనికి తాజా ఉదాహరణ. ఏసు క్రీస్తు- క్రైస్తవాన్ని స్వీకరించిన రోజును స్మరిస్తూ- క్రిస్టియన్లు ఏటా చేసే పుణ్యస్నానం -ఎపిఫనీని పుతిన్- చాలా భక్తి శ్రద్ధలతో ఆచరించారు. మాస్కోకు 250 మైళ్ల దూరంలో -లెనిన్‌గ్రాడ్ వద్ద సుదూరంగా ఉన్న సెలిజర్ సరస్సులో ఆయన మునక వేశారు. ఉలెన్ కోటును, బూట్లను విప్పేసి- పైబట్టలన్నీ తీసేసి- అర్ధనగ్నంగా అందులో పుణ్యస్నానమాచరించారు. ఆ సమయంలో ఉష్ణోగ్రత మైనస్ 6 డిగ్రీల సెల్సియస్. 65 సంవత్సరాల వయసులో- శారీరంగా దృఢంగా ఉన్న పుతిన్- ఏ మాత్రం వణుకు లేకుండా- తొణక్కుండా బెణక్కుండా- ఎపిఫనీ చేయడం విశేషం. వారం రోజుల పాటు ఎపిఫనీ కార్యక్రమం జరుగుతుంది. ఈ స్నానమాచరిస్తే శరీరం మనసు శుద్ధి అవుతాయి..అని సంప్రదాయవాదులు విశ్వసిస్తారు. రష్యాలో ఈ మార్చి 18న అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. నిజానికి దేశవ్యాప్తంగా పుతిన్ హవా దాదాపుగా ఏమీ లేదనే చెప్పాలి. అవినీతి ఆరోపణలు, ఆర్థిక రంగ వైఫల్యాలు, ప్రగతి మందగించడం.. ఇవన్నీ పుతిన్ పాపులారిటీని పూర్తిగా దిగజార్చాయి. రష్యన్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న విషయం అనేక సర్వేల్లో వెల్లడైంది. దీంతో- ఆయన -ప్రజాకర్షణ పనిలో పడ్డారు. అత్యధిక సంఖ్యలో ఉన్న కేథలిక్ క్రిస్టియన్ ఓటర్లను మంచి చేసుకోడానికి రకరకాల ఫీట్లు చేస్తున్నారు. పుతిన్ తండ్రి నాస్తికుడు.. తల్లి సంప్రదాయ క్రైస్తవ మతస్థురాలు. చిన్ననాటి నుంచి పుతిన్ క్రైస్తవాన్ని గట్టిగా విశ్వసిస్తారు. 2012లో ఆయన నిబద్ధతకు సంతోషపడి బెత్లెహాంలో సంప్రదాయ క్రిస్టియన్ పద్ధతుల్లో సన్మానం కూడా చేశారు. 1999 నుంచి అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ- ఇన్నేళ్లలో ఎన్నడూ ఆయన మత రాజకీయాలకు పాల్పడలేదు. ఇపుడు దేశమంతా తిరుగుతున్నారు. వీలైనప్పుడల్లా క్రిస్టియన్ మోనాస్ట్రీలకు వెళుతున్నారు. క్రైస్తవంపై అపుడపుడూ ఉపన్యాసాలు కూడా చేస్తున్నారు. పుతిన్‌కు ఉన్న ఒక అడ్వాంటేజి ఏంటంటే- సచ్చరిత్ర ఉన్న గట్టి ప్రత్యర్థులు లేకపోవడం. ఉన్న ఒకే ఒక యువ నేత అలెక్సీ నవల్నీ- ఓ క్రిమినల్ కేసులో ఇరుక్కుని పోటీ చేసే అర్హత కోల్పోయారు. లిబరల్ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన వ్లాదిమిర్ జిరినోవ్‌స్కీ గత ఇరవయ్యేళ్లుగా పోటీ పడుతున్నా అదృష్టం వరించట్లేదు. యాబ్లొకొ పార్టీకి చెందిన గ్రిగరీ యవ్‌లీన్‌స్కీ మరో పోటీదారు. అయితే పావెల్ గ్రడినిన్ అనే యువ రైతు మాత్రం ఈసారి రష్యన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నవల్నీ పై నిషేధం వేటు పడడంతో గ్రడనిన్ బలంగా ముందుకొచ్చారు. స్ట్రాబెర్రీ పళ్ల తోటలున్న గ్రడనిన్ సూటిగా, ధాటిగా మాట్లాడే నేర్పు ఉన్నవాడు, యువకుడు. ఇందరు ఉన్నా- విజయం మాత్రం పుతిన్ దే. ఆయనకు 82 శాతం ఓట్లు పడొచ్చని ఓ సర్వేలో వెల్లడైంది. అంటే 2024 వరకూ పుతినే రష్యా అధినేత.





పిల్లల చదువుకు కొండను తవ్వాడు!

- 8 కి.మీ. రహదారి నిర్మాణం.. రెండేళ్లు శ్రమించిన ఒడిసా 'మాంఝి'!


బిహార్ మాంఝీ గుర్తున్నాడా...? 'పర్వత మనిషి'గా పేరుపొందిన దశరథ్ మాంఝీ రెండు జిల్లాల మధ్య 42 కి.మీ. దూరాన్ని తగ్గించేందుకు అడ్డుగా ఉన్న కొండనే తవ్వేశాడు! 360 అడుగుల రోడ్డును నిర్మించేందుకు ఏకంగా 22 ఏళ్లపాటు ఒక్కడే శ్రమించాడు! తాజాగా ఒడిసాలోనూ మరో మాంఝి తెరపైకి వచ్చాడు. కాంధమాల్ జిల్లాలోని కుగ్రామం గుమ్సాహికి చెందిన జలంధర్ నాయక్(45) పిల్లలు బడికి వెళ్లేందుకు వీలుగా కొండల్లో ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఎనిమిది కిలోమీటర్ల రహదారిని నిర్మించాడు! కూరగాయలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకునే నాయక్.. రోజుకు ఎనిమిది గంటల చొప్పున రెండేళ్ల పాటు శ్రమించి ఈ రహదారిని నిర్మించాడు. అంతేకాదు మరో 7 కి.మీ. కూడా నిర్మిస్తానంటున్నాడు! 'మా ఊళ్లో స్కూలు లేదు. అంగన్‌వాడీ కేంద్రం లేదు. ఆస్పత్రి కూడా లేదు. మా ఆవిడ గర్భవతిగా ఉన్నప్పుడు మూడు కిలోమీటర్లు డోలీలో మోసుకెళ్లా. పట్టణానికి వెళ్లాలంటే కొండకోనల్లో క్లిష్టమైన దారిలో నడిచి వెళ్లాలి. అందుకే రోడ్డు నిర్మించాలని నిర్ణయించా' అని నాయక్ చెప్పాడు. స్థానిక పత్రికల ద్వారా విషయం తెలుసుకున్న కలెక్టర్ బృంద అతన్ని తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. నాయక్ పనిచేసిన రోజులన్నింటికీ ఉపాధి హామీ పథకం కింద కూలీ చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అయితే బ్లాక్ అభివృద్ధి అధికారి ఎస్‌కే జెనా మాత్రం.. నాయక్ మారుమూల ప్రాంతంలో నివసిస్తున్నాడని, సమీప పట్టణానికి రమ్మంటే రావడం లేదని తెలిపారు. గుమ్సాహి గ్రామంలో నాయక్ కుటుంబం ఒక్కటే జీవించడం గమనార్హం. రోడ్డు సహా ఇతర సౌకర్యాలేవీ లేకపోవడంతో చాలా కాలం కిందటే ఇతర కుటుంబాల వారంతా గ్రామాన్ని వదిలి వెళ్లిపోయారు.



కేప్‌టౌన్‌లో నీళ్లు బంద్

ప్రపంచంలో నీళ్లు ఖాళీ అయిన తొలి నగరం

నీళ్లకు దగ్గరగా చుట్టాలకు దూరంగా ఉండమని సామెత! నదీ తీరాలు, నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో గొప్ప నాగరికతలు విలసిల్లాయి. సముద్ర తీరాల్లో మహా నగరాలు ఏర్పడ్డాయి. కానీ కాలానుగుణంగా ప్రపంచంలోని అనేక నగరాల్లో నీటి నిల్వలు అడుగంటిపోతున్నాయి. గుక్కెడు నీళ్ల కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. దక్షిణాఫ్రికాలోని రెండో అతిపెద్ద నగరమైన కేప్‌టౌన్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రపంచంలో నీళ్లు ఖాళీ అయిన మొదటి ప్రధాన నగరంగా కేప్‌టౌన్ మిగిలింది. పోర్ట్ సిటీ అంతటా కుళాయిలు బంద్ అయ్యాయి. 'నీటి వాడకంపై కోటా అమల్లో ఉంది' అన్న బోర్డులు నగరమంతా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి వ్యక్తీ రోజుకు 87 లీటర్లకు మించి నీరు వాడకూడదని పరిమితి విధించారు. అలాగే నగరవాసులకు రోజుకి 500 మిలియన్ లీటర్లకు మించి నీరు సరఫరా చేయలేమని నగర పాలక సంస్థ చేతులెత్తేసింది. 'గత మూడేళ్లుగా కరవు తాండవిస్తోంది. ఏప్రిల్ 21 వరకూ మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి' అని కేప్‌టౌన్ మెట్రోపాలిటన్ మునిసిపాలిటీ స్పష్టం చేసింది. నగరానికి నీటిని సరఫరా చేసే డ్యామ్‌లు అడుగంటిపోయాయి. ఆనకట్టలో నీటి స్థాయి 28.1శాతానికి పడిపోయింది. ఇందులో చివర పది శాతం నీరు తాగడానికి ఏమాత్రం పనికిరాదు. అంటే డ్యామ్‌లో ఉపయోగించదగిన నీటి స్థాయి 18శాతం మాత్రమే అన్నమాట! స్నానాలు, తోటలు తడపడం, స్విమ్మింగ్‌పూల్స్‌లో నీళ్లు నింపడం ఆపాలని ప్రభుత్వ వర్గాలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే ఎంత చెబుతున్నా.. కేవలం 39శాతం మంది పౌరులు మాత్రమే ఈ సూచనలు పాటిస్తున్నారు. ఇవి పాటించని వారికి బిల్లుల బాదుడు తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఏం చేసినా..ఏప్రిల్ 21 తర్వాత కేప్‌టౌన్‌కి నీటి సరఫరా ఎలా? అన్న అంశం ఆందోళన కల్గిస్తోంది.





పది నిమిషాలు.. 30 మార్కులు


- మీ మెంటల్ ఫిట్‌నెస్ స్కోరు ఎంత?
- 2005 నుంచి ప్రామాణికంగా మారిన 'మోకా' టెస్ట్
- అమెరికా అధ్యక్షుడు ఎదుర్కొన్న పరీక్ష ఇదే!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను సుస్థిరమైన మేధావినని చెప్పుకుంటారు. ఆయన మాటలకు బలాన్నిస్తూ..ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉందని వైట్‌హౌస్ మెడికల్ యూనిట్ చీఫ్ జాక్సన్ రిపోర్టు ఇచ్చారు. అభిజ్ఞాన అంచనా పరీక్షలో ట్రంప్ 30కి 30 మార్కులు తెచ్చుకున్నారని వెల్లడించారు. ట్రంప్ మెంటల్ ఫిట్‌నెస్‌పై అమెరికాలో అనేక మంది మానసిక వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఆయనకు శారీరక పరీక్షలతోబాటు జ్ఞాన సామర్థ్య పరీక్షలు కూడా నిర్వహించారు. శారీరకంగా, మానసికంగా ఆయన ఫిట్‌గా ఉన్నారని వైట్‌హౌస్ డాక్టర్ సర్టిఫై చేశారు. ఇంతకీ అభిజ్ఞాన అంచనా పరీక్ష అంటే ఏమిటి? ఒక వ్యక్తి జ్ఞాన సామర్థ్యాన్ని అంచనా వేయడానికి మాంట్రియల్ కాగ్నిటివ్ ఎసెస్‌మెంట్(మోకా) టెస్ట్ నిర్వహిస్తారు. 30 మార్కుల ఈ స్క్రీనింగ్ టెస్ట్‌ను పది నిమిషాల్లో పూర్తిచేయాలి. అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యలున్నవారు ఈ టెస్ట్‌ను పూర్తి చేయలేరు. 1996లో జియాద్ నస్రెద్దీన్ సృష్టించిన ఈ పరీక్షను 2005 నుంచి ప్రపంచమంతా నిర్వహిస్తున్నారు. మెదడు పనితీరును అంచనా వేయడానికి ఈ ప్రశ్నావళిని ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. దీని ద్వారా ఎవరికివారు తమ జ్ఞాన సామర్థ్యాన్ని అంచనా వేసుకోవచ్చు. ఈ ప్రశ్నావళి సాయంతో మీ మెంటల్ ఫిట్‌నెస్ స్కోరును చెక్ చేసుకోవచ్చు. ఈ పరీక్షలో 16 మార్కుల కంటే తక్కువ వస్తే అల్జీమర్స్‌తో బాధపడుతున్నట్టు నిర్ధారిస్తారు. 22 మార్కులు వస్తే మెదడు పనితీరు బలహీనంగా ఉన్నట్టు భావిస్తారు. 26కంటే ఎక్కువ మార్కులు వస్తే జ్ఞాన సామర్థ్యం సాధారణంగా ఉందనీ, 30కి 30 మార్కులు వస్తే ఏ లోపం లేదని గుర్తించాలి.

జ్ఞాన సామర్థ్య పరీక్ష

పేరు :
చదువు :
స్త్రీ/పురుషుడు :
పుట్టినతేదీ :
తేదీ :



నిమ్మ రైతుల కన్నీటి చెమ్మ!

కొద్ది రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో టామాటా, వంకాయకు కనీస గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపై పారబోసిన దృశ్యాలను చూశాం. ఇప్పుడు నిమ్మరైతుల వంతు వచ్చింది. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రమారమి 20 వేల ఎకరాల్లో నిమ్మ తోటలు సాగులో ఉండగా కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లో నిమ్మకాయల ధర దారుణంగా పడిపోయింది. గత ఏడాది కిలో రూ. 30 పలకగా, ఇప్పుడు రూ. 2 నుంచి రూ.4కు మించి లభించడం లేదు. కాస్త నాణ్యత ఉన్నవాటిని మినహాయిస్తే.. ఒక మాదిరి ఉన్న 50 కిలోల బస్తాను వ్యాపారులు కేవలం రూ. 100కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరా సాగుకు అన్ని ఖర్చులూ కలిపి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం ఐదు వేలు కూడా వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. కనిగిరి నుంచి బెంగళూరు, అహ్మదాబాద్, ముంబై, చెన్నై మార్కెట్‌లకు పది రోజులుగా ఎగుమతులు నిలిచిపోవడంతో.. రైతులు కాయలను చెట్లకే వదిలేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

- కనిగిరి



టమాటాలు ఫ్రీ!

వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన టమాటాలకు మార్కెట్లో గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారు. దళారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారు. చేలలో పంట తీసిన కూలీలకూ డబ్బులివ్వలేని స్థితిలో పడిపోయారు. మార్కెట్‌లో కమీషన్, రవాణా చార్జీలకు సైతం చేతిచమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రాప్తాడు మండలం పాలచెర్లకు చెందిన ఓ రైతు టమాటాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తూ కనిపించాడు. అనంతపురం నగర శివార్లలోని రుద్రంపేట, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డుపై.. తన ట్రాక్టర్‌లో టమాటాలను తీసుకొచ్చి పంచిపెట్టేశాడు. దీన్నిబట్టి టమాటా రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

-అనంతపురం రూరల్





కోల్‌కతాలో అవార్డు అందుకుంటున్న వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్

ఏపీ అగ్రికి ఎక్స్‌లెన్స్ అవార్డు

ఆధార్ ఆధారిత విత్తన పంపిణీకి జాతీయ పురస్కారం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖకు జాతీయ స్థాయిలో సీఎస్ఐ- నిహిలెంట్ ఈ-గవర్నెన్స్ ఎక్స్‌లెన్స్ 2016-17 అవార్డు లభించింది. రాష్ట్రంలో ఆధార్ ఆధారిత విత్తన పంపిణీ విధానాన్ని బెస్ట్ ఈ-గవర్నెన్స్ ప్రాజెక్ట్‌గా గుర్తించిన కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) ఈ అవార్డును ప్రదానం చేసింది. కోల్‌కతా సైన్స్ సిటీలో శనివారం జరిగిన సీఎస్ఐ 52వ వార్షికోత్సవంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిజవహర్‌లాల్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ...రైతుకు పైసా ఖర్చు లేకుండా, ఆఫీసుల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నామని తెలిపారు.

ఆర్టీజీకి కలామ్ ఇన్నోవేషన్ అవార్డు

ఢిల్లీలో అందుకున్న సీఈవో బాబు



అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ వినూత్న ఆవిష్కరణ రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ)కి అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అవార్డు దక్కింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీజీ సీఈవో అహ్మద్ బాబు అవార్డును అందుకున్నారు. కాగా, ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కుమార్‌లు ఆర్టీజీ అద్భుతంగా ఉందని మెచ్చుకున్న సంగతి తెలిసిందే.

రంగనాథానికి జీవన సాఫల్య పురస్కారం



అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీల్లో చేసిన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వ ఇంధన, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖల సలహాదారు కె.రంగనాథంను రాష్ట్ర ప్రభుత్వం జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. అమరావతిలో ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో ఆయనకు ఈ అవార్డు అందజేయనుంది. లోటు విద్యుత్‌తో సతమతమైన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా మారిందంటే ప్రభుత్వ ప్రజానుకూల విధానాలకు తోడు రంగనాథం వంటివారి సేవలే కారణమని ముఖ్యమంత్రి కొనియాడారు.

తెలంగాణలో నేటి నుంచి పవన్ టూర్

కొండగట్టులో 3 రోజుల యాత్రకు శ్రీకారం

రేపు కరీంనగర్, ఎల్లుండి ఖమ్మంలో పర్యటన



ఆదివారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో పోలండ్ ప్రతినిధులతో కలిసి పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నాలెజనోవా ప్రార్థనలు

హైదరాబాద్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలంగాణ నుంచి తన రాజకీయ యాత్రను ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు తాను వెళ్తున్నట్లు ఆయన ప్రకటించారు. స్వామివారిని దర్శించుకున్నాక.. అక్కడి నుంచే ఆయన మూడు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. జనసేన మీడియా విభాగం అందించిన సమాచారం ప్రకారం.. పవన్ సోమవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు కొండగట్టు చేరుకుంటారు. స్వామివారి దర్శనం అనంతరం తన 'చలోరే చలోరే చల్' యాత్ర ప్రణాళికను అక్కడే వెల్లడిస్తారు. సాయంత్రం కరీంనగర్ చేరుకుని పార్టీ ముఖ్య ప్రతినిధులతో సమావేశమవుతారు. 23న ఉదయం 10.45కి కరీంనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జనసేన కార్యకర్తలతో భేటీ అవుతారు. అక్కడి నుంచి కొత్తగూడెం వెళ్లి రాత్రికి బస చేస్తారు. 24న ఉదయం 9.30కి కొత్తగూడెం నుంచి ప్రదర్శనగా బయల్దేరి మధ్యాహ్నం 1.30కి ఖమ్మం చేరుకుని 3 గంటలకు ఎంబీ గార్డెన్స్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. కాగా.. ఆదివారం జనసేన కార్యాలయం వద్ద పవన్ విలేకరులతో మాట్లాడారు.

పవన్ దంపతుల ప్రార్థనలు

ఆదివారం పోలండ్ ప్రతినిధులతో కలిసి పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజనోవా సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం జనసేన కార్యాలయానికి వచ్చిన పోలండ్ ప్రతినిధులకు వారు స్వాగతం పలికారు. పోలండ్ రాయబారి ఆడమ్ బురాకోవస్కీ, ఆయన వెంట వచ్చిన విద్యార్థులతోపాటు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాళ్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. తాను బాగా చదువుకుంటే ప్రొఫెసర్ అయ్యేవాడినని పవన్ చెప్పారు. రష్యన్ భాష, సంప్రదాయాలంటే తనకు గౌరవమని, తన భార్య కూడా రష్యన్ అని చెప్పారు. భారత్ గురించి చెప్పాలని బురాకోవస్కీని కోరగా.. 'సారే జహాసే అచ్ఛా.. హిందుస్థాన్ హమారా' అని ఆయన అన్నారు. సమావేశం ముగింపులో జైహింద్, జైపోలండ్ అని పవన్‌తో కలిసి నినదించారు.

పందెంరాయుళ్లకు.. రాళ్లే!

లక్షల్లో కాస్తే, చిల్లర చేతికి.. నాయకుల జోరుతో బేజారు

కృష్ణాలో తాము ఆడకుండా ఆడించి లాభపడిన నేతలు

బరులపై భారీగా వసూళ్లు.. కర్ణాటక వ్యక్తికి 2కోట్ల నష్టం



విజయవాడ, కాకినాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోడ్‌ 'కోడి' అంది. కత్తి కట్టించుకుని బరిలోకి దిగింది. భోగి రోజు నుంచి మకర సంక్రాంతి వరకు పందెం రాయుళ్లు పిచ్చెక్కిపోయేలా బెట్టింగ్‌లు కాశారు. అంతిమంగా ఎక్కువమంది భారీగా నష్టపోయారు. వీరికి వసతులు కల్పించి, ముమ్మరంగా వసూళ్లు సాగించిన ప్రజాప్రతినిధులు మాత్రం కమీషన్లతో పండిపోయారు. కృష్ణాజిల్లాలో అయితే, నేతలు సాగించిన కమీషన్ల జోరుతో పందెంరాయుళ్లలో చాలామంది చిన్నబోయారు. పెద్ద పందెం కాసి, చిల్లర తీసుకెళ్లారు. ఈ జిల్లాలో ప్రజాప్రతినిధులు ఈసారి బరిలోకి పుంజులను దింపలేదు. కానీ, అంతా తామే అయి 'ఆట' ఆడించి, ఆనందించారు. ముఖ్యంగా పెనమలూరు, గన్నవరం, నూజివీడు, గుడివాడ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందేలకు బరులను తయారు చేయించారు. స్థలాలను ఎంపిక చేసి అక్కడ సకల సదుపాయాలు కల్పించారు. వాహనాల నిలుపుదలకు, గుండాటకు, కోసు ముక్కాటకు, బిర్యానీ పాయింట్లకు...ఇలా ప్రదేశాలను కేటాయించారు. ఈ సౌకర్యాలకుగాను లక్షలాది రూపాయలను కమీషన్లుగా అందుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు నేరుగా బరుల్లో పుంజులను దింపకుండా, సూచనప్రాయంగా పందేలను ప్రారంభించారు. తర్వాత వసూళ్ల కథను చాలా రహస్యంగా నడిపించారు. ఈ పందేల్లో పాల్గొనేందుకు ఎక్కడెక్కడి నుంచో పందెంరాయుళ్లు ఖరీదైన కార్లలో వచ్చారు. బరిలో లక్షలాది రూపాయల బెట్టింగ్‌లు కాశారు. బరులను వేడెక్కించారు. అయితే, వీరిలో చాలామంది భారీగానే నష్టపోయారు. కోడికి పెట్టిన ఖరీదైన దాణా ఖర్చులు కూడా రాలేదని కొంతమంది వాపోయారు. గత పండగపై పెద్ద నోట్ల దెబ్బ పడటంతో అప్పట్లో అంత జోరుగా కోడి పందేలు సాగలేదు. ఈ కారణంగా ఈసారి పందెంరాయుళ్లు రెండు నెలల ముందునుంచే కసరత్తు ప్రారంభించారు. డబ్బుకు వెరవకుండా పుంజులను అన్నివిధాల సిద్ధం చేశారు. వీళ్లలో చాలామందికి ఈసారి గట్టి షాకే తగిలింది. గుండాటలు, పందాల్లోనూ వేలాది మంది లక్షల్లో నగదును కోల్పోయారు. దీనికి భిన్నంగా, తూర్పుగోదావరి జిల్లాలో నేతలు సైతం బరిలోకి దిగారు. వారంతా భారీగా లాభపడ్డారు. అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలానికి చెందిన ఓ టీడీపీ నేత రూ.కోటిన్నర వరకు పందెంలో గెలుచుకున్నారు. అయితే ఆ సొమ్మంతా అతనొక్కడికే కాదు. తన మిత్రులు ఆరుగురితో కలిసి సిండికేట్‌గా ఏర్పడి ఆయన పందెం కాశారు. ఈ సిండికేట్ ఒక్క భోగి రోజే వరుసగా 12 పందేల్లో గెలిచి భారీగా సొమ్ము రాబట్టుకుందట! కోనసీమకు చెందిన ఓ ఎమ్మెల్యే తన పేరు బయటకు రాకుండా అనుచరగణంతో పందేలు వేయించినట్లు విస్తృత ప్రచారం జరిగింది. అయితే, ఈ జిల్లాలోనూ చాలా మంది పందెంరాయుళ్లు ఎదురుదెబ్బలు తినడం గమనార్హం. పెద్దాపురం మండలం జి.రాగంపేటకు చెందిన ఓ వ్యక్తి నాలుగు కాసుల బంగారం పందెంలో పెట్టి పోగొట్టుకున్నాడు. కర్ణాటకకు చెందిన ఓ భూస్వామి మురమళ్లలో జరిగిన కోడిపందేలలో పాల్గొన్నాడు. తిరిగి వెళ్లే సమయానికి రూ.2 కోట్లు వరకు ఆయన డబ్బులు పోగొట్టుకున్నారు.

నీట్‌లో ఇన్‌సర్వీస్ పీజీలకు రిజర్వేషన్

దక్షిణ భారత ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్

విజయవాడ/అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నీట్ కోటాలో డిగ్రీ, డిప్లమో ఇన్ సర్వీస్ పీజీలకు జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని దక్షిణ భారత ప్రభుత్వ వైద్యుల సంఘం(సిస్గ్దా) డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడ ఐఎంఏ హాలులో సంఘం నాయకులు భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సిస్గ్దా కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.జయధీర్ మాట్లాడుతూ ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక మార్కులతో పాటు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సర్వీస్ కోటా వైద్యులకు పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించినా, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తిరస్కరించడంతో పాటు రూరల్ రిజర్వేషన్, ఇన్ సర్వీస్ రిజర్వేషన్ ఒకే విధంగా భావిస్తోందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలని, పీజీ నీట్‌లో ఇన్సెంటివ్ మార్కులు కలపాలని, మైనస్ మార్కుల విధానం తొలగించాలని ఆయన కోరారు. అన్నిఅంశాలపై ఇప్పటికే కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రితో మాట్లాడామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లే కనిపించినా పరిణామాలు వేరుగా ఉన్నాయని తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 25న అన్ని ప్రాంతాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయనున్నామని, 31న ఓపీలు బంద్ చేస్తామని ప్రకటించారు.

నీట్ సిలబస్‌లో మార్పులేదు: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, జనవరి21(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యూజీ సిలబస్‌లో మార్పులేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) స్పష్టం చేసింది. 2017 మే 7న పరీక్ష నిర్వహించినప్పుడు ఏ సిలబస్ ఉందో అదే ఉంటుందని.. అందులో ఎటువంటి మార్పులేదని వెల్లడించింది. కొంతకాలంగా నీట్ యూజీ సిలబస్ కొంత మారుతుందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. ఎయిమ్స్, జేపీఎంఈఆర్ మినహా మిగతా మెడికల్ సీట్లు నీట్ ద్వారానే భర్తీ చేస్తారు.

'కృష్ణా'కు మరింత గోదావరి!

వైకుంఠపురం వద్ద ఆనకట్ట

కృష్ణా డెల్టా స్థిరీకరణే లక్ష్యం

సీజనులో డెల్టాకు 4వేల క్యూసెక్కులు

రూ.3500 కోట్లతో ప్రతిపాదన

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు సకాలంలో ఖరీఫ్, రబీ పంటలు సాగయ్యేలా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టింది. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి ఎత్తిపోతల నుంచి సీజన్‌లో 4వేల నుంచి 5వేల క్యూసెక్కుల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు అందించాలని నిర్ణయించింది. వైకుంఠపురం వద్ద ఆనకట్టను నిర్మించడం ద్వారా ఈ జలాలను తరలించాలని భావిస్తున్నారు. దీంతో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతోపాటు భవిష్యత్తులో అమరావతి నగరానికి తాగునీటి సమస్య తలెత్తకుండా నివారించవచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణాడెల్టాకు ఇప్పటికే సుమారు 105 టీఎంసీల గోదావరి జలాలను తరలించి, 13 లక్షల ఎకరాలకు అందిస్తున్నారు. అయితే.. ఈ జలాలు చివరి ఆయకట్టు దాకా పారడం లేదు. దీంతో చివరి ఆయకట్టు భూముల్లో ఖరీఫ్, రబీ పంటలను ఆలస్యంగా వేస్తున్నారు. ఫలితంగా పంట తుఫానుల బారిన పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఎప్పటి నుంచో చెప్తున్నారు. ఖరీఫ్‌ను జూన్‌లో, రబీని జనవరిలో ప్రారంభించేలా చూడాలని అధికారులను పదేపదే ఆదేశిస్తున్నారు. కానీ, పట్టిసీమ ద్వారా చివరి ఆయకట్టుకు సకాలంలో నీరందించలేకపోవడంతో పరిస్థితి మెరుగుపడటం లేదు. దీనిపై తీవ్ర కసరత్తు చేసిన అధికారులు చివరికి ఓ ప్రత్యామ్నాయాన్ని సీఎం ముందు ఉంచారు. చింతపూడి ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాల్వ పరిధిలోని ఆయకట్టుకు ఇస్తే సమస్య దాదాపు పరిష్కారమవుతుందని సూచించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నుంచి ఉన్న కాల్వ ద్వారా గోదావరి జలాలను తరలించి, వైకుంఠపురం సమీపంలో నిర్మించే ఆనకట్ట వద్ద నిల్వ చేయాలని నిర్ణయించారు. అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయనున్నారు. ఈ పథకం కోసం 45 కిలోమీటర్ల మేర భూసేకరణ జరపాల్సి ఉంటుంది. ఆనకట్ట నిర్మాణం, భూసేకరణ, పంపింగ్ వ్యవస్థ కోసం రూ.3500 కోట్ల దాకా వ్యయం అవుతుందని జల వనరుల శాఖ అంచనా వేసింది. శనివారం నాటి కేబినెట్ సమావేశం అనంతరం జల వనరుల శాఖ మంత్రి దేవినేని, ఆ శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. చింతలపూడి ద్వారా నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాల్వ చివరి ఆయకట్టుకు గోదావరి జలాలను అందించే పథకం కార్యాచరణను వీలైనంత వేగంగా అమలు చేయాలని ఆదేశించారు.



అదిగో పులి.. ఇదిగో జింక!

నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల గణన

పక్కాగా లెక్క తేల్చేందుకు అటవీశాఖ సిద్ధం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఆరు రోజులపాటు వన్యప్రాణులు, వన్య మృగాల గణనకు అటవీశాఖ సిద్ధమైంది. నాలుగేళ్లకోసారి దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా సీతంపేట వరకూ వన్యప్రాణుల లెక్క పక్కాగా తేల్చబోతున్నారు. రాష్ట్రంలోని శ్రీశైలం, విశాఖపట్నం, తిరుపతి రీజియన్లలో పులులు, ఏనుగులు, అడవి దున్నలు ఇతరత్రా మృగాలు మొదలుకొని వన్య ప్రాణుల వరకూ లెక్క తీస్తారు. ఈ నెల 22 నుంచి 24 వరకూ క్రూర మృగాలు, మాంసాహార జంతువులను లెక్కిస్తారు. 25 నుంచి 27 వరకు శాఖాహార జంతువులు, వాటి ఆవాసాలు, వృక్షజాతులు, జన సంచారం తదితర వివరాలు సేకరిస్తారు.

పులుల గణనకు 'ఎం-స్ట్రైప్స్'

దేశంలోనే అతిపెద్ద టైగర్ శాంచురీ శ్రీశైలం అటవీ ప్రాంతంలో ఉంది. పశ్చిమబెంగాల్‌లోని సుందర్‌బన్ అటవీ ప్రాంతంలో పులులు ఎక్కువగా ఉన్నా విస్తీర్ణం పరంగా శ్రీశైలం అభయారణ్యమే పెద్దది. ఇక్కడ జింకలు ఎక్కువగా ఉండటంతో పులులకు ఆహారం కొరత ఉండదు. పులుల గణనలో కీలకమైన పాదముద్రల్లో కచ్చితత్వం కోసం నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ప్రత్యేక యాప్‌ను రూపొందించింది.. మానిటరింగ్ సిస్టమ్ ఫర్ టైగర్స్- ఇంటెన్సివ్ పెట్రోలింగ్ అండ్ ఎకొలాజికల్ స్టేటస్(ఎం-స్ట్రైప్స్) పేరుతో విడుదలైన ఈ యాప్‌ను అన్ని రాష్ట్రాలు వినియోగిస్తున్నాయి.

ఫిబ్రవరి 6లోగా జాబితాలు: పీసీసీఎఫ్

ఆరు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అటవీ సర్కిల్ హెడ్స్ పర్యవేక్షించాల్సి ఉంటుందని పీసీసీఎఫ్ మల్లికార్జునరావు తెలిపారు. డీఎఫ్‌వోలు అడవిలోకి వెళ్లి పరిశీలించాలని, అవసరాన్ని బట్టి వాచర్లు, యానిమల్ ట్రాకర్లను తీసుకెళ్లాలని సూచించారు. ఫిబ్రవరి 6లోగా అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి గణన జాబితాలు సమర్పించాలని నిర్దేశించినట్లు పేర్కొన్నారు.

ఇలాగైతే చెంబు చల్లగానే

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని జిల్లాల్లో మరుగుదొడ్డి కట్టకుండానే బిల్లులు చేసుకొన్నారు. పాతదొడ్డికే రంగులేసి కొత్తగా నిర్మించిన వాటి ఖాతాలో కలిపేసుకొన్నారు. వందశాతం ఓడీఎఫ్ ప్రకటించుకొన్న కొన్ని జిల్లాల్లో విజిలెన్స్ జరిపిన తనిఖీల్లో ఇలాంటి అవకతవకలెన్నో బయటపడ్డాయి.

రాష్ట్రంలో మొట్టమొదట నెల్లూరు, ఆ తరువాత పశ్చిమ గోదావరి తమను తాము ఓడీఎఫ్ జిల్లాలుగా ప్రకటించుకున్నాయి. అంటే వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఈ జిల్లాలు పూర్తి చేసుకొన్నాయన్నమాట! నెల్లూరు జిల్లాలో తొలి ఓడీఎఫ్ మండలంగా ఏడాది క్రితం మనుబోలుని అధికారులు ప్రకటించారు. ఈ మండలంలో మొత్తం 841 మరుగుదొడ్లు కట్టినట్టు రికార్డుల్లో ఉండగా, వాటిలో 120 మరుగుదొడ్లకు గోడలు కట్టి వదిలేసినట్టు విజిలెన్స్ పరిశీలనలో ఇటీవల తేలింది. ఒక కుటుంబంలో ముగ్గురుంటే మూడు మరుగుదొడ్లను మంజూరు చేసి, ఒకటే పూర్తిచేసి.. మూడింటి డబ్బులు జేబులో వేసుకొన్నట్టు కూడా తనిఖీల్లో బయటపడింది. ఈ జిల్లాలో ఇంకా 30-40శాతం ఓడీఎఫ్ పనులు మిగిలే ఉన్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ముందుగా తమ జిల్లానే ఓడీఎఫ్‌గా ప్రకటించుకొని, సీఎం ప్రశంసలు పొందాలన్న కలెక్టర్ల అత్యుత్సాహమే దీనికి కారణం అవుతోంది.

సంపూర్ణం.. ఇలా!

రాష్ట్రంలోని 662 మండలాల్లో 248 మండలాలను, 12,854 గ్రామ పంచాయతీలకుగాను 5,920 గ్రామ పంచాయతీలను ఓడీఎఫ్‌గా ప్రకటించారు. మొత్తం 18,942 నివాసిత ప్రాంతాలకుగాను 2015-16లో 349 గ్రామాలు, 2016-17లో 2,808 గ్రామాలు, ఈ ఏడాది 4,462 గ్రామాలతో కలిపి మొత్తం 7,619 గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా అధికారులు డిక్లేర్ చేశారు. వారి లెక్కల ప్రకారం, నెల్లూరు జిల్లాలోని మొత్తం 46 మండలాల్లోను, 937 గ్రామ పంచాయతీలు, 1,253 గ్రామాల్లోను ఓడీఎఫ్ అమలయింది. ఇక.. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 48 మండలాల్లోను, 908 గ్రామ పంచాయతీలు, 1088 గ్రామాల్లోనూ సంపూర్ణ ఓడీఎఫ్ సాధించారు. అయితే, ఈ లెక్కలు క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రశ్నార్థకం అవుతున్నాయి. ఓడీఎఫ్ మండలం అనిపించుకోవాలన్న తొందరలో అధికారులు ఉండగా, ఇదే అదునుగా గ్రామాల్లోని చోటామోటా నాయకులు విజృంభించేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఈ నాయకుల దగ్గర అధికారులు లంచాలు మేసినట్టు విమర్శలొస్తున్నాయి. ఓడీఎఫ్ గ్రామం-లబ్ధిదారుల గుర్తింపు, మరుగుదొడ్డి మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపు దాకా.. అవకతవకలు జరిగినట్టు విజిలెన్స్ పరిశీలనలో బయటపడింది.

సర్.. సిద్ధం

పశ్చిమగోదావరి జిల్లాతో పోలిస్తే నెల్లూరు జిల్లాను ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించడం సాహసమేనని అధికారవర్గాలు అంటున్నాయి. పశ్చిమలో గతంలోనే ఎక్కువ శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. నెల్లూరు జిల్లాలో మాత్రం కొత్తగా కట్టాల్సినవి పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఏమైనా అనుకొన్న లక్ష్యం సాధించాలన్న పట్టుదలతో ఆ జిల్లా కలెక్టర్.. జిల్లా అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో రంగంలోకి దించారు. ఉద్యమరూపంలో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టారు. అధికారులకు రోజువారీ టార్గెట్లు పెట్టి, వారిపై ఒత్తిడి పెంచారు. పెద్ద సంఖ్యలో మరుగుదొడ్ల మంజూరుతోనే తమ పని పూర్తయినట్లు అధికారులు భావించారు. అవి పూర్తయ్యాయా, లేదా అనేది పరిశీలించలేదు. 'సర్! మా మండలం సిద్ధం' అని సదరు ప్రాంత అధికారులు డిక్లరేషన్ ఇవ్వడమే ఆలస్యం.. జిల్లా అధికారులు ఆర్భాటం చేసేశారు. ఈ పద్ధతుల్లో ఏడాది క్రితం నెల్లూరును తొలి ఓడీఎఫ్ జిల్లాగా నిలిపారు. ఈ క్రమంలో ఈ జిల్లాలోని సైదాపురం, గూడూరు, ఉదయగిరి మండలాల్లో చాలా మరుగుదొడ్లలో భారీగా అవినీతి కంపు కొట్టినట్టు విమర్శలొస్తున్నాయి.



ఎక్కడిదక్కడ వదిలేసి..

కడప జిల్లా సుండుపల్లె మండలం యర్రమనేనిపాలెం హరిజనవాడకు చెందిన ఎద్దుల క్రిష్ణయ్యకు కట్టి ఇచ్చిన మరుగుదొడ్డి ఇది. దీనికోసం తవ్విన గుంతలను అలాగే వదిలేశారు. సిమెంటు రింగులను కూడా బయటకు వదిలేశారు. తన నోటికి దడిచి ఈ మాత్రమైనా చేశారని, మిగతా వారికి కనీసం మరుగుదొడ్డి కూడా మంజూరు కాలేదని క్రిష్ణయ్య చెబుతున్నారు.

అందుకు తప్ప..

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయిన కొన్ని చోట్ల.. వాటిని ప్రజలు వేరే అవసరాలకు వాడుతున్నట్టు విజిలెన్స్ పరిశీలనలో బయటపడింది. ఉదాహరణకు, కడపజిల్లాలో చాలా గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించారు. వాటిలో ఎక్కువభాగం స్టోర్‌రూంలుగా మారిపోవడం కనిపించింది. మరికొందరు ఈ గదులను స్నానానికి, ఇతర అవసరాలకు వాడుతున్నారు. సుండుపల్లె మండలం యర్రమనేనిపాలెం గ్రామస్థులు చాలామంది ఇప్పటికీ బహిర్భూమిలోనే కాలకృత్యాలు తీర్చుకొంటున్నారు. ఎందుకని ఆరాతీస్తే.. తమ ఇళ్లకు మరుగుదొడ్లు ఏర్పాటుచేసినా, సెప్టిక్ ట్యాంకుల్లోకి, కాలువల్లోకి కనెక్షన్ ఇవ్వలేదని వాపోయారు. ఈ జిల్లాలోని ఓడీఎఫ్ గ్రామాల్లో యర్రమనేనిపాలెం కూడా ఉంది.

వాప్కోస్ ఔట్!

పోలవరం పర్యవేక్షణ బాధ్యత ఇవ్వనట్టే


అధిక ఫీజు డిమాండ్ చేయడమే కారణం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం పనుల పర్యవేక్షణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వాప్కోస్‌కు అప్పగించాలన్న నిర్ణయాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) దాదాపు ఉపసంహరించుకున్నట్లు సమాచారం. గత ఏడాది డిసెంబరు 5న ఢిల్లీలో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పోలవరం పనులకు థర్డ్‌పార్టీ పర్యవేక్షణ అవసరమని గడ్కరీ పేర్కొన్నారు. ఇందుకు వాప్కోస్ సరైన సంస్థగా సూచించారు. అప్పటికే థర్డ్ పార్టీ పర్యవేక్షణకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం వాప్కోస్ పర్యవేక్షణకు అంగీకరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా గడ్కరీతో ఫోన్లో మాట్లాడి వాప్కోస్ త్వరగా సమగ్ర నివేదికను ఇస్తే.. సేవలను ఉపయోగించుకుంటామని తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన పీపీఏ సమావేశంలో వాప్కోస్ ఇచ్చిన నివేదికపై చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు పనుల పర్యవేక్షణకు కావాల్సిన మానవ వనరులేమిటి? ఫీజు ఎంత? అనే విషయాలపై పీపీఏ ఆరా తీసింది. 3.5 శాతం మాత్రమే తీసుకుంటామని వాప్కోస్ వివరించింది. ప్రస్తుతం పోలవరం పనుల విలువ రూ.4500 కోట్లలో 3.5 శాతం అంటే రూ.157.5 కోట్లు అవుతుందని వివరించింది. దీంతో, పీపీఏ ఆశ్చర్యపోయింది. ఈ సమావేశం ముసాయిదా మినిట్స్‌ను ఇటీవల జల వనరుల శాఖకు పీపీఏ పంపింది. ఈ మినిట్స్‌లో థర్డ్ పార్టీ అంశాన్ని పీపీఏ ప్రస్తావించింది. అయితే, ఇందులో వాప్కోస్ ప్రస్తావన లేదు. దీంతో అధిక ఫీజు కోరినందున వాప్కోస్‌ను పీపీఏ తప్పించి ఉండొచ్చని రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కొసమెరుపేమిటంటే.. వాప్కోస్ నివేదికలో పోలవరం ప్రాజెక్టు కోసం డీపీఆర్‌ను కూడా అందిస్తామని పేర్కొంది. ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టుకు డీపీఆర్ ఇస్తామంటూ వాప్కోస్ పేర్కొనడంపై పీపీఏ సీఈవో హాల్దర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని పీపీఏ సమావేశంలో ప్రస్తావించారు. ప్రాజెక్టు ప్రాథమిక సమాచారం కూడా తెలియని వాప్కోస్‌కు పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వడం సరికాదన్న అభిప్రాయం సమావేశంలో వచ్చినట్లు తెలిసింది.

సెమీస్ దిశగా మరాఠాస్

న్యూఢిల్లీ: ప్రొ.రెజ్లింగ్ లీగ్‌లో వీర్ మరాఠాస్ సెమీఫైనల్‌కు చేరువైంది. ఆదివారం జరిగిన పోరులో 4-2తో ఢిల్లీ సుల్తాన్స్‌పై విజయం సాధించింది. ఆరో, చివరి బౌట్‌లో 2017 వరల్డ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత వాసిలిసా మర్జల్యూక్ (బెలారస్) 6-0తో సమర్ హమ్జా (ఈజిప్ట్)ను చిత్తు చేసి మరాఠాస్‌కు కీలక విజయం అందించింది.



న్యూజిలాండ్ X పాకిస్థాన్

తొలి టీ-20

ఉదయం 8.30 నుంచి

స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ 1 లో...



అమ్మ కోసం..అన్వేషణ

• డచ్ స్కేటర్ అనిస్ యథార్థ గాథ

న్యూఢిల్లీ: ఒకప్పటి సినిమా స్టోరీల్లో మెయిన్ క్యారెక్టర్ చిన్నతనంలోనే కుటుంబానికి దూరం కావడం.. ఎదిగిన తర్వాత తనకు జన్మనిచ్చిన తల్లికోసం వెదకడం.. అనేక మలుపులతో చివరికి కలవడం సక్సెస్‌ఫుల్ ఫార్ములా. అయితే డచ్ స్పీడ్ స్కేటర్ అనిస్ దాస్ స్టోరీ మాత్రం యథార్థం. ముంబైలో పుట్టి నెదర్లాండ్స్‌కు దత్తతకు వెళ్లిన దాస్.. తనకు జన్మనిచ్చిన తల్లి కోసం అన్వేషించనుంది. వచ్చేనెలలో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్ తర్వాత అనిస్.. తన మూలాల కోసం ముంబై రానుంది. 32 ఏళ్ల అనిస్ దాస్.. వింటర్ ఒలింపిక్స్‌లో 500 మీ. రేస్‌కు అర్హత సాధించింది.

కవల సోదరితో కలిసి..: అనిస్, ఆమె సోదరి కవల పిల్లలు. వీరికి 8 నెలల వయసున్నప్పుడు డెన్మార్క్‌కు చెందిన జంట దత్తత తీసుకుని తమతోపాటు తీసుకెళ్లింది. అయితే 5-6 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత వారు తన అసలు అమ్మానాన్న కాదనే విషయం అనిస్‌కు తెలిసింది. దీంతో అప్పటి నుంచి సోదరితో కలసి తమ మూలల కోసం వెదకడం ఆరంభించింది. అయితే వారి ప్రయత్నాలు తిరిగి తిరిగి ఎక్కడ మొదలెట్టారో అక్కడికే వచ్చి ఆగాయి. ఈ సారి మాత్రం జన్మదాతను కలుసుకోవాలనే పట్టుదలతో ఉన్నారీ కవల సోదరీమణులు. 'జన్మనిచ్చిన అమ్మను కలుసుకోవాలని డచ్ టీవీ ద్వారా ప్రయత్నం చేశాం. కానీ ఎలాంటి ప్రయోజనమూ లేకపోయింది. ఒలింపిక్స్ ముగిసిన తర్వాత భారత్‌కు వెళ్లి మా అన్వేషణ కొనసాగిస్తామ'ని అనిస్ చెప్పింది. ముంబైలో తమ మూలాలను వెదకగలమనే ఆశాభావం వ్యక్తం చేసింది. దత్తత తీసుకున్న డచ్ తల్లిదండ్రులు తమను ఎంతో ప్రేమగా చూసుకుంటారని, ఇక సోదరి తన ఆత్మ అని చెప్పింది. వింటర్ ఒలింపిక్స్‌లో పతక ఆశలు పెద్దగా లేకపోయినా.. మెరుగైన వ్యక్తిగత ప్రదర్శనే తన లక్ష్యమని చెప్పింది.

'మంకీ గేట్'లో సచిన్ తీరు సరిగా లేదు

• రెఫరీ మైక్ ప్రోక్టర్ విమర్శ



మైక్ ప్రోక్టర్

న్యూఢిల్లీ: భారత జట్టు 2008 ఆస్ట్రేలియా పర్యటనలో వివాదాస్పదమైన మంకీగేట్ ఉదంతాన్ని క్రికెట్ అభిమానులు అంత సులువుగా మర్చిపోరు. హర్భజన్ సింగ్ తనను మంకీ అని సంబోధించాడని ఆస్ట్రేలియా ఆటగాడు ఆండ్రూ సైమండ్స్ ఫిర్యాదు చేయడంతో జాతి వివక్ష వ్యాఖ్యల కింద భజ్జీపై అప్పట్లో మూడు మ్యాచ్‌ల నిషేధం కూడా పడింది. అయితే ఆ సమయంలో బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నిజం మాట్లాడలేదని అప్పటి సిడ్నీ టెస్టుకు మ్యాచ్ రెఫరీగా వ్యవహరించిన మైక్ ప్రోక్టర్ ఆత్మకథలో రాశాడు. 'కాట్ ఇన్ ది మిడిల్' పేరిట విడుదలైన ఈ పుస్తకంలో దీనికి సంబంధించి పూర్తి వివరాలను పేర్కొన్నాడు. 'సచిన్ తీరు నన్ను నిరాశపరిచింది. నిజానికి భజ్జీ అతడిని మంకీ అని కాకుండా మా..కీ అని తిట్టినట్టు వినిపించిందని ముందే తెలిపితే విషయం వేరేగా ఉండేది. అప్పుడు భజ్జీపై జాతి వివక్ష ఆరోపణలకు ఆస్కారం ఉండేది కాదు. ఆ రెండు పదాలు దూరం నుంచి వినడానికి రెండూ ఒకేలా అనిపిస్తాయి. ప్రాథమిక విచారణలో సచిన్ నిజం చెప్పాల్సింది. అప్పటి జట్టు మేనేజర్ చేతన్ చౌహాన్ కూడా సరైన వాదన వినిపించలేకపోయాడు' అని ప్రోక్టర్ రాసుకొచ్చాడు.

ఉదయం 5.30 నుంచి సోనీ సిక్స్‌లో...

ఫుట్‌బాల్ ఫైటింగ్!

- ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘంలో విభేదాలు
- రెండు గ్రూప్‌లుగా విడిపోయిన కార్యవర్గ సభ్యులు
- ఒకేసారి చెరోచోట అంతర్ జిల్లా సీనియర్ పోటీలు
- చేతులెత్తేసిన శాప్ ఉన్నతాధికారులు

విజయవాడ/విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యవర్గ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. నిన్నమొన్నటి వరకు అంతర్గత పోరుకే పరిమితమైన వివాదాలు అనూహ్యంగా బయటపడ్డాయి. సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి రెండు గ్రూపులుగా విడిపోయారు. ఎవరికివారు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ఫుట్‌బాలర్ల జీవితాలతో ఆటలాడుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ రాష్ట్రంలో వేర్వేరు జిల్లాలో అంతర్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీలు నిర్వహించి తమదే పైచేయి అని చాటుకునే ప్రయత్నాలు చేయడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన కలహాలు రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన కొత్త సంఘంలో పునరావృతం కావడం ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఏపీ ఫుట్‌బాల్ సంఘం ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ తీరును వ్యతిరేకించిన ప్రత్యర్థి వర్గం గత కొన్ని రోజులుగా అంతర్గత పోరుకు దిగింది. ఇరు వర్గాలు ఎవరికి వారు తమ వ్యూహాలతో రాష్ట్రంలోని జిల్లా సంఘాలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేశాయి. ప్రతిష్ఠాత్మక సంతోష్ ట్రోఫీకి రాష్ట్ర జట్టును ఎంపిక చేసే సమయంలో ఎవరికివారు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు పావులు కదిపారు. అంతర్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీని విజయనగరంలో నిర్వహించాలని కొసరాజు గోపాలకృష్ణ అధ్యక్షుడిగా ఉన్న రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. అయితే అనివార్య కారణాల వలన విజయనగరంలో నిర్వహించలేమని అక్కడి జిల్లా సంఘం ప్రతినిధులు చేతులెత్తే




యడంతో పోటీలను విశాఖకు బదలాయించారు. ఇదే సమయంలో అధ్యక్షుడికి వ్యతిరేకంగా డిసెంబరు 10న కార్యదర్శి మలిరెడ్డి శ్రీనివాసులు నెల్లూరులో సమావేశం ఏర్పాటు చేసి జనవరి 2 నుంచి విజయవాడ, మైలవరంలో మరో టోర్నీ నిర్వహించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల సంఖ్య 13 కాగా... ఇరు వర్గాలు విశాఖ, మైలవరంలో నిర్వహించిన పోటీల్లో రెండు చోట్ల పదేసి జిల్లాల జట్లు మాత్రమే ప్రాతినిధ్యం వహించడం గమనించదగ్గ విషయం. ఎవరికివారు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు జిల్లా ప్రధాన జట్లను విడిచిపెట్టి ద్వితీయ, తృతీయ శ్రేణి జట్లతో టోర్నీలను మమ అనిపించారు. అయితే విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీకి శాప్ నుంచి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఫుట్‌బాల్ కోచ్ సుబ్బారావు పర్యవేక్షకుడిగా వ్యవహరించగా మైలవరంలో జరిగిన టోర్నీకి శాప్ నుంచి పర్యవేక్షకులు హాజరుకాలేదని సమాచారం.

చేతులెత్తేసిన శాప్: ఇరువర్గాలు తలో చోట అంతర్ జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించే విషయంపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి (స్పోర్ట్స్) ఎల్వీ సుబ్రహ్మణ్యం వద్ద పంచాయితీ జరిగింది. ఆయన ఇరు వర్గాలను పిలిపించి ఒకే చోట పోటీలు నిర్వహించాలని సూచించినా ఫలితం లేకపోయింది. ఇదిలా ఉంటే మైలవరంలో జరిగిన టోర్నీకి కనీసం ముందస్తు సమాచారమివ్వని నిర్వాహకులు పోటీలు ప్రారంభమైన రెండోరోజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమదే అసలైన అసోసియేషన్ అని, విశాఖలో జరుగుతున్న పోటీలకు తమకు ఎలాంటి సంబంధంలేదని కార్యదర్శి మలిరెడ్డి శ్రీనివాసులు చెప్పారు. టోర్నీకి అధికారిక గుర్తింపు ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

మలిరెడ్డిని కార్యదర్శిగా తొలగించాం: అధ్యక్షుడు కొసరాజు

'మలిరెడ్డి శ్రీనివాసులను గత ఏడాది రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి పదవి నుంచి తొలగించాం. 2015లో కొత్త రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైన తర్వాత నిర్వహించిన ఒక్క సమావేశానికి కూడా ఆయన హాజరుకాకపోవడంతో చర్యలు తీసుకున్నాం. అంతేకాకుండా దీనికి సంబంధించి కోర్టు ద్వారా అనుమతి పొందాం. అలాగే సస్పెండ్ అయిన తర్వాత కొంతమందితో కలిసి అనధికారంగా రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేశారు. ఇది చట్ట విరుద్ధమని చెబుతూ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తీసుకొచ్చాం' అని కొసరాజు చెప్పారు.

మూడో టెస్ట్‌కు రహానె!



జొహాన్నెస్‌బర్గ్: వైస్ కెప్టెన్ అజింక్యా రహానె మూడో టెస్ట్‌లో ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం ఇక్కడ జరిగిన టీమిండియా నెట్స్‌లో కెప్టెన్ కోహ్లీ, హార్దిక్ పాండ్యాలతో కలసి రహానె సాధన చేశాడు. అంతేకాదు మిగతా జట్టంతా ప్రాక్టీస్ చేసి వెళ్లిపోయాక విరాట్, రహానె అదనంగా మరికొంత సమయం సాధన చేశారు. దీంతో ఈనెల 24నుంచి జరిగే చివరి టెస్ట్‌లో అజింక్యా కచ్చితంగా ఆడే అవకాశముంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడు రోజులుగా భగభగమంటున్న భానుడు ఆదివారం విశ్రమించాడు.. దట్టంగా మబ్బులు కమ్మిన వాతావరణంలో ఆటగాళ్లు, ప్రేక్షకులు ఎంతో ఊరట చెందారు.. కానీ స్టార్ ఆటగాళ్లు మాత్రం ప్రత్యర్థులను ఓడించేందుకు స్టేడియంలో తీవ్రంగా చెమటోడ్చారు.. టాప్‌సీడ్ నడాల్‌కు ష్వార్జ్‌మన్ నుంచి గట్టిపోటీ ఎదురైంది..అయినా తన అనుభవాన్నంతా రంగరించి గట్టెక్కిన స్పెయిన్‌బుల్ పదోసారి మెల్‌బోర్న్‌లో క్వార్టర్స్ చేరాడు.. మరోవైపు మహిళల్లో టాప్‌స్టార్లు వోజ్నియాకి, స్విటోలినా, సీనియర్ సురెజ్‌లు క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు.



క్వార్టర్స్‌లో నడాల్

దిమిత్రోవ్, సిలిచ్ ముందంజ • వోజ్నియాకి, స్విటోలినా కూడా




వోజ్నియాకి

మెల్‌బోర్న్: టాప్‌సీడ్ రఫెల్ నడాల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అర్జెంటీనాకు చెందిన 24వ సీడ్ డీగో ష్వార్జ్‌మన్‌తో జరిగిన ప్రీక్వార్టర్స్‌లో వరల్డ్ నంబర్‌వన్ నడాల్ ఒకింత శ్రమించాల్సి వచ్చింది. దాదాపు నాలుగు గంటల పాటు కొనసాగిన పోరులో నడాల్ 6-3, 6-7 (4), 6-3, 6-3తో గెలుపొందాడు. తొలిసెట్‌ను అలవోకగా చేజిక్కించుకున్న నడాల్‌కు రెండోసెట్‌లో ష్వార్జ్‌మన్ నుంచి ప్రతిఘటన ఎదురైంది. టైబ్రేక్‌కు దారితీసిన ఆ సెట్‌ను నడాల్ కోల్పోయాడు. కానీ తర్వాతి రెండు సెట్లలో స్పెయిన్‌బుల్‌దే పైచేయి అయింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నడాల్ క్వార్టర్స్‌కు చేరడం ఇది పదోసారి. స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (11 సార్లు) ముందున్నాడు. క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన నడాల్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ ముగిశాక కూడా నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకోనున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో క్రొయేషియాకు చెందిన మారిన్ సిలిచ్‌తో నడాల్ తలపడతాడు.



సిలిచ్ సెంచరీ: ఆరోసీడ్ సిలిచ్ 6-7 (2), 6-3, 7-6 (0), 7-6 (3)తో పదోసీడ్ కరెనొ బుస్టా (స్పెయిన్)పై నెగ్గాడు. ఈ మ్యాచ్ యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ సిలిచ్‌కు గ్రాండ్‌స్లామ్‌ల్లో 100వ విజయం కావడం విశేషం. మెల్‌బోర్న్ పార్క్‌లో సిలిచ్ క్వార్టర్స్‌కు చేరడం ఇది రెండోసారి. అంతేకాదు..గ్రాండ్‌స్లామ్‌ల్లో 11వసారి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించి సహచరుడు గొరాన్ ఇవాన్‌సెవిచ్ (క్రొయేషియా) రికార్డును సిలిచ్ సమం చేశాడు. బుస్టాతో మ్యాచ్‌లో 20 ఏస్‌లు సంధించిన సిలిచ్ ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. అలాగే 73 విన్నర్లు కొట్టాడు. పురుషుల ఇతర ప్రీక్వార్టర్స్‌లో మూడోసీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 7-6 (3), 7-6 (4), 4-6, 7-6 (4)తో 17వ సీడ్ నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు.



మర్రే తర్వాత ఎడ్మండ్: బ్రిటన్‌కు చెందిన అన్‌సీడెడ్ ప్లేయర్ కైల్ ఎడ్మండ్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ చేరాడు. ఇటలీకి చెందిన ఆండ్రియాస్ సెపితో జరిగిన మ్యాచ్‌లో ఎడ్మండ్ 6-7 (4), 7-5, 6-2, 6-3తో నెగ్గాడు. ఆండీ మర్రే తర్వాత ఇక్కడ క్వార్టర్స్ చేరిన తొలి బ్రిటన్ ఆటగాడిగా ఎడ్మండ్ నిలిచాడు. తదుపరిరౌండ్‌లో దిమిత్రోవ్‌ను ఎడ్మండ్ ఢీకొంటాడు.

వోజ్నియాకి దూకుడు: మహిళల విభాగంలో రెండోసీడ్ కరోలిన్ వోజ్నియాకి (డెన్మార్క్) తొలి గ్రాండ్‌స్లామ్ దిశగా మరో అడుగు ముందుకేసింది. ప్రీక్వార్టర్స్‌లో ఆమె 6-3, 6-0 స్కోరుతో 19వ సీడ్ మగ్దలినా రిబరికోవా (స్లొవేకియా)ను చిత్తుచేసింది. తదుపరి రౌండ్‌లో అనుభవజ్ఞురాలైన సురెజ్ నావారో (స్పెయిన్)తో పోరుకు సిద్ధమైంది. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో సురెజ్ 4-6, 6-4, 8-6 స్కోరుతో 32వ సీడ్ కొంటావెట్ (ఇస్తోనియా)పై నెగ్గింది. నాలుగో సీడ్ ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) కూడా సునాయాసంగా గెలుపొందింది. చెక్‌కు చెందిన అలెర్టోవాతో జరిగిన మ్యాచ్‌లో స్విటోలినా 6-3, 6-0 స్కోరుతో విజయం సాధించింది. ఇంకో ప్రీక్వార్టర్స్‌లో మెర్టెన్స్ (బెల్జియం) 7-6 (5), 7-5 స్కోరుతో మార్టిక్ (క్రొయేషియా)ను ఓడించింది.

బోపన్న ముందుకు, పేస్ ఇంటికి



పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన లియాండర్ పేస్-పురవ్ రాజా జోడీ ప్రీక్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది. పేస్-పురవ్ రాజా జోడీ 1-6, 2-6తో కొలంబియా ద్వయం జువాన్ సెబస్టియన్-రాబర్ట్ జంట చేతిలో ఓడిపోయింది. తొలి సెట్‌లో రెండు, రెండో సెట్‌లో మూడు బ్రేక్‌పాయింట్లు లభించినా భారత జోడీ ఒక్కదాన్నీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. రెండోరౌండ్‌లో ఐదోసీడ్ బ్రూనో, జెమీల ద్వయాన్ని కంగుతినిపించిన పేస్, రాజా జోడీ ప్రీక్వార్టర్స్‌లో అదే ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న, బబోస్ (హంగరీ) జోడీ శుభారంభం చేసింది. తొలిరౌండ్‌లో బోపన్న, బబోస్ 6-2, 6-4 స్కోరుతో విటింగ్టన్, పెరెజ్ (ఆస్ట్రేలియా) జంటపై విజయం సాధించింది.



నా పిల్లలు ఆటలాడతారో.. లేదో?

మెల్‌బోర్న్: చిన్నారులు క్రీడలు ఆడాలని నొక్కిచెప్పే స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్..తన పిల్లల్ని మాత్రం క్రీడల్ని కెరీర్‌గా ఎంచుకోవాలని బలవంతం చేయనని అన్నాడు. ఫెడరర్, మిర్కా దంపతులకు ఇద్దరేసి కవలలు మైలా రోజ్-చార్లిన్ రివా (2009), లియో-లెనీ (2014) ఉన్నారు. వీరిలో ఇద్దరు మగవారు కాగా ఇద్దరు ఆడపిల్లలు. సంవత్సరాలుగా అలుపెరగకుండా ప్రపంచమంతా పర్యటించి టెన్నిస్ ఆడుతున్న 36 ఏళ్ల ఫెడరర్.. తన పిల్లలు ఈ ఆటను కెరీర్‌గా మలుచుకొనేందుకు సుముఖత కనబరచడంలేదు. ఎందుకో తెలుసా..పిల్లల కోసం మరో పాతికేళ్లు తాను మళ్లీ ప్రపంచాన్ని చుట్టిరావాల్సి ఉంటుందని. 'తండ్రిగా వారిని ప్రోత్సహిస్తా. అయితే ఫలానాదే చేయండని మాత్రం ఆదేశించను. వారు క్రీడా రంగాన్ని ఎంచుకుంటారా లేదా వ్యాపారం రంగంపట్ల మొగ్గుచూపుతారా అన్నది మాత్రం తెలియదు' అని చెప్పాడు. తన పిల్లలు ఇప్పటికే టెన్నిస్ ఆడుతున్నారని ఫెడెక్స్ వెల్లడించాడు. ఇందుకు తాను వారిని ఆ ఆటలో ప్రోత్సహించడంవల్ల కాదని స్పష్టంజేశాడు. వారి స్నేహితులు ఆడుతుండడమే కారణమని తెలిపాడు.

అలా.. ఒత్తిడిని జయించా



ముంజేతి గాయంతో గత ఏడాది టెన్నిస్‌కు దూరంగా ఉన్నాడు 30 ఏళ్ల సెర్బియా వీరుడు జొకోవిచ్. ఆ సమయంలో తాను ఎంతో ఒత్తిడి ఎదుర్కోవడంతోపాటు మరెంతో భయపడ్డానని వెల్లడించాడు. అయితే ధ్యానంతో ఆ రెండింటినీ జయించానని చెప్పాడు. క్రమం తప్పకుండా ప్రతిరోజూ ధ్యానం చేయడమే పునరాగమనంలో సత్తా చాటడానికి కారణమని పేర్కొన్నాడు.

ఆసీస్‌కు చావుదెబ్బ

ఇంగ్లండ్‌దే వన్డే సిరీస్

సిడ్నీ: జోస్ బట్లర్ (83 బంతుల్లో 6 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 100 నాటౌట్) చెలరేగడంతో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలోనూ ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌ను 3-0తో ఇంగ్లండ్ దక్కించుకుంది. అలాగే స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడడం ఆసీస్‌కు ఇదే తొలిసారి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 302 పరుగులు చేసింది. వోక్స్ (53 నాటౌట్) అర్ధ సెంచరీ చేశాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి శతకం సాధించిన బట్లర్ ధాటికి ఇంగ్లండ్ జట్టు ఆఖరి రెండు ఓవర్లలో 38 పరుగులు రాబట్టింది. ఆ తర్వాత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు చేసి ఓడింది. ఫించ్ (62), స్టొయినిస్ (56), మార్ష్ (55) అర్ధ సెంచరీలు చేయగా స్మిత్ (45) ఫర్వాలేదనిపించాడు.



బట్లర్ (100 నాటౌట్)

హాకీ ఫైనల్లో ఓడిన భారత్

టౌరంగ (న్యూజిలాండ్): నాలుగు దేశాల ఇన్విటేషనల్ హాకీ మొదటి లెగ్ ఫైనల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన ఫైనల్‌ఫైట్‌లో భారత్ 1-2 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓటమి పాలై రన్నరప్‌తో సరి పెట్టుకుంది. భారత్ తరపున ఏకైక గోల్‌ను మన్‌దీప్ సింగ్ 19వ నిమిషంలో చేశాడు. బెల్జియంకు టామ్ బూన్, సెబాస్టియన్ డోకీర్ 4, 36 నిమిషాలలో గోల్స్ సాధించారు.

పంజాబ్ 'సూపర్' విన్



కోల్‌కతా: వెటరన్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్‌లు రాణించడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ-20లో పంజాబ్.. కర్ణాటకపై 'సూపర్' విక్టరీ సాధించింది. తొలుత కర్ణాటక నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. ఛేదనలో మన్‌దీప్ (45)తోపాటు హర్భజన్ (33), యువీ (29) తగిన సహకారం అందించడంతో పంజాబ్ కూడా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులే చేసింది. దీంతో సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని నిర్ణయించారు. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో జార్ఖండ్‌పై ముంబై 13 పరుగుల తేడాతో నెగ్గింది.

శ్రీలంక ఆశలు సజీవం

ఢాకా: తిసార పెరీరా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముక్కోణపు టోర్నీలో శ్రీలంక జట్టు వరుస అపజయాలకు అడ్డుకట్ట పడింది. ఆదివారం జింబాబ్వేతో జరిగిన వన్డేలో లంక 5వికెట్ల తేడాతో నెగ్గింది. ఇప్పటిదాకా ఆడిన మూడుమ్యాచ్‌ల్లో ఈ జట్టుకిదే తొలి విజయం. ముందుగా జింబాబ్వే 44 ఓవర్లలో 198 పరుగులు చేసింది. బ్రెండన్ టేలర్ (58) అర్ధ సెంచరీ చేశాడు. పెరీరా నాలుగు వికెట్లతో చెలరేగాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లంక 44.5 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు చేసి నెగ్గింది. కుశాల్ పెరీరా (49), తిసార పెరీరా (39 నాటౌట్) రాణించారు. ఈ గెలుపుతో ముక్కోణపు టోర్నీలో లంక అవకాశాలను సజీవంగా ఉంచుకోగలిగింది.

ప్రజలు ఉచితాలు కోరరు

అలా అనుకుంటే అది భ్రమే.. ప్రజలు కోరేది సుపరిపాలన.. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే ఎన్నికల్లో ఓడించడం కాదు

- కాంగ్రెస్ సంస్కృతి పోవాలి!
- ఆ పార్టీ సైతం తన సంస్కృతి నుంచి విముక్తం కావాలి
- నోట్ల రద్దు ఒక విజయగాథ
- జీఎస్టీలో మార్పుచేర్పులకు సిద్ధం
- ఆంగ్ల చానల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 21: మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్.. సంక్షేమ బడ్జెట్ కాదని ప్రధాని నరేంద్రమోదీ చెప్పకనే చెప్పారు! 'మోదీ సర్కారు ఈ టర్మ్‌లో ప్రవేశపెట్టే ఆఖరు బడ్జెట్ ఇదే కాబట్టి సంక్షేమానికి పెద్ద పీట వేస్తారు' అంటూ విశ్లేషకులు వేసిన అంచనాలను కొట్టిపారేశారు! 'ప్రజలు తాయిలాలను, ఉచితపథకాలను కోరుకోరు.. వారు కోరుకునేది సుపరిపాలన' అని తేల్చిచెప్పారు! కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే ఆ పార్టీ సైతం తన సంస్కృతి నుంచి బయటపడాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. 'టైమ్స్ నౌ' చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు మోదీ మాటల్లోనే..

- (ఈసారి సంక్షేమ బడ్జెట్ పెడతారా అనే ప్రశ్నకు) బడ్జెట్ విషయం ఆర్థిక మంత్రి పరిధిలో ఉంటుంది. దాంట్లో నేను జోక్యం చేసుకోను. అయితే, గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా నన్ను చూసిన సామాన్యప్రజలు.. తాయిలలను, ఉచిత పథకాలను కోరుకోరు. అలా కోరుకుంటారనుకుంటే అది భ్రమే. సామాన్యులు కోరుకునేది సుపరిపాలనను. సామాన్య ప్రజల అవసరాలను, ఆకాంక్షలను నెరవేర్చే విధంగా మా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.
- (ఒకవేళ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సంక్షేమ పథకాలు ఉంటే వాటిని అడ్డుకుంటారా అనే ప్రశ్నకు) దేశం ఎదగడానికి, బలోపేతం కావడానికి ఆ తరహా రాజకీయ సంస్కృతి.. కాంగ్రెస్ సంస్కృతిని అనుసరించాలా? వద్దా? అనే విషయాన్ని ముందు మనం నిర్ణయించుకోవాలి. కులతత్వం, వంశపాలన, అవినీతి, దోపిడీ, మోసం, ద్రోహం, అధికారంపై పూర్తి పట్టు కలిగి ఉండడం.. ఇవన్నీ భారతీయ రాజకీయ సంస్కృతిలో భాగమయ్యాయి. ఈ రాజకీయ సంస్కృతికి మూలస్తంభం కాంగ్రెస్. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే.. అదొక సంకేతాత్మక నినాదమే. దానికి ఎన్నికల ఫలితాలతో సంబంధం లేదు. దేశ ప్రయోజనాల రీత్యా ఆ పార్టీ సైతం తన సంస్కృతి నుంచి విముక్తి పొందాల్సిన అవసరం ఉంది. ఒక ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యానికి అది తప్పనిసరి కూడా.
- (మోదీ సర్కారు చెబుతున్న అభివృద్ధి ఉద్యోగాలను కల్పించట్లేదనే విమర్శపై).. ఉపాధి కల్పనపై అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. వ్యవస్థీకృత రంగం ద్వారా 10 శాతం ఉద్యోగాలు, అవ్యవస్థీకృత రంగం ద్వారా 90 శాతం ఉద్యోగాలు వస్తాయి. గత ఏడాది గణాంకాలనే తీసుకుంటే.. 70 లక్షల కొత్త ఈపీఎఫ్ ఖాతాలు ప్రారంభమయ్యాయి. వాటిని ప్రారంభించినవారిలో 18-25ఏళ్ల వారే ఎక్కువ.
- వ్యవసాయ రంగం దుస్థితిపై విమర్శలు న్యాయమే. దాన్ని కొట్టిపారేయలేం. అయితే, అది మా ఒక్కరి బాధ్యతమాత్రమే కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. రెండూ కలిసి రైతుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి.
- (తమ ప్రభుత్వ ఆర్థిక విజయాలపై) 2013-14లో.. అంటే మా ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టేనాటికి భారతదేశం ప్రపంచంలోనే ఐదు దుర్బల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేది. కానీ, మూడేళ్లలోనే ఆ దుస్థితి నుంచి బయటపడింది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల.. ఇలా అన్ని ఆర్థిక పరామితుల్లోనూ గత మూడేళ్లలో 3 శాతం వృద్ధి సాధించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 62 మిలియన్ డాలర్ల నుంచి 30 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఆర్థిక లోటు 4.5 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గింది. కరెంటు ఖాతాలోటు 4 శాతం నుంచి 1-2 శాతానికి తగ్గింది. ప్రపంచం వీటన్నిటినీ చూసే.. భారతదేశాన్ని దీపశిఖగా కొనియాడుతున్నాయి.
- (ప్రపంచ ఆర్థిక సదస్సులో భారతప్రధాని తొలిసారి ప్రసంగించడంపై) భారతదేశం తన ఆర్థిక బలిమిన ప్రపంచానికి చూపింది. అందుకే భారతదేశం గురించి ఆ దేశ అగ్రనేత నుంచి ప్రత్యక్షంగా తెలుసుకోవాలనుకుంటోంది. భారతదేశం ఇప్పుడు గొప్ప అవకాశాల గడ్డగా.. పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యంగా మారింది.
- (నోట్ల రద్దును విమర్శించినవారిపై) నోట్ల రద్దు విషయంలో.. అగ్గి రాజేసి, ఘర్షణలు రెచ్చగొట్టాలని చాలా మంది చూశారు. సుప్రీం కోర్టు తలుపులు కూడా తట్టారు. నల్లధన కుబేరులను, అవినీతిపరులను కాపాడటానికి వారు చేయగలిగిన ప్రతి ప్రయత్నం చేశారు. కానీ, నోట్ల రద్దు ఒక విజయగాథ.
- (జీఎస్టీపై) జీఎస్టీ విషయంలో మార్పుచేర్పులకు మేం సానుకూలంగా ఉన్నాం. అదే సమయంలో అందులోని లొసుగులను పూడ్చి మరింత సమర్థంగా మార్చే పనిలో ఉన్నాం. జీఎస్టీని వ్యతిరేకించేవారు పార్లమెంటును అవమానిస్తున్నట్టే. అయినా.. 1961 నుంచి ఆదాయపన్ను చట్టానికి ఎన్ని మార్పులు చేశారో గుర్తుందా? జీఎస్టీ ఒక కొత్త విధానం. నేనీ విషయాన్ని మొదటి రోజు నుంచీ చెబుతున్నా. కొత్త విధానానికి అలవాటుపడటానికి ప్రజలకు కొంత సమయం పడుతుంది.
- (న్యాయవ్యవస్థలో సంక్షోభంపై తొలిసారిగా స్పందిస్తూ) మన న్యాయవ్యవస్థకు ఘనమైన గతం ఉంది. వారంతా (న్యాయమూర్తులు) ఎంతో సమర్థులైనవారు. ఒక చోట కూచుని తమ సమస్యలకు పరిష్కారాలు కనుక్కోగలరు.
- (ఉగ్రవాదం.. పాక్‌పై) పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ముందు ఒంటరి చేసేందుకు మేం ప్రయత్నిస్తున్నామని మీరు భావిస్తుంటే.. అది తప్పు. మేం చేస్తున్న పని అది కాదు. ప్రపంచమంతా ఉగ్రవాదం కారణంగా బాధపడుతోంది. అలాంటి ఉగ్రవాదుల పట్ల సానుభూతి చూపేవారి పట్ల ప్రపంచమంతా ఏకమవుతోంది. భారత దేశ విదేశాంగ విధానం అంశాలవారీగా ఉంటుంది. ఉగ్రవాదంపై గట్టిగా గళమెత్తినందుకు ట్రంప్‌ను నేను గౌరవిస్తున్నాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎవరు ఏ చర్య తీసుకున్నా నేను వారిని స్వాగతిస్తాను.
- (కశ్మీర్‌పై చర్చలకు కేంద్రం ఒక ప్రతినిధిని నియమించడంపై) ప్రభుత్వం ఈ దేశంలోని ప్రతి ఒక్క పౌరుడితోనూ చర్చించేందుకు సిద్ధంగా ఉంది.

(ట్రిపుల్ తలాక్ బిల్లుపై).. రాజీవ్‌గాంధీ పీఎంగా ఉన్నప్పుడు (షాబానో కేసు విషయమై) చేసిన తప్పు నుంచి కాంగ్రెస్ పార్టీ నేర్చుకుని ఉండాల్సింది. షాబానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కును బలపరిచే తీర్పు. దాన్ని కాంగ్రెస్ పార్టీ ఎందుకు అర్థం చేసుకోలేకపోయిందనేది ప్రశ్న. రాజకీయాలు అంతగా దిగజారిపోయాయా? అమాయకులైన ఎందరో తల్లులు, సోదరీమణులు బాధపడుతున్నా కూడా తమ రాజకీయాలను కొనసాగించేంతగా అధికార వ్యామోహం ఉంటుందా? అది స్వార్థం. నన్నెంతగానో బాధించే విషయమిది. ఎన్నో ఇస్లామిక్ దేశాలు ఈ విషయంలో చట్టాలను మార్చుకున్నాయి. కాంగ్రెస్‌పార్టీ కావచ్చు.. దాని తరహాలోనే ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడే ఏ పార్టీ అయినా కావచ్చు.. ఈ తరహా తిరోగామి మనస్తత్వం నుంచి బయటపడాలి. మహిళా సాధికారత, మహిళలకు గౌరవం కోణంలో ఆలోచించాలి.



ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసంలో ఆదివారం జరిగిన సంక్రాంతి వేడుకల్లో ప్రధాని మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్, వెంకయ్య దంపతులు

సంస్కారాన్ని పంచేదే సంక్రాంతి

- ఢిల్లీలో ఎన్నో ఏళ్లుగా వెంకయ్య ఈ పండుగను జరపడం ముదావహం: మోదీ
- రైతులే నిజమైన హీరోలు: వెంకయ్య

న్యూఢిల్లీ/శంషాబాద్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటే ఒక కాలం నుంచి మరో కాలంలోకి ప్రవేశించడమే కాదని.. ఒక తరం నుంచి మరో తరానికి సంప్రదాయాలతో పాటు సంస్కారాన్ని పంచే పండుగ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. అనాదిగా కుటుంబ, సమాజ, దేశీయ విలువలను ఈ పండుగ సహజ రూపంలో ముందుకు తీసుకువెళుతోందన్నారు. ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా దేశ రాజధానిలో వెంకయ్య ఈ సంబరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చెన్నై కళాకారులు నిర్వహించిన నృత్యప్రదర్శనను, నాసికా వేణు నిపుణుడు సాయి హేమంత్ కృష్ణ బృందం చేసిన కచేరిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందించారు. కాగా, దేశంలో నిజమైన హీరోలు రైతులేనని, వారి జీవితంతో మకర సంక్రాంతి ముడిపడి ఉందని వెంకయ్య అన్నారు. దేశ సౌభాగ్యానికి కృషిచేస్తున్న రైతులకు ఈ సందర్భంగా మనం గౌరవించుకోవాలన్నారు. ఈ సంబరాలకు అడ్వాణీ, పలువురు కేంద్రమంత్రులు, మాజీ ప్రధాని మన్మోహన్, మాజీ ఉప రాష్ట్రపతి అన్సారీ, ఎంపీలు కె.కేశవరావు, వేణుగోపాలచారి, తోట నర్సింహం, సీవీసీ కె.వి.చౌదరి, హడ్కో చైర్మన్ రవికాంత్ తదితరులు హాజరయ్యారు.



ఉగ్రవాదులు దాడి చేసిన సమయంలో దుప్పట్ల సాయంతో కొందరు పర్యాటకులు హోటల్ పై అంతస్తు నుంచి ఇలా కిందకు జారి ప్రాణాలు రక్షించుకోగా.. మరికొందరు గాయపడ్డారు.

కాబూల్ హోటల్ మృతులు 18 మంది

- 13 గంటలపాటు ఎదురుకాల్పులు
- ఐదుగురు ఉగ్రవాదులూ హతం
- మరో 2 పేలుళ్లలో 12 మంది పౌరులు, ఓ అధికారి మృతి

కాబూల్, జనవరి 21: అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ప్రఖ్యాత ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌లో జరిగిన ఉగ్రదాడిలో 14 మంది విదేశీయులతో సహా మొత్తం 18 మంది మృతి చెందారు. ముంబై ఉగ్రదాడి తరహాలో ఆయుధాలు, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లతో ఆరు అంతస్థుల ఈ భవనంలోకి శనివారం రాత్రి ప్రవేశించిన ఐదుగురు ఉగ్రవాదులు... అందులోని అతిథులు, సిబ్బందిపై కాల్పులతో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. రంగంలోకి దిగిన భద్రతా బలగాలు దాదాపు 13 గంటలపాటు పోరాడి ఉగ్రవాదులందర్నీ హతమార్చాయి. ఈ దాడికి తామే బాధ్యులమని తాలిబన్లు ప్రకటించుకున్నారు. ఇదిలావుండగా, ఈ దాడి జరిగిన గంటల వ్యవధిలోనే హెరాత్ రాష్ట్రంలో ఉగ్రవాదులు ఆదివారం ఉదయం బాంబు దాడికి పాల్పడ్డారు. రోడ్డు పక్కన పాతిపెట్టిన బాంబు పేలడంతో... ఆ సమయంలో అటుగా వెళ్తున్న వాహనంలోని 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఫరా రాష్ట్రంలోనూ ఇలాంటి దాడే జరిగి ఓ పోలీస్ అధికారి చనిపోయారు. ఈ దాడులకు ఎవరూ బాధ్యత ప్రకటించుకోకపోయినా... ఇవి తాలిబన్ల పనేనని పోలీసులు అంటున్నారు.

మోదీకి అహం పెరిగింది: హజారే

ముంబై: ప్రధాని మోదీపై అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీకి అహం పెరిగిపోయిందని అన్నారు. అందువల్లే మూడేళ్ల నుంచి తాను రాసిన లేఖలకు సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా అట్‌పడీలో ఓ ర్యాలీలో మాట్లాడిన ఆయన.. 'ప్రధాని మోదీకి మూడేళ్లలో 30కి పైగా లేఖలు రాశాను. కానీ ఒక్కదానికి కూడా సమాధానం ఇవ్వలేదు. మోదీకి ప్రధానినన్న అహం పెరిగిపోయింది. అందువల్లే సమాధానం ఇవ్వడం లేదు. భారీగా నిరసనలు చేపడతాం' అన్నారు.

కేజ్రీవాల్‌కు రాష్ట్రపతి షాక్

- ఈసీ సిఫారసుకు కోవింద్ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీలో పార్లమెంటరీ కార్యదర్శులుగా ఆయన 2015 మార్చి 13న నియమించిన 20 మంది ఆప్ ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రద్దుచేశారు. వీరిలో రాష్ట్ర మంత్రి కైలాస్ గెహ్లాట్ కూడా ఉన్నారు. లాభదాయక పదవులు అనుభవిస్తున్న వీరిని శాసనసభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ (ఈసీ) శుక్రవారం చేసిన సిఫారసును రాష్ట్రపతి శనివారమే ఆమోదించారు. దీనిపై కేజ్రీవాల్ ఆదివారం మండిపడ్డారు. ప్రజాధనాన్ని కాపాడుతున్న తమను ఇబ్బందిపెట్టేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

వ్యాజ్యాల కేటాయింపు రోస్టర్‌లో!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 12న విలేకరుల సమావేశం నిర్వహించి మరీ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ప్రధానంగా సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక జడ్జి బీహెచ్ లోయా అనుమానాస్పద మృతికి సంబంధించి దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాల విచారణను జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనానికి అప్పగించడంపై తీవ్ర అభ్యంతరం తెలియజేశారు. ఈ నేపథ్యంలో లోయా కేసు విచారణ నుంచి జస్టిస్ అరుణ్ మిశ్రా స్వచ్ఛందంగా వైదొలిగారు. దాంతో చీఫ్ జస్టిస్‌తో పాటు జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం దీనిపై విచారణ జరుపనుంది. వ్యాజ్యాల కేటాయింపు విషయంలో ప్రధాన న్యాయమూర్తి సోదర న్యాయమూర్తులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నుంచి కూడా సలహాలు స్వీకరించారు. కేటగిరీలకు అనుగుణంగా న్యాయమూర్తులు/ధర్మాసనాల జాబితాను రూపొందించి.. వివిధ కేసులను కేటాయించేలా స్పష్టమైన రోస్టర్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'వ్యాజ్యాల కేటాయింపుపై ప్రధాన న్యాయమూర్తి తీసుకున్న నిర్ణయాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తన వెబ్‌సైట్‌లో ఉంచే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఏ కేటగిరీ కేసులను ఏయే న్యాయమూర్తులు విచారిస్తారో బహిరంగపరిచే రోస్టర్ వ్యవస్థ అమల్లోకి రానుంది' అని చీఫ్ జస్టిస్ మిశ్రాకు అత్యంత సన్నిహితమైన వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ హైకోర్టులో అనుసరిస్తున్నట్లుగా వ్యాజ్యాల విచారణలో రోస్టర్ సిస్టమ్‌ను తీసుకురావాలని తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని సుప్రీం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ వెల్లడించారు. తమ సూచనలను ప్రధాన న్యాయమూర్తి ఆమోదిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. నలుగురు న్యాయమూర్తుల విలేకరుల సమావేశం కారణంగా ఏర్పడిన అపార్థాలన్నీ తొలగిపోతాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా.. సుప్రీంకోర్టుకు భవిష్యత్‌లో ప్రధాన న్యాయమూర్తులు కానున్న జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎప్పటికప్పుడు జస్టిస్ దీపక్ మిశ్రాతో సంప్రదింపులు జరుపుతున్నారు. నలుగురు న్యాయమూర్తుల విలేకరుల సమావేశం దరిమిలా ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కృషిచేస్తున్నారు. అలాగే అత్యంత సీనియర్ న్యాయమూర్తులు విలేకరుల సమావేశం పెట్టడం పట్ల వారు కూడా సంతృప్తిగా లేరు. ఈ నెల 18న చీఫ్ జస్టిస్ మిశ్రా జస్టిస్ చలమేశ్వర్ బృందంతో భేటీ అయ్యారు. ఆ తర్వాత కలవడం కుదరలేదు. జస్టిస్ చలమేశ్వర్ ఢిల్లీలో లేకపోవడమే దీనికి కారణం. ఆయన ముందస్తు కార్యక్రమాలు ఉండడంతో చెన్నై, బెంగళూరు వెళ్లారు. సోమవారం కోర్టు విచారణ మొదలయ్యే ముందు ఈ నలుగురితో చీఫ్ జస్టిస్ సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

క్లయింట్ల కోసం తోటి లాయర్‌ను చంపేశాడు

కాన్పూర్, జనవరి 21: వారిద్దరూ గౌరవమైన న్యాయవాద వృత్తి చేపట్టిన వారే. కానీ క్లయింట్ల కోసం పోటీతో తమ స్థాయిని మరిచారు. రోడ్డుపైకి దిగి మరి ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన ఓ లాయర్.. తోటి న్యాయవాదిని అందరూ చూస్తుండగానే కాల్చిచంపాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మోహిత్(32), సునీల్‌శర్మ(36) మధ్య క్లయింట్ల కోసం గత కొంతకాలంగా పోటీ వాతావరణం నడుస్తోంది. ఇదే విషయంలో ఆదివారం ఇద్దరూ గొడవకు దిగారు. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన మోహిత్..గన్‌తో అందరూ చూస్తుండగానే సునీల్‌ను కాల్చిచంపాడు.

11,800 పోస్టులు ఖాళీ

- రెవెన్యూలో సిబ్బంది కొరతతో ఇబ్బంది..
- సంస్కరణల అమలులో అడ్డంకి
- ఉద్యోగులపై రెట్టింపు పనిభారం
- నత్తనడకన దరఖాస్తుల పరిష్కారం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. ఏకంగా 11,800 కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలనా సంస్కరణల అమలు వేగం మందగిస్తోంది. నానాటికీ పెరిగిపోతోన్న పని భారానికి తోడు నియామకాలు లేకపోవడం, సిబ్బంది పదవీ విమరణలు నానాటికీ పెరిగిపోతుండటంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పనిభారం రెట్టింపవుతోంది. తహసీల్దార్, ఆర్డీవో, డీఆర్వో, సీసీఎల్ఏ, సర్వే విభాగాల్లో ప్రస్తుతం సగటున నలుగురు చేయాల్సిన పనిని ఒక్కరితోనే చేయిస్తున్నారు. 10మంది సర్వేయర్ల పని ఒకరే చేస్తుండటంతో ఆ విభాగంలో దరఖాస్తుల పరిష్కారం నత్తనడకన సాగుతోంది. దీంతో ఈ సమస్యను రెవెన్యూ శాఖ ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది.

60 సేవలు ఆన్‌లైన్‌లో...

ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ పాత్ర ఎంతో కీలకమైనది. మొత్తం 118 చట్టాల అమలుతో పాటు ప్రభుత్వ సేవలన్నీ తన పరిధిలో ఉంచుకొన్న రెవెన్యూశాఖ... అవినీతి ఆరోపణలు, అసమర్థ పనితీరు అన్న అప్రతిష్ఠ నుంచి బయటపడేందుకు గత మూడున్నరేళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తోంది. పాత చట్టాలను రద్దు చేయడంతో పాటు, పౌరసేవలన్నీ ఆన్‌లైన్‌లోకి తీసుకొచ్చేలా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటోంది. ఈ దిశగా నూతన పరిపాలనా సంస్కరణలను శాఖాపరంగా చేపట్టడంతోపాటు.... రాష్ట్ర స్థాయిలో అన్ని విభాగాలకు కలిపి ఇప్పుడు రెవెన్యూనే నోడల్ ఏజెన్సీగా ఉంది. 69 రకాల పౌరసేవలను పూర్తిగా ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చారు. భూముల రికార్డులు, 1బీ రిజిస్టర్‌తో పాటు అన్నింటిని డిజిటలైజ్ చేసి మీ భూమి వెబ్(వెబ్‌ల్యాండ్) పరిధిలోకి తీసుకొచ్చారు.

కీలక పోస్టుల్లో సిబ్బంది నిల్

రెవెన్యూ శాఖను ఎలా సంస్కరించాలి.. ప్రజలకు ఎలా చేరువ చేయాలన్నదానిపై సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ స్టడీస్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) వేర్వేరుగా నివేదికలు ఇచ్చాయి. వీటిని అమలు చేయడానికి సమాయత్తమవుతుండగా అసలు సమస్య వెలుగులోకి వచ్చింది. శాఖలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని, కీలకమైన ర్యాంకుల అధికారుల కేటగిరీల్లోనే పెద్దఎత్తున ఖాళీలు ఉన్నాయని గుర్తించారు. వాటిని ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ విధానంలో భర్తీచేయలేని పరిస్థితి. తాజా అంచనాల మేరకు రెవెన్యూ, సర్వే శాఖల్లో కలిపి 11,800 పోస్టులు ఖాళీగా ఉన్నాయని లెక్క తేల్చారు. ఇందులో 45శాతం గెజిటెడ్ ర్యాంకు పోస్టులే. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలను అందించడంలో ఈ పోస్టులు అత్యంత కీలకమైనవి. తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి 6,386 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో 125 తహసీల్దార్ పోస్టులు, 452 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు కూడా ఉన్నాయి. గత మూడేళ్లలో 150మందికి పైగా తహసీల్దార్లు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు.

కార్యాలయాల్లో కదలని ఫైళ్లు

సిబ్బంది లేకపోవడంతో ఫైళ్ల పరిష్కారం బాగా నెమ్మదించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జిల్లా స్థాయి రెవెన్యూ కార్యాలయాల్లో 2,685 సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఇప్పుడు కేవలం 1,950 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 1,864 జూనియర్ అసిస్టెంట్లకు గాను 1,400మంది విధుల్లో ఉన్నారు. మిగతా పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారానే భర్తీ చేయాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 10,307 గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులకు గాను 1,188 ఖాళీగా ఉన్నాయి. గ్రామ సహాయకుల పోస్టులు 27,364కు గాను 2,335 భర్తీ కాలేదు. డిప్యూటీ తహసీల్దార్ కేటగిరీ(గ్రూప్-2)లో 253 పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా, మిగిలిన పోస్టుల్లో కొంతమేర పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. పాలనా సంస్కరణల అమలుకు ఈ ఖాళీలు ప్రతిబంధకంగా మారాయని, జూనియర్ అసిస్టెంట్, వీఆర్వో, వీఆర్ఏ పోస్టుల భర్తీకి అనుమతించాలని రెవెన్యూ శాఖ సర్కారును కోరింది.

సర్వేలో వేలాది పోస్టులు ఖాళీ

సర్వే విభాగంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్, అసిస్టెంట్ సర్వేయర్‌తో పాటు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 5,414 ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 4,200 మంది సర్వేయర్లు పనిచేయాల్సిన చోట కేవలం 895మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన 300మందికి త్వరలోనే నియామక ఉత్తర్వులు అందించనున్నారు. అయితే, ఇంకా వేలాదిగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయని, దీని వల్ల సర్వే దరఖాస్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని అధికారులు చెబుతున్నారు.





బాల్యవివాహాలు, వరకట్నానికి వ్యతిరేకంగా చేపట్టిన మానవహారంలో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, డిప్యూటీ సీఎం సుశీల్‌కుమార్ మోదీ, స్పీకర్ విజయ్ చౌధురి తదితరులు. 13 వేల కిలోమీటర్లకు పైగా ఏర్పాటైన మానవహారంలో 4 కోట్ల మంది పాల్గొని ఉంటారని అధికారుల అంచనా.

నూతన సీఈసీగా రావత్

ఏకే జ్యోతి స్థానంలో నియామకం

- రేపు బాధ్యతల స్వీకరణ.. కొత్త కమిషనర్‌గా అశోక్ లావాసా



అశోక్ లావాసా

న్యూఢిల్లీ, జనవరి 21: కేంద్ర ఎన్నికల సంఘానికి నూతన ప్రధాన కమిషనర్(సీఈసీ)గా ఓంప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ అచల్‌కుమార్ జ్యోతి సోమవారం పదవీ విరమణ చేయనుండడంతో ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రావత్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసాను కొత్త ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. అచల్‌కుమార్ పదవీ విరమణతో ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో ఓ స్థానం ఖాళీ అవుతుంది. ఇందులో లావాసాను ఎంపిక చేశారు. సునీల్ అరోరా మరో కమిషనర్‌గా ఉన్నారు. నూతన సీఈసీగా ఓపీ రావత్ మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది డిసెంబరుతో ముగుస్తుంది. అనంతరం అరోరా సీఈసీ అవుతారు. అంటే 2019 లోక్‌సభ ఎన్నికలు ఆయన నేతృత్వంలోనే జరిగే అవకాశం ఉంది. 1953, డిసెంబరు 2న జన్మించిన రావత్ మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి. ఆయన కేంద్ర భారీ పరిశ్రమల శాఖలో కార్యదర్శిగా పనిచేశారు. 1993లో రక్షణ శాఖలో డైరెక్టర్‌గానూ విధులు నిర్వర్తించారు. 2004లో నాటి మధ్యప్రదేశ్ సీఎం బాబూలాల్ గౌర్‌కు ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



'ఫేస్‌బుక్' మారుతోంది!

ఫేస్‌బుక్‌లోకి లాగిన్ కాగానే, న్యూస్ ఫీడ్స్ వరదలా పొంగుతూ ఉంటాయి. అవసరమైనవి కొన్నే. కానీ అనవసరమైనవి చాలానే ఉంటాయి. మనకు సంబంధం లేని పోస్టింగ్‌లు వచ్చి పడుతూ ఉంటాయి. అందులో చాలామటుకు వ్యాపార ప్రకటనలే. వీటి బారి నుంచి ఫేస్‌బుక్ యూజర్లను కాపాడటానికి ఈ న్యూస్ ఫీడ్స్‌లో మార్పులు తేవడానికి సిద్ధమవుతోంది ఫేస్‌బుక్. కేవలం వినియోగదారుల ఫ్రెండ్స్, ఫ్యామిలీ అప్‌డేట్స్‌కే తొలి ప్రాధాన్యం ఇవ్వనుంది. "కేవలం ఫేస్‌బుక్ అనేది వినోదం కోసమే కాదు, మన వాళ్ల కోసం కూడా. వాళ్లతో ఎక్కువసేపు ఉంటే మనసులో ఒంటరితనానికి చోటు ఉండదు" అని ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జాకర్‌బెర్గ్ తాజా పోస్ట్‌లో తెలిపారు. అయితే, ఇప్పటికే అమెరికాలోని రెండొంతుల మంది న్యూస్ పబ్లిషర్లు తమ వార్తలను ఫేస్‌బుక్‌లోనే పోస్ట్ చేస్తూ లాభాలను గడిస్తున్నారు. మరి వీరి పట్ల ఫేస్‌బుక్ వైఖరి ఎలా ఉంటుందో చూడాలి!

టెక్ సందేహాలు

బ్రైట్‌నెస్ ఎంతుండాలి?



ఎన్ని మెసేజ్‌లు పంపొచ్చు?

కాంటాక్టులన్నీ ఒకేసారి పొందొచ్చా?



ఆటోమేటిగ్గా అవుతున్నాయేంటి?

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

టెక్ గురూ



ఆపిల్ ఐఫోన్లు, విండోస్ ఫోన్లతో పోలిస్తే ఇండియాలో అధిక శాతం వాడుతున్నవి ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా తయారు చేయబడిన ఫోన్లే. తక్కువ ధరలో మెరుగైన స్పెసిఫికేషన్లతో కూడిన ఫోన్లు లభిస్తుండడం వల్ల చాలామంది వీటిని ఎంచుకుంటూ ఉన్నారు. ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌కి లభిస్తున్న ఆదరణని దృష్టిలో ఉంచుకుని హ్యాకర్లు దీన్ని టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మీరు వాడుతున్న ఫోన్‌ని సురక్షితంగా ఉంచుకోవాలంటే తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు ఇప్పుడు చూద్దాం.

ఇలా చేస్తే మీ ఫోన్ సేఫ్!

సైడ్‌లోడింగ్ వద్దు

మీరు కొత్తగా ఏ యాప్, గేమ్మైనా ఇన్‌స్టాల్ చేయాలంటే తప్పనిసరిగా గూగుల్ ప్లే స్టోర్ నుండి మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోండి. కొంతమంది పెయిడ్ వెర్షన్ గేమ్స్, యాప్స్‌ని కొనడం ఇష్టం లేక కొన్ని పైరేటెడ్ వెబ్‌సైట్ల నుండి క్రాక్డ్ ఫైళ్లని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వాటి ద్వారా అత్యంత ప్రమాదకరమైన మాల్‌వేర్లు మీ ఫోన్లో ప్రవేశించే అవకాశముంది. ఎంత మంచి యాప్ అన్పించినా అది గూగుల్ ప్లే స్టోర్‌లో లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని విడిగా డౌన్‌లోడ్ చేసుకుని సైడ్‌లోడ్ చేయకండి. అలాగే ఒకవేళ తప్పనిసరి అయి ఎప్పుడైనా మీకు బాగా తెలిసిన యాప్‌ని సైడ్‌లోడ్ చేసినట్లయితే, ఆ వెంటనే మీ ఫోన్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'అన్‌నోన్ సోర్సెస్' అనే ప్రదేశం వద్ద టిక్ తీసేయండి. ఇకపై ఇతర యాప్స్ పొరబాటున కూడా మీ ఫోన్‌లో ఇన్‌స్టలేషన్ అవకుండా అడ్డుకోవచ్చు.

ప్లేస్టోర్ కూడా ప్రమాదంలో

గూగుల్ ప్లే స్టోర్‌లోకి ప్రమాదకరమైన యాప్స్, గేమ్స్ ప్రవేశించకుండా గూగుల్ సంస్థ ఎప్పటికప్పుడు బౌన్సర్ అనే మెకానిజం ద్వారానూ, ఇతర పద్ధతుల ద్వారానూ చర్యలు తీసుకుంటూ ఉంటుంది. అయితే గూగుల్ కళ్లుగప్పి కూడా అనేక డేంజరస్ యాప్స్, గేమ్స్ ఇటీవలి కాలంలో ప్లేస్టోర్‌లో దాక్కుంటున్నాయి. కాబట్టి గూగుల్ ప్లే స్టోర్ నుండి కూడా ఏదైనా యాప్‌ని గానీ, గేమ్‌ని గానీ డౌన్‌లోడ్ చేసుకోబోయే ముందు దాని క్రింద రాయబడి ఉన్న రివ్యూలను, రేటింగులను వివరంగా పరిశీలించిన తర్వాత మాత్రమే దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోండి. గూగుల్ సంస్థ మాల్వేర్ లక్షణాలు కలిగిన పలు యాప్స్, గేమ్స్‌ని ఇటీవలి కాలంలో తొలగిస్తూ ఉంది.

ఫోన్లో యాంటీవైరస్?

ఇంతకు ముందు చెప్పుకున్నట్లు మీరు బయట ఎక్కడ నుండైనా యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేస్తుంటే తప్పించి సహజంగా ఆండ్రాయిడ్ ఫోన్లలో యాంటీవైరస్ అవసరం లేదు. కంప్యూటర్లలో మాదిరిగా ఆండ్రాయిడ్ ఫోన్లకి యాంటీవైరస్‌లు అంత శక్తివంతంగా పనిచెయ్యట్లేదు. యాంటీవైరస్ ఇన్‌స్టాల్ చెయ్యడం వల్ల ఫోన్ కొద్దిగా స్లో అవడం కూడా జరుగుతుంది. ఇతర జాగ్రత్తలు అన్నీ తీసుకుంటే యాంటీవైరస్ అవసరమే లేదు.

యాప్ పర్మిషన్లు

ఫోన్లో రకరకాల యాప్స్‌ని, గేమ్స్‌ని ఇన్‌స్టాల్ చేసేటప్పుడు గుడ్డిగా వాటిని అనుమతించడం కాకుండా నిజంగా ఆయా యాప్స్‌కి ఆ పర్మిషన్లు అవసరం అవుతాయా లేదా అన్నది ఆలోచించండి. కొన్ని యాప్స్ తమకు అవసరం లేకపోయినా మన కాల్స్‌ని, మెసేజ్‌లను, లొకేషన్, స్టోరేజ్ వంటి అన్ని రకాల సమాచారాలను సేకరించడానికి పర్మిషన్లు తీసుకుంటూ ఉంటాయి. ఒకవేళ ఏదైనా యాప్ తనకు అవసరం అయిన దానికన్నా ఎక్కువ మొత్తంలో పర్మిషన్లు తీసుకుంటోంది అన్పిస్తే దాని బదులు అదే పని చేసిపెట్టే వేరే యాప్స్ ఏవైనా ఉన్నాయేమో వెదికి, వాటి రేటింగులు గమనించిన తర్వాత డౌన్‌లోడ్ చేసుకుని వాడండి.

డేటా సేవ్ చేసుకునేటప్పుడు

ఫోన్ల సెక్యూరిటీ విషయంలో ప్రధానంగా ఏర్పడే ఇబ్బందులన్నీ కేవలం మన అజాగ్రత్త వల్లనే తలెత్తుతుంటాయి. చాలామంది ఇప్పటికీ తమ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డ్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను తమ ఫోన్లో ప్లెయిన్ టెక్స్ట్ రూపంలో సేవ్ చేసుకుంటూ ఉంటారు. దీనివల్ల ఎవరైనా మన ఫోన్ చేతిలోకి తీసుకున్నప్పుడు ఆ ఫైళ్లని మనకు తెలీకుండా షేర్ చేసుకోవచ్చు. అలాగే థర్డ్‌పార్టీ యాప్స్ లాంటివి స్టోరేజ్ పర్మిషన్ తీసుకున్నప్పుడు మన ప్రమేయం లేకుండా తమ దగ్గరకు ఆ డేటాని రప్పించుకోవచ్చు. కీలకమైన సమాచారం ఎప్పుడూ ప్లెయిన్ టెక్స్ట్‌గా సేవ్ చేయకండి. ముఖ్యంగా యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డ్ వివరాలు భద్రపరచదలుచుకుంటే 'లాస్ట్‌పాస్' వంటి ఎన్‌క్రిప్టెడ్ సర్వీసులను వాడడం మొదలుపెట్టండి. ఇవి క్లిష్టమైన పాస్‌వర్డ్‌లను తయారు చేసి పెట్టడమే కాకుండా మన దగ్గర ఉన్న పాస్‌వర్డ్‌లను సురక్షితంగా క్లౌడ్‌లో భద్రపరిచి అవసరం అయినప్పుడు యాక్సెస్ చెయ్యడానికి వీలు కల్పిస్తుంది.

డివైజ్ అడ్మిన్‌గా

ఫోన్లో మనం ఇన్‌స్టాల్ చేసే కొన్ని యాప్స్ డివైజ్ అడ్మినిస్ట్రేటర్ హోదాని అడిగి మరీ మన దగ్గర తీసుకుంటూ ఉంటాయి. మీ ఫోన్లో ఏ యాప్ అయినా ఇలా డివైజ్ అడ్మిన్‌ని అనుమతించండి అని కోరినట్లయితే ఒకటికి పదిసార్లు ఆలోచించిన తర్వాతే నిర్ణయం తీసుకోండి. డివైజ్ అడ్మిన్ హోదా పొందిన యాప్స్‌లాక్ స్క్రీన్‌ని మార్చివేడి చెయ్యడం మొదలుకుని అనేక శక్తివంతమైన పనుల్ని చెయ్యగలుగుతాయి. అలాగే వాటిని మామూలు పద్ధతిలో అన్‌ఇన్‌స్టాల్ చెయ్యడం కూడా సాధ్యపడదు. మొదట డివైజ్ అడ్మిన్ హోదాని డిసేబుల్ చేసిన తర్వాతే అవి తొలగించడం కుదురుతుంది. డివైజ్ అడ్మిన్ హోదా తొలగించడం ఎలాగో తెలీక ఆ యాప్స్ తమ ఫోన్ నుండి పోవట్లేదని చాలామంది ఆందోళన పడుతుంటారు.

ఫోన్ రూటింగ్


ఆండ్రాయిడ్ ఫోన్లని రూట్ చెయ్యడం ద్వారా సహజంగా ఫోన్లో లభించని అనేక కొత్త ఆప్షన్లని పొందొచ్చు. ఫోన్ మీద మనకు పూర్తి నియంత్రణ లభిస్తుంది. అయితే రూటింగ్ వల్ల అంతే నష్టాలూ ఉన్నాయి. ఫోన్ రూట్ చెయ్యబడి ఉన్నట్లయితే ప్రమాదకరమైన యాప్స్, గేమ్స్ మన ఫోన్‌లో పూర్తి స్థాయి విధ్వంసం సృష్టించగలుగుతాయి. ఫోన్ సెక్యూరిటీపరంగా సమస్యలు ఉంటాయన్న కారణం చేతనే రూట్ చెయ్యబడిన ఫోన్లలో కొన్ని బ్యాంకింగ్ యాప్స్ కూడా సక్రమంగా పనిచెయ్యవు. అందుకే ఒకవేళ ఏ కారణం చేతైనా మీ ఫోన్‌ని రూట్ చెయ్యాలని భావిస్తున్నట్లయితే కాస్త ఆలోచించండి. ఒక సగటు యూజర్ కోణంలో చూస్తే ఫోన్‌ని రూట్ చెయ్యడం వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువ.

నోటిఫికేషన్ యాక్సెస్

వాట్సప్‌లో అవతలి వారికి బ్లూ టిక్స్ రాకుండా వారి మెసేజ్‌లను చదవడం ఎలా.. వంటి రకరకాల టెక్నిక్‌లు ఇప్పుడు చలామణిలో ఉన్నాయి. వాస్తవానికి ఇలాంటి ఆప్షన్లు అందించే థర్డ్ పార్టీ యాప్స్ మన ఫోన్‌లో నోటిఫికేషన్ యాక్సెస్‌ని తీసుకుని వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్, టెలీగ్రామ్ వంటి యాప్స్‌కి వచ్చే నోటిఫికేషన్లని మనకు చూపిస్తుంటాయి. ఇలా మన అవసరం కొద్దీ నోటిఫికేషన్ యాక్సెస్ ఏ యాప్స్‌కైనా ఇస్తే సరే, కానీ కొన్నిసార్లు మనకు తెలీకుండానే స్క్రీన్ మీద ఏదో మెసేజ్ వచ్చిందని గుడ్డిగా నోటిఫికేషన్ యాక్సెస్‌ని ఎనేబుల్ చేస్తుంటాం. అలా ఏ యాప్స్‌కి బడితే వాటికి దీన్ని ఎనేబుల్ చేయకండి.

ఫేక్ వార్నింగులు


కొన్ని వెబ్‌సైట్లని ఓపెన్ చేసినప్పుడు మీ ఫోన్లో వైరస్ ఉంది అంటూ వార్నింగులు కన్పిస్తుంటాయి. చాలామంది భయపడిపోయి ఆ మెసేజ్‌లో కన్పించే స్కాన్ బటన్ క్లిక్ చేస్తుంటారు. ఇవి నకిలీ వార్నింగులు. మీ ఫోన్ క్లీన్‌గా ఉన్నప్పటికీ ఇవి చూపించబడుతుంటాయి. పొరబాటున కూడా వీటిని క్లిక్ చేయకండి. వార్నింగ్స్ మెసేజ్ చూపించిన తర్వాత మీ ఫోన్ వైబ్రేట్ అయినా భయపడకుండా హోమ్ బటన్ ప్రెస్ చేసి బయటకు రండి తప్పించి దాన్ని క్లోజ్ చేద్దామని ఎక్కడెక్కడో క్లిక్ చేయకండి.




• నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

లైఫ్ లెసన్

చైతన్యానికి మహిళా పతాక!





• ఆకెళ్ల రాఘవేంద్ర

నవజీవనగీతం

మంచుముత్యాల ముఖారం



• ఐమ్మెర

ఆదర్శం





నవ్య సకల

అచ్యుత సామంత... పారిశ్రామిక వేత్త కాదు... ఆగర్భ 'శ్రీమంతుడు' అసలే కాదు. ప్రభుత్వాలు కూడా చేయలేని పనిని ఒంటి చేత్తో చేస్తున్న సామాన్యుడు. ఒడిషాలో ముఖ్యమంత్రి స్థాయిలో ప్రజాకర్షణ ఉన్న అసామాన్యుడు. ఏకంగా ఇరవై ఏడు వేల మంది గిరిజన విద్యార్థులకు ఉచితంగా విద్య, భోజన, నివాస సౌకర్యం కల్పిస్తున్న యాభై రెండేళ్ళ సామంత ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం.

గిరిజనుల బాహుబలి

ఛాంపియన్ల స్కూల్







• గోవర్ధనం కిరణ్‌కుమార్

నయా గ్యాడ్జెట్

సామ్‌సంగ్ మెగా టీవీ




టెక్ టిప్

నచ్చినట్లుగా మార్చేయండి!



నయా ఫీచర్



హానర్ ఫోన్లలో ఫేస్ అన్‌లాక్

నయా యాప్



వాట్సప్ బిజినెస్ యాప్!

కొత్తగా

ఫేస్‌బుక్‌లో 'మార్కెట్‌ప్లేస్'



డైలీ సుడోకు - 84

ఎలా పూరించాలి?

సుడోకు-83 సమాధానం

మీకు మీరే డాక్టర్

ఔషధ పుదీనా



కౌన్సెలింగ్

గుండె జబ్బేమోనని భయంగా ఉంది

- డాక్టర్ డి. శరత్ రాజ్

ఒక రాణి... ఇద్దరు దర్శకులు!



తమన్నా



రమేశ్



నీలకంఠ

సినిమా ఒక్కటే. కానీ, దర్శకులు మాత్రం ఇద్దరు! నిజమా... అదే సినిమా? అనడిగితే... తమన్నా 'క్వీన్' అని చెప్పాలి. హిందీ హిట్ 'క్వీన్'కి తెలుగు రీమేక్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో తమన్నా టైటిల్ రోల్ (కంగనా రనౌత్ చేసిన పాత్ర) చేస్తున్నారు. దీనికి దర్శకుడు ఎవరు? సినిమా మొదలైనప్పుడు నీలకంఠ. ఇప్పుడు? రమేశ్ అరవింద్! 'క్వీన్' తమిళ, కన్నడ రీమేక్స్ ('పారిస్ పారిస్', 'బటర్‌ఫ్లై')కి దర్శకత్వం వహిస్తున్న రమేశ్ అరవిందే తెలుగు రీమేక్ దర్శకత్వ బాధ్యతలూ చేపట్టారు. ఈ విషయాన్ని చిత్రనిర్మాత మను కుమారన్ ధృవీకరించారు. "నవంబర్‌లో దర్శకుడి మార్పు జరిగింది. మలయాళ వెర్షన్‌కి నీలకంఠ, తెలుగు వెర్షన్‌కి రమేశ్ అరవింద్ దర్శకత్వం వహిస్తున్నారు" అని చిత్రజ్యోతితో మను కుమారన్ స్పష్టం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'క్వీన్'ని రీమేక్ చేస్తుందీయనే. మరోపక్క కథానాయికతో మనస్పర్థల వల్లే దర్శకుడు నీలకంఠ తప్పుకున్నారనే వార్తలను తమన్నా ఖండించారు. "చిత్ర నిర్మాణ విషయంలో నాకు గానీ, నా టీమ్‌కి గానీ ఎలాంటి అధికారం లేదు. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవలసింది నిర్మాతే. నీలకంఠగారంటే నాకెంతో గౌరవం" అని పేర్కొన్నారామె. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న 'నా... నువ్వే' చిత్రీకరణలో తమన్నా బిజీగా ఉన్నారు.



తమన్, బీవీఎస్ఎన్ ప్రసాద్, రాశీఖన్నా, వరుణ్‌తేజ్, వెంకీ అట్లూరి, అల్లు అరవింద్, దిల్‌రాజు, బాపినీడు

ఫౌండేషన్ పాడు చేసుకోను

- వరుణ్‌తేజ్

"పరిశ్రమలో మాకు పూలబాట వేసింది మా పెదనాన్న చిరంజీవి, బాబాయ్ పవన్‌కల్యాణ్. వాళ్లు వేసిన ఫౌండేషన్ పాడు చెయ్యకుండా సినిమాలు చేస్తా" అని వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'తొలిప్రేమ'. రాశీఖన్నా కథానాయిక. శ్రీవెంకటేశ్వర సినీచిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించారు. శనివారం హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. అల్లు అరవింద్ సీడీలను ఆవిష్కరించారు. తొలి సీడీని దిల్ రాజు అందుకున్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "బాబాయ్ నటించిన 'తొలిప్రేమ'ను ప్రేక్షకులు ఎంతగా ఆదరించారో తెలిసిందే. అలాంటి టైటిల్ మా సినిమాకు పెట్టాలంటే చాలా భయమేసింది. దర్శకుడు అదే టైటిల్ పెడదామంటే.. 'ఏదన్నా తేడా వస్తే పగిలిపోద్ద'ని చెప్పాను. ఆరు నెలలు ఆలోచించి చివరకు అదే టైటిల్ ఖరారు చేశాం. టైటిల్‌ను జస్టిఫై చేసేలా సినిమా ఉంటుంది. ఎవరినీ నిరుత్సాహపరచదు. నా హైట్‌కి సరిపడ హీరోయిన్‌ని వెతకడం చాలా కష్టం అవుతుంది. మొదటిసారి నా హైట్‌కి తగ్గట్టు రాశీఖన్నా కుదిరింది. పాటలు, ఫొటోగ్రఫీ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి" అని అన్నారు. "ధైర్యం కోల్పోతున్న సమయంలో ఆరడుగుల నాలుగు అంగుళాల ధైర్యానిచ్చాడు వరుణ్. ఇప్పటివరకూ గ్లామర్ పాత్రలతో అదరగొట్టిన రాశీఖన్నా ఇందులో నటనతో ఆకట్టుకుంటుంది" అని వెంకీ అట్లూరి అన్నారు. "తొలిప్రేమతో పవన్‌కు ఎంత పేరొచ్చిందో.. వరుణ్‌కు అంతే పేరొస్తుందని నమ్ముతున్నా" అని అల్లు అరవింద్ అన్నారు. ఫిబ్రవరి 9న సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

ఇంకెవరైనా చేసుంటే బాధపడేదాన్ని

- అనుష్క

"మిర్చి చేస్తున్నప్పుడు ఈ కథ విన్నా. డేట్స్ కుదరకపోవడంతో అశోక్‌గారు, యు.వి సంస్థ నా కోసం ఐదేళ్లు ఎదురుచూశారు. షూటింగ్ మొదలయ్యాక సినిమా నాకు మరింత దగ్గరైంది. నేను కాకుండా 'భాగమతి' క్యారెక్టర్ ఎవరు చేసినా బాధపడేదానిని" అని అనుష్క అన్నారు. ఆమె ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'భాగమతి'. జి.అశోక్ దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. అల్లు అరవింద్ మాట్లాడుతూ "పెద్ద తెర మీద ట్రైలర్ చూశాక చాలా భయమేసింది. మంచి సినిమా అవుతుందనే నమ్మకం కలిగింది. పరిశ్రమలో ఎవరికీ లేని ఓపిక అనుష్కకు ఉంది. కొన్నేళ్ల క్రితమే 'అరుంధతి' సినిమాతో ప్రూవ్ చేసింది. అలాంటి సినిమా చేశాక ఆమెకు ఇవన్నీ పెద్ద లెక్కకాదు. బొమ్మాళీగా ఎంత పేరొచ్చిందో భాగమతిగా కూడా అంతే పేరురావాలి" అని అన్నారు. నాని మాట్లాడుతూ "ఇప్పటి వరకూ అశోక్ అనగానే 'పిల్ల జమీందారు' దర్శకుడు అంటుంటారు. ఈ సినిమా తర్వాత 'భాగమతి' దర్శకుడు అంటారు. ఈ ఏడాది తెలుగు ఇండస్ట్రీకి ఇంకా సరైన హిట్ రాలేదు. 'భాగమతి' అందుకు ప్రారంభం అనుకుంటున్నాను" అని చెప్పారు. అశోక్ మాట్లాడుతూ "గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది. కానీ ఎలాగైనా గెలవాలనుకున్నప్పుడు మాత్రమే మోసం మొదలవుతుంది. ఈ రెండు సమాజంలో పార్లల్‌గా జరుగుతూనే ఉంటాయి. తను గెలుస్తూ, చుట్టూ ఉన్నవాళ్లను గెలిపించాలనుకునే ఆలోచన వస్తే అతను మనిషి కాదు దేవుడు. అలాంటి దేవుడు ప్రభాస్. ఆయనే మొదట ఈ కథ విని యు.వి.సంస్థతో కలిపి నన్ను ముందుకు నడిపించారు. ఈ సినిమాకు ప్రాణప్రతిష్ఠ చేసిన వ్యక్తి అనుష్క. అరుంధతి, రుద్రమదేవి, సరోజ, దేవసేన పాత్రలతో ఎలాగైతే ఆకట్టుకుంటో భాగమతిగా కూడా అదే తరహాలో ఆకట్టుకుంటుంది" అని అన్నారు. మేర్లపాక గాంధీ, మారుతి, రాధాకృష్ణ, ప్రభాస్ శ్రీను, ధన్‌రాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



'భాగమతి' ప్రీ రిలీజ్ వేడుక దృశ్యం

నో పొలిటికల్ స్కెచ్!



విక్రమ్

"సినిమాలే నా జీవితం! నాకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. సరిగా ధోతి (పంచె) కట్టుకోవడమే రాదు. ఇక, రాజకీయాలేం చేస్తా" అన్నారు విక్రమ్. ఆయన హీరోగా నటించిన 'స్కెచ్' త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా విక్రమ్ చెప్పిన విశేషాలివీ...

- ❖ 'స్కెచ్'... మాస్ అండ్ కమర్షియల్ సిన్మా. ఇందులో కారు లోన్స్ వసూలు చేసే వ్యక్తిగా నటించా. మొండి బకాయిలు వసూలు చేయడానికి ఎలాంటి స్కెచ్చ్ వేస్తాననేది ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. క్లైమాక్స్ ట్విస్ట్ సూపర్ షాకిస్తుంది. మెకానిక్‌గా కనిపిస్తూ... గూండాయిజం నేపథ్యంలో నా పాత్ర ఉంటుంది. ఏడేళ్ళ క్రితం జరిగిన వాస్తవ ఘటనలతో దర్శకుడు విజయ్ చందర్ ఈ కథ రాశారు. అదేంటో చెబితే ప్రేక్షకులకు కిక్ ఉండదు. హీరోయిన్ తమన్నా బ్రాహ్మణ అమ్మాయిగా నటించింది. మా కెమిస్ట్రీ, రొమాన్స్ సహజంగా, ఫ్రెష్‌గా ఉంటుంది.
- ❖ సాధారణంగా 'శివపుత్రుడు', 'అపరిచితుడు', 'నాన్న', 'ఐ' ప్రయోగాత్మక చిత్రాల్లో నటనకు ప్రశంసలొస్తాయి. కానీ, 'ధూల్', 'సామి', 'మల్లన్న', 'స్కెచ్' వంటి మాస్ చిత్రాలకు తక్కువొస్తాయి. మాస్ చిత్రాల్లో నటనతో మెప్పించడమూ ప్రయోగమే. 'స్కెచ్'తో నేను చేసిన ప్రయోగానికి తమిళనాట చాలా ప్రశంసలొచ్చాయి. నా భార్య కూడా అందరూ మీ నటనను మెచ్చుకుంటున్నారని చెప్పింది. తెలుగు ప్రేక్షకులూ చిత్రాన్ని ఎంజాయ్ చేస్తారు.
- ❖ మా అబ్బాయి(ధృవ్)ని మూడేళ్ల తర్వాత హీరోగా పరిచయం చేయాలనుకున్నా. తనదీ అదే ఆలోచన. కానీ, ధృవ్ డబ్‌స్మాష్‌లు చూసిన నిర్మాతలు 'అర్జున్‌రెడ్డి' రీమేక్ చేద్దామని పట్టుబట్టారు. నేనూ సినిమా చూశా. నచ్చింది. దాంతో చేయమని చెప్పా. సరేనన్నాడు. తండ్రిగా నా మాటకు విలువిచ్చాడని హ్యాపీగా ఫీలయ్యా. సినిమా పూర్తయ్యాక మళ్ళీ వెనక్కి వెళ్ళి డైరెక్షన్ కోర్సు చేస్తానన్నాడు.
- ❖ ప్రస్తుతం గౌతమ్‌మీనన్‌తో 'ధ్రువనక్షత్రం', హరితో 'సామి స్క్వేర్' చేస్తున్నా. తర్వాత కమల్‌హాసన్‌గారి బ్యానర్‌లో థ్రిల్లర్ మూవీ చేయబోతున్నా. ఆ తర్వాత 'మహావీర్ కర్ణ' ఆస్కార్ రేంజ్‌లో ఉంటుంది. ఫిబ్రవరిలో ఆ సినిమా వివరాలు ప్రకటిస్తారు.

రామ్ సతీమణి

మానవ సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన చిత్రం 'వైఫ్ ఆఫ్ రామ్'. లక్ష్మీ మంచు కీలక పాత్రలో నటించారు. విజయ్ యలకంటి దర్శకుడు. కృతి ప్రసాద్, విద్యా నిర్వాణ మంచు ఆనంద్ సమర్పిస్తున్నారు. టి.జి.విశ్వప్రసాద్, లక్ష్మీ మంచు నిర్మాతలు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సామ్రాట్ రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, శ్రీకాంత్ అయ్యర్ ఇతర పాత్రధారులు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మంచు లక్ష్మి పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. అబద్ధాలను నిజమని నమ్మే పాత్రలో ఆమె నటించారు. రామ్ భార్యగా లక్ష్మి మంచు పాత్ర అద్భుతంగా ఉంటుందని, ఆమె చాలా సహజంగా నటించారని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: రఘు దీక్షిత్, కెమెరా: సామల భాస్కర్, మాటలు: సందీప్ గంటా, ఎడిటింగ్: తమ్మిరాజు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సుహాసిని రాహుల్.



లక్ష్మీ

డార్క్ కామెడీ 'మిఠాయి'



రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, విజయ్

"నాకు పెళ్లిచూపుల నుంచి పరిచయమైన మిత్రులు కలిసి చేస్తున్న సినిమా 'మిఠాయి'. ప్రశాంత్ ఈ చిత్రాన్ని డార్క్ కామెడీలో రూపొందిస్తున్నాడని తెలిసి చాలా ఆసక్తికరంగా వేచి చూస్తున్నాను" అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయనతో పాటు సందీప్ రెడ్డి వంగా, క్రాంతిమాధవ్ ముఖ్య అతిథులుగా 'మిఠాయి' సినిమా ప్రారంభోత్సవం జరిగింది. రెడ్ యాంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ కుమార్ దర్శకనిర్మాణంలో తెరకెక్కుతోన్న సినిమా ఇది. గాయత్రి గుప్తా, శ్వేత వర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి పులికొండ, భూషణ్ కల్యాణ్, కమల్ కామరాజు, రవివర్మ, అజయ్ ఘోష్, విజయ్ మరూర్ కీలక పాత్రధారులు. ప్రేక్షకులను మెప్పించే కథ అని రాహుల్ రామకృష్ణ తెలిపారు. సంగీతానికి అవకాశమున్న సబ్జెక్ట్ అని సంగీత దర్శకుడు వివేక్ సాగర్ చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని శ్వేతా వర్మ, గాయత్రి గుప్తా తెలిపారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. తప్పకుండా మా సినిమా అందరికీ నచ్చుతుంది" అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్, కెమెరా: సాకేత్ సౌరభ్, ఎడిటింగ్: వీణుభూషణ్, నృత్యాలు: అని, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కృష్ణ వొడపల్లి.

ఎందుకు చూడరు?



కంగనా రనౌత్

ఎవరు చూడరని చెప్పేది? ప్రేక్షకులు చూశారు కదా.. మిఖా సింగ్, మేరీ కోమ్ కథలతో సినిమాలు తీస్తే! ఆ రెండూ మంచి వసూళ్లు సాధించాయి కూడా. అటువంటప్పుడు మహారాణా ప్రతాప్, రాణీ (ఝాన్సీ) లక్ష్మీభాయ్, ఛత్రపతి శివాజీ చూడరా? అని ప్రశ్నిస్తున్నారు కంగనా రనౌత్. ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవిత కథతో రూపొందుతోన్న హిందీ చిత్రం 'మణికర్ణిక'లో టైటిల్ రోల్ చేస్తున్నారామె. "ఈ రోజుల్లో 'లివింగ్ రూమ్ పార్ట్-3', 'బెడ్ రూమ్ పార్ట్-4' వంటి చిత్రాలు తీయడం ఈజీ. కానీ, చరిత్రకు చెందిన కథలతో చేయాలంటే... దర్శక-నిర్మాతల దగ్గర డబ్బులు మాత్రం ఉండవు. 'మనం తీసినా అలాంటి చిత్రాలు ఎవరు చూస్తారండీ?' అంటుంటారు. అప్పుడు భలే కోపం వస్తుంది. దీనికి తోడు మన దేశంలో సృజనకారుల (క్రియేటివ్ పీపుల్)కి ఫ్రీడమ్ లేకుండా పోతుందంటారు. భారతీయ సినిమాకు వందేళ్లు. ఈ వందేళ్లలో మనోళ్లు ఏం సాధించారు? సినిమాల్లో ఏం చూపిస్తున్నారు? ఈవ్ టీజింగ్, స్త్రీలను సెక్సీగా చూపించడం.. ఇవే కదా! ఈ లెక్కన చూస్తే... ఫ్రీడమ్‌ని వేస్ట్ చేస్తున్నట్టే" అని కంగనా పేర్కొన్నారు.

వామ్మో.. భయమేస్తోంది!



దీపిక

'పద్మావత్' చిత్రాన్ని ప్రదర్శించడానికి తమకు భయంగా ఉందని గుజరాత్‌లోని మల్టీప్లెక్స్ థియేటర్ల యజమానులు చెబుతున్నారు. దీపిక పడుకొనే నాయికగా సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన చిత్రం 'పద్మావత్'. అనేక అడ్డంకులను దాటుకుని ఈ నెల 25న విడుదలకు సిద్ధమైంది. "పలు రాష్ట్రాల్లో 'పద్మావత్' ప్రదర్శనపై నిషేదాన్ని ఎత్తివేస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను గౌరవిస్తున్నాం. అయితే ఆ సినిమాను ప్రదర్శిస్తే, కర్ణిసేనతో పాటు ఇతర పలు బృందాలు మా థియేటర్లను తగలబెడుతాయి. ఆ నష్టం మాత్రం భరించలేం. అందుకే 'పద్మావత్'ను ప్రదర్శించడానికి వెనుకాడుతున్నాం" అని గుజరాత్ మల్టీప్లెక్స్ అసోసియేషన్ డైరక్టర్ రాకేష్ పటేల్ అన్నారు. రాజస్థాన్ థియేటర్ల యజమానులూ ఇదే విషయాన్ని వ్యక్తం చేస్తున్నారు.





భావన

శుభ ఘడియలు ఎంతో దూరంలో లేవు... కుమారి భావన శ్రీమతి కావడానికి! కన్నడ నిర్మాత నవీన్, కథానాయిక భావనవివాహం ఈరోజే. త్రిసూర్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో పెళ్లి జరగనుంది. పెళ్లికి ముందు మెహందీ వేడుక జరిగింది. అందులో స్నేహితులతో కలసి భావన సందడి చేశారు.

చాలా సిన్సియర్



శ్రీనివాసరావు, ప్రణవి, చాందిని కీలక పాత్రల్లో ఆర్.కె.డి. దర్శకత్వంలో సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మిస్తున్న చిత్రం 'శీనుగాడిప్రేమ'. సిన్సియర్‌రా మామా అనేది ఉపశీర్షిక. ప్రస్తుతం రీరికార్డింగ్ జరుగుతోంది. లవ్, సెంటిమెంట్, యాక్షన్, కామెడీ ఉన్న సినిమా అని నిర్మాత తెలిపారు.

పాటల 'దివ్యమణి'

సురేశ్ కమల్, కిమాయ, వైశాలి కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'దివ్యమణి'. గిరిధర్ గోపాల్, స్టీవ్ శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. స్టీవ్ శ్రీధర్ సంగీతం అందించిన ఈ చిత్రం పాటల్ని ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆడియో సీడీలను విడుదల చేసిన డా.యామినీ కృష్ణమూర్తి సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. యాక్షన్ తరహా కథతో రూపొందిన చిత్రమిదని సురేశ్ కమల్ అన్నారు. సాయికుమార్; బలభద్రపాత్రుని రమణి, రామ్, లక్ష్మణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కిమాయ

ఉత్పత్తి దశలోనే
పాన్ మసాలాపై సెస్!
» నిర్ణయం తీసుకోనున్న జీఎస్‌టి మండలి

న్యూఢిల్లీ: పాన్ మసాలా సహా కొన్ని ఉత్పత్తులపై తయారీ దశలోనే సెస్ విధించాలని ప్రభుత్వం భావిస్తోంది. చిన్నచిన్న ప్యాకెట్లలో అమ్మే ఈ ఉత్పత్తుల సరఫరాలను కనిపెట్టి పన్నులు విధించడం కష్టంగా మారిందని పన్ను అధికారులు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. దీనికి తోడు ఇటీవల జిఎస్‌టి పన్ను వసూళ్లు నీరసించాయి. దీంతో పాన్ మసాలాతో సహా అలాంటి మరిన్ని వస్తువులను ఫ్యాక్టరీల ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా, తయారీ దశలోనే పన్ను విధించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్

ఈ ఏడాది వృద్ధిలో మళ్లీ మనమే నం.1.. సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా అవతరించనుందని, మళ్లీ చైనాను వెనక్కి నెట్టనుందని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొంది. అంతేకాదు, ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్ ఎదగనుందని అంచనా వేస్తోంది. ప్రపంచంలోని మిగతా దేశాల్లో వ్యవస్థాగతంగా పెద్దగా మార్పులు జరగట్లేదని, వృద్ధి సైతం కనిష్ఠ స్థాయిలోనే నమోదవుతోందని రిపోర్టు పేర్కొంది. భారత్ మాత్రం సంస్కరణల పథంలో పయనిస్తూ దీర్ఘకాలం పాటు గరిష్ఠ వృద్ధిని నమోదు చేసుకోగలదని అభిప్రాయపడింది. అభివృద్ధి చెందిన దేశాలు 2-3 శాతం వృద్ధికే మురిసిపోతుంటే, భారత్ మాత్రం 7.5 శాతానికి మించిన జిడిపి వృద్ధిపై దృష్టిసారించిందని నివేదిక వెల్లడించింది.



11500 స్థాయికి నిఫ్టీ

ప్రస్తుతం భారత్‌లో స్థిర ఆదాయ పథకాలపై వార్షిక రాబడి 6-8 శాతంగా ఉండగా.. ఈక్విటీలు అంతకంటే మెరుగైన రిటర్నులను పంచుతున్నాయని సాంక్టమ్ నివేదిక అంటోంది. కానీ, ఈ ఏడాది ద్రవ్యోల్బణం భారీగా పెరిగి.. ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచితే మాత్రం ఈక్విటీ మార్కెట్ల నుంచి రాబడి అవకాశాలు సన్నగిల్లుతాయని, కార్పొరేట్ కంపెనీల నిరాశాజనక ఆర్థిక ఫలితాలు కూడా స్టాక్ మార్కెట్ పనితీరుపై ప్రభావం చూపవచ్చని అభిప్రాయపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ) ప్రామాణిక సూచీ నిఫ్టీ-50 అప్‌ట్రెండ్‌లో ముందుకు సాగుతోందని, సూచీ 10490-10580 స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోగలిగితే మీడియం టర్మ్‌లో 11200-11500 స్థాయిలకు చేరుకోవచ్చని సాంక్టమ్ అంచనా వేస్తోంది.

డిఐఐలే మార్కెట్ నిర్దేశకులు

ఇకపై భారత్ ఈక్విటీ మార్కెట్లో షేర్ల ధరలను నిర్దేశించేది దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లేన(డిఐఐ)ని సాంక్టమ్ అంటోంది. గత ఏడాదిలో విదేశీ ఇన్వెస్టర్లు 800 కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులు పెట్టగా.. దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు 1,530 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేశాయని నివేదికలో పేర్కొంది.



ఆదివారం ముంబైలో జరిగిన 'టాటా ముంబై మారథాన్ 2018'లో పాల్గొన్న టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను ఆయన కేవలం 2 గంటల 3 నిమిషాల్లో పూర్తి చేశారు. ఇప్పటివరకు చంద్రశేఖరన్ పాల్గొన్న మారథాన్‌లన్నింటిలో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. సుదూర పరుగు పోటీల్లో పాల్గొనడం ఆయన హాబీ.

రూ.లక్ష కోట్లకు అల్లంత దూరంలో..



» ఐపిఒ మార్కెట్‌పై హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్

ముంబై : దలాల్ స్ట్రీట్ జోరుగా ముందుకు సాగిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కంపెనీలు తొలి పబ్లిక్ ఆఫర్ల (ఐపిఒ) ద్వారా రికార్డు స్థాయిలో 71,500 కోట్ల రూపాయలు సమీకరించాయి. అయితే కంపెనీల నుంచి మూలధన డిమాండ్ ఏర్పడటంతో పాటు మలి విడత పబ్లిక్ ఇష్యూ (ఎఫ్‌పిఒ)లు వచ్చి ఉంటే ఈ మొత్తం లక్ష కోట్ల రూపాయలకు చేరుకునే అవకాశం ఉండేదని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ చెబుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 122 కంపెనీలు ఐపిఒల ద్వారా 71,500 కోట్ల రూపాయలు సమీకరించాయి. మొత్తం సొమ్ములో 52,000 కోట్ల రూపాయల సమీకరణ గత సెప్టెంబరు, నవంబరు మధ్యకాలంలోనే జరిగింది. 2016-17 సంవత్సరంలో ఐపిఒల ద్వారా కంపెనీలు సమీకరించిన మొత్తం 52,000 కోట్ల రూపాయలుగా, అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 15,000 కోట్ల రూపాయలుగా ఉంది.

ఇదిలా ఉంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐపిఒ మార్కెట్ మరింత గరిష్ఠ స్థాయికి చేరి ఉండేదని, అయితే కంపెనీల విస్తరణ కార్యకలాపాలు లేకపోవడం వల్ల ఇది జరగలేదని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ధీరజ్ రెల్లి తెలిపారు. కంపెనీల వద్ద అధిక ఉత్పత్తి సామర్థ్యం ఉందని, అయితే ఈ స్థాయిలో డిమాండ్ లేదని ఆయన చెప్పారు. ప్రస్తుత సామర్థ్య వినియోగం తక్కువగా ఉండటం, తాజాగా రుణం ఇవ్వడానికి బ్యాంకులు/రుణదాతలు కఠిన వైఖరులను అనుసరించడం వల్ల కంపెనీలకు సవాళ్లు ఎదురవుతున్నట్టు ఆయన తెలిపారు.

కాగా ఈక్విటీ మార్కెట్లు మెరుగ్గా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం విషయంలో మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నమోదైన కంపెనీల పనితీరు ఆధారంగా భవిష్యత్ ఐపిఒలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. ప్రభుత్వరంగంలోని రక్షణ యూనిట్లు, కెమికల్స్, లాజిస్టిక్స్, విమానాశ్రయాలు, హోటళ్లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు సంబంధించిన ఇష్యూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రైమరీ మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో మొండి బకాయిలు అమ్మేద్దాం



» అమెరికా, కొరియాల్లో అలానే చేస్తున్నారు
» ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఆచార్య

ముంబై : బ్యాంకుల నడ్డి విరుస్తున్న మొండి బకాయి (ఎన్‌పిఎ)ల సమస్య పరిష్కారానికి రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య సూచన చేశారు. అమెరికా, దక్షిణ కొరియాల్లోలా ఇలాంటి ఆస్తులను అమ్మేసే విషయం ఆలోచించాలని కోరారు. 'తమ బ్యాంకులు సంక్షోభంలో ఉన్నపుడు అమెరికా, దక్షిణ కొరియా దేశాలు ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. రుణాల అమ్మకాలకు ఇప్పుడిది అంతర్జాతీయంగానూ ప్రామాణికంగా మారింది. మన దేశంలోనూ అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాన్ని బ్యాంకులు పరిశీలించాలని కోరుతున్నా' అని బ్యాంకులకు సూచించారు. దివాలా చట్టం కింద ఎన్‌సిఎల్‌టిలోనూ బ్యాంకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆచార్య ఈ సూచన చేయడం విశేషం. గత ఏడాది సెప్టెంబరు నాటికే దేశంలోని బ్యాంకుల ఎన్‌పిఎల భారం రూ.10 లక్షల కోట్లకు చేరింది. మొత్తం బ్యాంకుల రుణాల్లో ఇది 10.2 శాతానికి సమానం.

వారం ప్రథమార్ధం కీలకం

(జనవరి 22-25 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 10895 (+214)

నిఫ్టీ గత వారం 10667-10907 పాయింట్ల మధ్యన కదలాడి 214 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా క్లోజయింది. శుక్రవారం నాడు మార్కెట్ 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకి వరుసగా ఏడో వారంలో కూడా సానుకూలంగా ముగిసింది. బడ్జెట్ సమీపిస్తున్నందు వల్ల బడ్జెట్‌లోని అంశాలను మార్కెట్లు ఫ్యాక్టర్ ఇన్ చేసుకోవచ్చు. మార్కెట్ భవిష్యత్ కదలికలకు ఈ వారం ప్రథమార్ధం కీలకం. గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేస్తే మరింత పైకి వెళ్లవచ్చు.

- గత వారంలో కుంభంలోని ధనిష్ఠ నుంచి మొదలైన మార్కెట్ ఈ మంగళవారానికి మీనంలో ప్రవేశిస్తుంది. కుంభ సంచారం సమయంలో 10830-10907 మధ్యన కదలాడి 10895 వద్ద క్లోజయింది. మంగళవారం నాటికి వచ్చే కొద్ది వారాలకు పరిధి ఏర్పడుతుంది.

గ్రహగతులివే..

- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1 నుంచి మేషంలోని భరణి పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 4 నుంచి శ్రవణం పాదం 1 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3-4 మధ్యలో బుధ సంచారం
- మకరంలోని శ్రవణం పాదం 3-4 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 4 నుంచి అనూరాధ పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3-4 మధ్యలో మిథున నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 2లో వృషభ నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం

- స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక దృక్పథాలు మూడింటిలోనూ నిఫ్టీ బుల్లిష్‌గా ఉంది. 10700 కన్నా దిగువన ముగిసినప్పుడే బేరిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10604, 10412, 10249, 9927 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఎల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 11000
బ్రేక్‌డౌన్ స్థాయి : 10700
నిరోధ స్థాయిలు : 11050, 11125 (10975 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10750, 10675 (10825 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ముగింపు సెషన్ నిస్తేజం (సోమవారానికి)

తిథి : మాఘ శుద్ధ పంచమి
నక్షత్రం : ఉత్తరాభాద్ర
భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.
ట్రెండ్ మార్పు వేళలు : 1.23
ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10 గంటల తర్వాత నిలకడ/నిస్తేజంగా మారి చివరి వరకు అదే ధోరణి ప్రదర్శించే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
నిరోధ స్థాయిలు : 10935, 10970
మద్దతు స్థాయిలు : 10855, 10820
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

4.5 కోట్ల టన్నులు

» వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఎండిసి ఉత్పత్తి లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ ముడి ఇనుము ఉత్పత్తి దిగ్గజం ఎన్‌ఎండిసి (జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ) భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఉత్పత్తిని 4.5 కోట్ల టన్నులకు పెంచుకోవాలని అనుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) ముడి ఇనుము ఉత్పత్తి 3.5 కోట్ల టన్నులుగా నమోదు కావచ్చని అంచనా వేస్తోంది. 2016-17లో 3.45 కోట్ల టన్నులుగా ఉంది. 2017-18లో మొదటి రెండు త్రైమాసికాలు (ఏప్రిల్-సెప్టెంబరు) ఉత్పత్తి మెరుగ్గానే ఉన్నప్పటికీ.. వర్షాల కారణంగా మూడో త్రైమాసికంలో రైల్వే లైన్ బాగా దెబ్బతిందని, దాన్ని బాగు చేయడానికి నెలన్నర పట్టిందని ఎన్‌ఎండిసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) ఎన్ బైజేంద్ర కుమార్ తెలిపారు. అయినప్పటికీ ఉత్పత్తిని గత ఆర్థిక సంవత్సరం స్థాయికి పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. 2022 నాటికి ప్రొడక్షన్‌ను 6.7 కోట్ల టన్నులకు పెంచాలని కంపెనీ టార్గెట్‌గా పెట్టుకుంది.

నవంబరులో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి షురూ

ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్నార్‌లో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్‌లో ఈ ఏడాది నవంబరు నుంచి ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభం కావచ్చని బైజేంద్ర కుమార్ వెల్లడించారు. ఈ ప్లాంట్ కోసం ఇప్పటికే రూ.13,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిన ఎన్‌ఎండిసి నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రూ.2-3 వేల కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి రావచ్చని అంచనా వేస్తోంది.

వజ్రాల మైనింగ్‌పైనా ఫోకస్

మధ్యప్రదేశ్‌లోని పన్నా వజ్రాల గనిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎన్‌ఎండిసి.. ఆ రాష్ట్రంలో మరిన్ని గనులను దక్కించుకోవాలని చూస్తోంది. నామినేషన్ బేసిస్‌లో మరిన్ని వజ్రాల గనులను కేటాయించాలని కోరుతూ మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు బైజేంద్ర కుమార్ తెలిపారు. ఒకవేళ వారు టెండర్లు ఆహ్వానిస్తే బిడ్డింగ్‌లో పాల్గొంటామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సమస్యలు తలెత్తడంతో వజ్రాల వెలికితీత కార్యకలాపాలు కుంటుపడ్డాయి. కాగా పన్నా వజ్రాల గని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం లక్ష క్యారట్లు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	402.00	చిత్తూరు	403.00
వరంగల్	404.00	చెన్నై	410.00
విజయవాడ	412.00	నమక్కల్	395.00
గోదావరి	412.00	బెంగళూరు	408.00
విశాఖపట్నం	412.00	ముంబై	447.00



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	75.00	విజయవాడ	80.00
కరీంనగర్	77.00	గుంటూరు	80.00
వరంగల్	75.00	ఒంగోలు	82.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	70.00
కర్నూలు	75.00	నెల్లూరు	78.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	78.00
గోదావరి	76.00		



వచ్చే ఏడాదిన్నర కాలంలో మరో నాలుగు కొత్త కార్లు : మారుతి

పుణె : మారుతి సుజుకీ వచ్చే 12-18 నెలల కాలంలో నాలుగు కొత్త కార్లను మార్కెట్లోకి విడుదల చేయాలన్న సన్నాహాల్లో ఉంది. వీటి ద్వారా రానున్న కాలంలో మరింత మెరుగైన వృద్ధిని సాధించాలని కంపెనీ యోచిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని కంపెనీ భావిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు కాలంలో కంపెనీ 12,26,418 కార్లను విక్రయించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే అమ్మకాల్లో 15.5 శాతం వృద్ధి నెలకొంది. వచ్చే నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే ఆటో షోలో భాగంగా సరికొత్త స్విఫ్ట్ మోడల్‌ను మారుతి విడుదల చేయనుంది. రానున్న నెలల్లో సియాజ్, ఎర్టిగా మోడళ్లలో కొత్త వెర్షన్లను కంపెనీ తీసుకురానుంది. సరికొత్త వ్యాగన్ ఆర్‌ను కూడా విడుదల చేయనున్నామని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌ఎస్ కల్సి తెలిపారు.

కీలక నిరోధం 11000



వి సుందర్ రాజా

టెక్ వ్యూ



నిఫ్టీ గత వారం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ముందుకు సాగి ఎట్టకేలకు కీలక స్థాయి 10900కు చేరువలో క్లోజయింది. మానసిక అవధి 11000 వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. 10000 పాయింట్ల వద్ద కొద్ది రోజుల క్రితం ఏర్పడిన అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 1000 పాయింట్ల వరకు లాభపడింది. అయితే మార్కెట్లో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. రానున్న కొద్ది రోజుల్లో కరెక్షన్ లేదా కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉన్నందువల్ల గరిష్ఠ స్థాయిల్లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి తదుపరి నిరోధం 11000. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం కనీసం రెండు రోజుల పాటు ఈ స్థాయి కన్నా పైన క్లోజ్ కావాలి.

బేరిష్ స్థాయిలు: 11000 వద్ద విఫలమైతే మరింత కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10700. సాధారణ పరిస్థితుల్లో ఈ స్థాయిని తాకకపోవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ: బ్యాంక్ నిఫ్టీ 26000 వద్ద బలమైన బ్రేకౌట్ సాధించి గత వారం సుమారు వెయ్యి పాయింట్ల మేరకు పెరిగి 27000కి చేరువ అయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 26400.

సోమవారం స్థాయిలివే...
నిరోధం: 10940, 11000
మద్దతు: 10850, 10790

స్వల్పకాలిక వ్యూహం: 10700 కన్నా దిగువన స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు బై పొజిషన్లు హోల్డ్ చేయవచ్చు.

పాటర్న్...

11000 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ దగ్గర నిరోధం ఉంది. ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా ఇండెక్స్ చాలా పైన ఉండడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. గతంలో ఏర్పడిన బాటమ్ 10700 కన్నా దిగజారినప్పుడే స్వల్పకాలిక కరెక్షన్‌కు ఆస్కారం ఉంటుంది. స్వల్పకాలిక 20 డిఎంఎ కన్నా మార్కెట్ చాలా పైన ఉంది.

టైమ్ : ఈ సూచిక ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

భారత్ ఫోర్జ్ (రూ.736) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.740 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.770	రెండో నిరోధం రూ.800
రూ.720 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.690	రెండో మద్దతు రూ.660

దివాన్ హౌజింగ్ (రూ.614) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.615 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.640	రెండో నిరోధం రూ.670
రూ.600 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.570	రెండో మద్దతు రూ.540

■ వి సుందర్ రాజా,
www.sundartrends.in

ప్రీ బడ్జెట్ అంచనాలే కీలకం

"ఈ వారంలో ప్రీ బడ్జెట్ అంచనాలు, కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు, ఫ్యూచర్స్ కాంట్రాక్టుల ధోరణి మార్కెట్ కదలికలకు కీలకం కావచ్చు. బడ్జెట్ కౌంట్‌డౌన్ ప్రారంభం కానున్నందు వల్ల కొంత కాలం పాటు ఆటుపోట్లు అధికంగా ఉండవచ్చు."

మార్కెట్ నాడి

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29న ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సెలవు కావడం వల్ల ఈ వారంలో నాలుగు రోజులే ట్రేడింగ్ జరుగుతుంది. గత వారంలో కీలక ఇండెక్స్‌లు కొత్త మైలురాళ్లు అధిగమించాయి. సెన్సెక్స్ 35500 పాయింట్లు, నిఫ్టీ 10900 పాయింట్లు దాటాయి. ప్రభుత్వం అదనపు రుణ సమీకరణ లక్ష్యం కుదించుకుంటున్నట్టు చేసిన ప్రకటన మార్కెట్లలో కొత్త ఉత్తేజం నింపింది. ఎప్పటివలెనే క్రూడాయిల్ ధరలు, అంతర్జాతీయ సంకేతాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారు.

- గురువారం ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ముగింపు రోజు కావడం వల్ల ఆటుపోట్లు అధికంగా ఉండవచ్చు. వారాంతంలో రిలయన్స్, విప్రో వంటి దిగ్గజాలు ప్రకటించిన ఆర్థిక ఫలితాలకు ఇన్వెస్టర్ల స్పందనతో సోమవారం మార్కెట్ ప్రారంభం కానుంది.



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

టెక్నికల్స్ ఇవే...

మార్కెట్లో ప్రస్తుత జోరు మరింతగా కొనసాగవచ్చునేందుకు సూచనగా డెయిలీ చార్టుల్లో బుల్లిష్ ఎన్‌గల్ఫింగ్ పాటర్న్ (దిగువ నుంచి ఎగువకు కాండిల్స్ నిర్మాణం) ఏర్పడింది. ఫలితంగా మద్దతు స్థాయి కూడా 10780కి పెరిగింది. నిఫ్టీ ఈ వారంలో కీలక మైలురాయి 11000 దిశగా నిఫ్టీ ప్రయాణం సాగవచ్చు.

- బ్యాంక్ నిఫ్టీలో అవర్లీ చార్టుల్లో ఫ్రెష్ ఫ్లాగ్ పాటర్న్ ఏర్పడింది. బ్రేకౌట్ ఏర్పడడం కూడా 27200 దిశగా ర్యాలీ ఉంటుందనేందుకు సంకేతం. మద్దతు స్థాయి 26410.
- డెరివేటివ్స్ విభాగంలో వరుసగా ఏడో వారంలో కూడా రికార్డు గరిష్ఠ స్థాయిలు నమోదయ్యాయి. నిఫ్టీ ఫ్యూచర్స్ 2.15 శాతం వృద్ధితో 10916 వద్ద వారానికి క్లోజయింది. రెండు నెలల పాటు సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణులు ముగించుకుని ఈ ఇండెక్స్ నిఫ్టీ కన్నా మెరుగైన పనితీరు కనబరిచింది. బ్యాంక్ నిఫ్టీ ఫ్యూచర్స్ కూడా 4.47 శాతం పెరిగి 26894 పాయింట్ల వద్ద ముగిసింది.
- ప్రస్తుత సీరీస్‌కు గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ 11000 సిఇ, 10500 పిఇ వద్ద ఉంది. బ్యాంక్ నిఫ్టీకి ఇది 27000 సిఇ, 26500 పిఇ వద్ద ఉంది.

ఈ వారం ఫలితాలివే...

యాక్సిస్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, మారుతి, యుపిఎల్, జిందాల్ స్టీల్, బయోకాన్, పిడిలైట్, ఏషియన్ పెయింట్స్

అంతర్జాతీయ సంఘటనలు

బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని మంగళవారం ప్రకటించనుంది. యూరోపియన్ యూనియన్ ఆర్థిక సెంటిమెంట్ సర్వే కూడా అదే రోజు వెలువడుతుంది. జనవరి నెలకు జపాన్, యూరోపియన్ యూనియన్‌లలో తయారీ రంగం పిఎంఐ బుధవారం ప్రకటించనున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య విధానం, అమెరికాలో నిరుద్యోగ గణాంకాలు గురువారం వెలువడనున్నాయి.